మంగళవారం
12-11-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 51
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad, Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

జపాన్ ప్రధానిగా తిరిగి షిగేరు ఇషిబా ఎన్నిక

టోక్యో: జపాన్‌కు చెందిన లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డీపీ) నాయకుడు షిగేరు ఇషిబా జపాన్ డైట్‌లోని ఉభయ సభల్లో అత్యధిక ఓట్లు సాధించి దేశ ప్రధానమంత్రిగా తిరిగి సోమవారం ఎన్నికయ్యారు. ప్రధానమంత్రిని ఎంపిక చేసేందుకు డైట్ లేదా పార్లమెంట్ సోమవారం మధ్యాహ్నం అసాధారణ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో తిరిగి ఇషిబా గెలుపొందారు. ఈ విషయమై ఇషిబా ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ "నేను జపాన్ 103వ ప్రధానమంత్రిగా నియమించబడ్డాను. దేశ ప్రజలకు సేవ చేయడానికి నేను నా వంతు కృషి చేస్తాను" అని వెల్లడించారు. హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌లో జరిగిన రనఫ్ ఓటింగ్‌లో 67 ఏళ్ల ఇషిబా 221 ఓట్లను పొందారు.

11 మంది కుకీ మిలిటెంట్లు కాల్చివేత

ఇంఫాల్: మణిపూర్‌లో మరోసారి హింస చెలరేగింది. జిరిబామ్ జిల్లాలో మిలిటెంట్లు, భద్రత బలగాల మధ్య కాల్పుల్లో 11 మంది సాయుధులు మృతి చెందారు. స్థానిక పోలీస్ స్టేషన్‌పై మిలిటెంట్లు దాడులకు తెగబడిన సమయంలో ఈ ఘటన చోటు చేసుకున్నది. మృతులను కుకీ తిరుగుబాటుదారులుగా అనుమానిస్తున్నారు. మణిపూర్‌లోని జిరిబామ్ జిల్లా బోరోబెక్రా పోలీస్ స్టేషన్‌పై సోమవారం మధ్యాహ్నం కొందరు సాయుధులు దాడులకు పాల్పడ్డారు. అనంతరం

- మిగతా 2 లో

ఈపీఎఫ్‌ఓ వేతన పరిమితి రూ.21 వేలు?

న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ కింద ఉన్న ఉద్యోగుల గరిష్ఠ వేతన పరిమితి పెంచాలని కేంద్రం యోచిస్తోంది. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ 'ఎకనామిక్ టైమ్స్' ఈ కథనం రాసింది. ప్రస్తుతం ఈపీఎఫ్‌ఓ గరిష్ఠ వేతన పరిమితి రూ.15 వేలు ఉండగా... దాన్ని రూ.21 వేలకు పెంచనున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు ఈపీఎఫ్‌ఓలో ఉద్యోగుల సంఖ్య ఆధారంగా కంపెనీల నమోదు తప్పనిసరిగా ఉంటుంది. ఇప్పుడు

- మిగతా 2 లో

రాహుల్‌పై ఈసీకి బీజేపీ ఫిర్యాదు

ముంబై: కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీపై ఎన్నికల సంఘానికి బీజేపీ ఫిర్యాదు చేసింది. కాషాయ పార్టీ, ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగాన్ని అంతం చేసేందుకు చూస్తున్నాయని రాహుల్ వ్యాఖ్యానించారని ఆరోపించింది. మహారాష్ట్ర ఎన్నికల ప్రచార సమయంలో ఆయన అవాస్తవాలు మాట్లాడకుండా అడ్డుకోవాలని ఫిర్యాదులో కోరింది. రాజ్యాంగాన్ని నాశనం చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఇటీవల రాహుల్ గాంధీ ఆరోపించారు. దీనిపై తాజాగా

- మిగతా 2 లో

50 వేల ఉద్యోగాలిచ్చాం

- బీఆర్‌ఎస్ పాలనలో నిరుద్యోగులకు అన్యాయం
- సీఎం రేవంత్‌రెడ్డి

విశాలాంధ్ర–హైదరాబాద్: తెలంగాణ ఏర్పడిన తర్వాత దశాబ్ద కాలంపాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్... నిరుద్యోగ యువతను తీవ్ర నిర్లక్ష్యం చేసిందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఖైరతాబాద్ ఆర్టీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కొత్తగా నియమితులైన అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ల (ఏఎమ్‌వీఐ)కు మంత్రి పొన్నం ప్రభాకర్ తో సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేరలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్కో చిక్కుముడి విప్పుతూ పది నెలల్లో 50వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని వివరించారు. తాను బాధ్యతలు తీసుకున్న రోజే ఎల్బీ స్టేడియంలోనే నియామక పత్రాలు అందించడం ద్వారా నిరుద్యోగుల తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం చూశానని, అది నాకు అత్యంత సంతృప్తి కలిగించిన సందర్భంగా పేర్కొన్నారు. మీ గ్రామంలో విద్యార్థులు, నిరుద్యోగులతో మాట్లాడి పోటీపరీక్షలకు సిద్ధమయ్యేలా స్ఫూర్తి నింపాలని ఎంపికైన ఏఎమ్‌వీఐలకు పిలుపునిచ్చారు. చదువుకుంటేనే గుర్తింపు, గౌరవం అని వారికి విశ్వాసం కల్పించాలన్నారు. లీడర్ అంటే లీడ్ చేసేవాడు,... అందరికీ రోల్ మోడల్ గా నిలిచేలా ఉండాలి కానీ పండగ వస్తే డ్రగ్స్, సారా బుడ్లతో దావత్ చేసుకునే వారు కాదని అన్నారు. అలాంటి వారిని సామజిక బహిష్కరణ చేయాలని యువతను కోరారు. ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన శ్రీకాంతాచారిని రోల్ మోడల్‌గా తీసుకోవాలో, డ్రగ్స్, సారా బుడ్లతో దావత్ చేసుకునే వారిని స్ఫూర్తిగా తీసుకోవాలో యువత ఆలోచించాలని సూచించారు. సరిహద్దుల నుంచి గంజాయి, డ్రగ్స్ రాష్ట్రంలోకి రాకుండా ఉక్కు పాదం మోపాల్సిన అవసరం ఉందన్నారు. కాలుష్యం నుంచి హైదరాబాద్ నగరాన్ని కాపాడుకోవాలంటే రవాణా శాఖ సంపూర్ణ సహకారం ఉండాలన్నారు. త్వరలోనే ఎలక్ట్రిక్ వాహనాల కోసం ఒక విధానం తీసుకొస్తామని వెల్లడించారు.

కేసీఆర్‌కు కౌంటర్

పది నెలల్లో ఏం కోల్పోయారో ప్రజలకు అర్థమైందని ఒకాయన మాట్లాడుతున్నాడు కానీ వాస్తవానికి మీ ఇంట్లో నలుగురు ఉద్యోగాలు కోల్పోయారు తప్ప తెలంగాణ ప్రజలు కోల్పోయిందేం లేదని మాజీ సీఎం కేసీఆర్ ను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇటీవల కేసీఆర్ చేసిన వ్యాఖ్యల పై సీఎం ఘాటుగా స్పందించారు. ఈ పది నెలల్లో తెలంగాణ నిరుద్యోగులు ఉద్యోగాలు పొందారు. రైతులు రైతు రుణమాఫీతో రుణ విముక్తులయ్యారని పేర్కొన్నారు. 1కోటి 5లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో లబ్ధి పొందారు, నష్టాల్లో కూరుకున్న ఆర్టీసీ లాభాల బాటలో పయనిస్తోందన్నారు. 49 లక్షల 90వేల కుటుంబాలు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వినియోగించుకుంటున్నారని పేర్కొ న్నారు. రూ.500లకే ఆడబిడ్డలు వంటగ్యాస్ సిలిండర్ అందుకోగలుగుతున్నారని, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా 10లక్షల వరకు ఉచిత వైద్యం అందుకోగలుగుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా మీలో మార్పు రావాలి,... ప్రభుత్వం చేసే మంచి పనులకు మద్దతు ఇవ్వండి... లోపాలు ఉంటే సలహాలు ఇవ్వండని సూచించారు. బడి దొంగలను చూశాం కానీ... ప్రతిపక్ష నాయకుడు అసెంబ్లీకి రాకుండా ఉన్న విచిత్ర పరిస్థితి తెలంగాణలో చూస్తున్నామని ఎద్దేవా చేశారు.

దేశ సమైక్యతకు గాంధీ పరివార్ కృషి

2లో

అధికారులపై దాడి

రాళ్లు, కర్రలతో విరుచుకుపడిన రైతులు

- మూడు వాహనాల ధ్వంసం
- ఫార్మా కంపెనీపై అభిప్రాయ సేకరణ ఉద్రిక్తం
- వికారాబాద్ జిల్లా లగచర్లలో ఘటన

విశాలాంధ్ర–హైదరాబాద్: వికారాబాద్ జిల్లాలోని లగచర్లలో ఫార్మా విలేజ్ ఏర్పాటు విషయమై ఏర్పాటు చేసిన అభిప్రాయ సేకరణ తీవ్ర ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో ఓ మహిళా రైతు కలెక్టర్ ప్రతీక్ జైన్ భుజంపై వెనుక నుంచి కొట్టడం కలకలం రేపింది. ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా రైతులు ఆందోళనకు దిగారు. కలెక్టర్, అధికారుల కార్లపై రాళ్లు రువ్వారు. రైతుల దాడిలో మూడు వాహనాలు ధ్వంసమయ్యాయి. అసలేం జరిగిందంటే... వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల, పోలేపల్లి, హకింపేట మూడు గ్రామాల్లో ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేసేందుకు మూడు వేల ఎకరాల సేకరణ కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చాలా మంది రైతులు భూములను స్వచ్ఛంధంగా ఇచ్చేశారు. అయితే లగచర్ల గ్రామంలో ముందుగా ప్రజాభిప్రాయసేకణ చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. గ్రామానికి రెండు కిలో మీటర్ల దూరంలో తాత్కాలిక సభను నిర్వహించేందుకు అధికారులు యత్నించారు. అయితే గ్రామానికి దూరంగా ఉండటం వల్ల రైతులు, గ్రామస్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతులంతా తమ ఊరిలో ఉన్నారని అక్కడే ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని రైతులు కోరారు. దీంతో కలెక్టర్, ఇతర అధికారులు అంగీకరించి అక్కడికి బయల్దేరి వెళ్లారు. అధికారులు గ్రామానికి చేరుకోగానే రైతులు ఒక్కసారిగా వారి వాహనాలపై రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఈ స్థితిలో ఓ మహిళ.. కలెక్టర్ ప్రతీక్ జైన్ వెనుక నుంచి వచ్చి భుజంపై కొట్టింది. దీంతో ఆయన ముందుకు తూలారు. దీంతో గ్రామస్తులకు, అధికారులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. గ్రామస్తులు తమ ఆందోళనను తీవ్ర తరం చేశారు. అధికారులకు సంబంధించిన మూడు కార్లను ధ్వంసం చేశారు. వెంటనే

- మిగతా 2 లో

'అమృత్'లో భారీ అవినీతి

- సీఎం రేవంత్ బావమరిది శోధా కంపెనీకి రూ.1,137 కోట్ల పనులు
- విచారణ జరిపి... చర్యలు తీసుకోండి
- కేంద్ర మంత్రి ఖట్టర్‌కు కేటీఆర్ విజ్ఞాపన పత్రం

విశాలాంధ్ర–హైదరాబాద్: అమృత్ టెండర్లలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీగా అవినీతికి పాల్పడుతున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపిం చారు. ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ అనే నిబంధనను ఉల్లంఘించి తన బావమరిది సుజన్ రెడ్డికి చెందిన శోధా కంపెనీకి రూ.1,137 కోట్ల విలువ చేసే పనులను అప్పగించారని ధ్వజమెత్తారు. ఏమాత్రం అనుభవం, అర్హత లేని సంస్థకు కేవలం తన బావమరిది కంపెనీ అనే ఒకే ఒక్క కారణంతో ఇంత పెద్ద ఎత్తున పనులను కట్టబెట్టారని అన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో సీఎం రేవంత్ రెడ్డి కీలకంగా వ్యవహరించి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని తెలిపారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం వివిధ పనులకుగాను దాదాపు రూ.8,888 కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ పథకం కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ నేతృత్వంలో ఉండటంతో ఆ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను దిల్లీలో కేటీఆర్ సోమవారం కలిశారు. అమృత్ టెండర్లలో సీఎం రేవంత్ ఏ విధంగా అవినీతికి పాల్పడ్డారో... ఆధారాలతో సహా కేంద్ర మంత్రికి వివరించారు. మొత్తం వ్యవహారంలో ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ అనే నిబంధనను ఉల్లంఘించారని ఈ టెండర్లపై

- మిగతా 2 లో

భారీ అంకెల బడ్జెట్

రూ.2,94,427 కోట్లతో ప్రవేశపెట్టిన ఏపీ మంత్రి పయ్యావుల

- 'సూపర్‌సిక్స్'కి దక్కని ప్రాధాన్యత
- రెవెన్యూ వ్యయం అంచనా 2,35,916 కోట్లు
- మూలధన వ్యయం అంచనా 32,712 కోట్లు
- ద్రవ్యలోటు 68,742 కోట్లు
- తొలిసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి కేశవ్

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం సమతూకం పాటిస్తూ 2024–2025 ఆర్థిక సంవత్సరానికి రూ.2,94,427.25 కోట్లతో అసెంబ్లీలో భారీ బడ్జెట్ ప్రవేశపెట్టింది. శాసనసభ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిసారి అసెంబ్లీ సమావేశాల ప్రారంభరోజునే ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రవేశపెట్టారు. దాదాపు ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత నాలుగు నెలల పాటు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ మీదే పాలన కొనసాగించిన కూటమి సర్కార్... నెలాఖరుకు గడువు ముగుస్తున్న నేపథ్యంలో పూర్తిస్థాయి బడ్జెట్‌ను మంత్రి పయ్యావుల సభలో ప్రతిపాదించారు. ఇందులో రెవెన్యూ వ్యయం అంచనా రూ.2,35,916.00 కోట్లుగా, మూలధన వ్యయం అంచనా రూ.32,712.84 కోట్లుగా, ద్రవ్యలోటు రూ.68,742.65 కోట్లుగా ప్రతిపాదించారు. రాష్ట్ర స్థూల దేశీయ ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో రెవెన్యూ లోటు 4.19 శాతంగా, ద్రవ్యలోటు 2.12 శాతంగా ఉండవచ్చునని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని కాపాడాలని అపూర్వ తీర్పు ఇచ్చిన ప్రజల సంకల్పానికి ఈ బడ్జెట్ ప్రతిబింబమని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వ దుష్పరిపాలన వల్ల రాష్ట్రానికి జరిగిన

- మిగతా 2 లో

రూ.43,402 కోట్లతో వ్యవసాయానికి దన్ను

ఏపీ అసెంబ్లీలో ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి అచ్చెన్నాయుడు 2లో

సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణం

న్యూఢిల్లీ: ఎన్నికల బాండ్లు, అధికరణం 370 తదితర కేసుల్లో కీలక తీర్పులిచ్చిన జస్టిస్ సంజీవ్ ఖన్నా సోమవారం భారతదేశ 51వ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా ప్రమాణం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జస్టిస్ సంజీవ్ ఖన్నాతో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్, ప్రధాని మోదీ, కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సహా ప్రముఖులు హాజరయ్యారు. సీజేఐగా జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీకాలం ఆదివారంతో ముగిసింది. ఆయన స్థానంలో కొత్త సీజేఐ బాధ్యతలు స్వీకరించారు. వచ్చే ఏడాది మే 13 వరకు ఆయన పదవిలో కొనసాగనున్నారు. 2019 జనవరి నుంచి సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సంజీవ్ ఖన్నా... ఈ ఆరేళ్లలో 117 తీర్పులు ఇచ్చారు. 456 తీర్పుల్లో సభ్యుడిగా భాగస్వాములయ్యారు. ఈవీఎంల నిబద్ధతను సమర్థిస్తూ కీలకమైన తీర్పు వెలువరించారు. ఎన్నికల బాండ్ల పథకం రద్దు, అధికరణం 370 రద్దును సమర్థిస్తూ తీర్పులు ఇచ్చిన ధర్మాసనాల్లో భాగస్వామిగా ఉన్నారు. మద్యం కుంభకోణంలో దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేశారు.

ఇదీ లోకం!



అనౌచిత్యాల్లోకెల్లా అనౌచిత్యం

ఆర్వీ రామారావ్

టిప్పణి

పోతూ పోతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నాయకత్వంలోని తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన బెంచి గత ఐదవ తేదీన ప్రైవేట్ ఆస్తులను ప్రభుత్వం ఇష్టానుసారం ప్రజాప్రయోజనం కోసమైనా స్వాధీనం చేసుకోవడానికి వీలు లేదని తీర్పు చెప్పింది. ప్రైవేట్ ఆస్తులు రాజ్యాంగంలోని 39(బి) అధికరణం ప్రకారం అయినా 'సమాజం భౌతిక ఆస్తులు' కావు అనీ, వీటిని ప్రభుత్వం పంపిణీ చేయడం కుదరదని తీర్పు ఇచ్చింది. తొమ్మిది మంది న్యాయమూర్తుల్లో ఒక్క న్యాయమూర్తి ధులియా మాత్రం మెజారిటీ తీర్పుతో ఏకీభవించలేదు. ప్రజలకు మేలు కలిగేటట్టు ఐతే ప్రైవేటు ఆస్తులను కూడా స్వాధీనం చేసుకోవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రైవేటు ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం కుదరదు అంటే అది రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలకు విరుద్ధమేనని న్యాయమూర్తి ధులియా అన్నారు. సంపన్నులకు, పేదలకు మధ్య అంతరం నానాటికీ పెరుగుతున్న దశలో ప్రైవేటు ఆస్తులు స్వాధీనం చేసుకోకూడదనడం సబబు కాదని ఆయన అభిప్రాయడ్డారు. మెజారిటీ తీర్పు 39(బి) అధికరణాన్ని తిరగతోడినట్టైంది. ప్రైవేటు ఆస్తులను సమాజ హితం కోసం కూడా స్వాధీనం చేసుకోవడానికి వీలు లేదంటే... వాటి మీద ప్రభుత్వానికి ఎలాంటి అదుపూ ఉండకూడదనే. మెజారిటీ తీర్పు నిర్దిష్టమైన సామాజిక వ్యవస్థను కానీ, ఆర్థిక విధానాన్ని కానీ నిర్దేశించలేదని చంద్రచూడ్ నాయకత్వంలోని మెజారిటీ తీర్పులో పేర్కొన్నారు. అలాంటప్పుడు రాజ్యాంగ పీఠికలోని 'సోషలిస్ట్' అన్న మాట నిరర్థకమైందనుకోవాలేమో!

పైగా మెజరిటీ తీర్పు ప్రస్తుత ప్రభుత్వ విధానాలకు అనుగుణమైందే. మెజారిటీ తీర్పు 2023–24 ఆర్థిక సర్వే మీద ఆధారపడినట్టుంది. అంటే ప్రభుత్వాల వివేకం మీద విశ్వాసం ప్రకటించినట్టే. మెజారిటీ ఉన్న ప్రభుత్వం విధానాలను సమాజహితంతో సంబంధం లేనట్టుగా పరిగణించినట్టుంది. ఆదేశిక సూత్రాలను అటకెక్కించింది. ఈ ప్రభుత్వ విధానాల వల్ల మన దేశం త్వరితగతిన ఆర్థికాభివృద్ధి సాధించడానికి అనువుగా ఉందని తీర్పులో పేర్కొనడం చంద్రచూడ్ నాయకత్వంలో ఉండగా సుప్రీంకోర్టు మొగ్గు ఎటు వేపు ఉందో స్పష్టమైంది. ప్రభుత్వం ఇష్టానుసారం ప్రైవేటు ఆస్తులు స్వాధీనం చేసుకోవడానికి వీలు లేదని చెప్పడం ద్వారా తీర్పుల్లో ప్రభుత్వాన్ని అంతగా వెనకేసుకు రావాలా అన్న ప్రశ్న తలెత్తుతుంది.

ఒక్కొక్కప్పుడు ప్రభుత్వ నియంత్రణ 'జనహితానికి' తోడ్పడినా కొన్ని సందర్భాలలో ప్రైవేటు ఆస్తుల వల్ల కూడా 'జనహితం నెరవేరుతుంది' అని మెజారిటీ తీర్పులో పేర్కొన్నారు. దీన్నిబట్టి చంద్రచూడ్ నేతృత్వంలో మెజారిటీ న్యాయమూర్తుల మొగ్గు ఎటు ఉందో తేలిపోతోంది. అయితే సుప్రీంకోర్టు విస్తృతమైన ఆర్థిక, సామాజిక విధానాలకు సంబంధించిన ప్రశ్నలపై అభిప్రాయం వ్యక్తం చేయడానికి నిరాకరించింది. అక్కడితో ఊరుకోలేదు. 1977లో అప్పటి న్యాయమూర్తి కృష్ణ అయ్యర్ రంగనాథ రెడ్డి కేసులో ఇచ్చిన మైనారిటీ తీర్పును తప్పుబట్టడమే కాక కృష్ణ అయ్యర్ సిద్ధాంతాన్ని కూడా విమర్శించింది. న్యాయమూర్తి కృష్ణ అయ్యర్ అనుసరించిన సిద్ధాంతం అనుచితమైందన్న రీతిలో మెజారిటీ తీర్పులో వ్యాఖ్యానించారు. న్యాయమూర్తులు బీవీ నాగరత్న, ధులియా గతంలో పని చేసిన న్యాయమూర్తులను ఇప్పుడు తప్పు పట్టడం ఏమిటి అని ప్రశ్నించారు. ఈ తీర్పు మొదట రాసిన ప్రతిలో కృష్ణ అయ్యర్ అభిప్రాయం 'హానికరమైంది' అని మాజీ ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ ఘాటైన విమర్శే చేశారు. అయితే అంతిమ తీర్పులో ఈ మాటలను ఆయన తొలగించారు.

తీర్పుతో విభేదించిన న్యాయమూర్తి ధులియా మాజీ న్యాయమూర్తి కృష్ణ అయ్యర్ అభిప్రాయాన్ని గట్టిగా సమర్థించారు. గత అయిదవ తేదీన వెలువడిన తీర్పుకు సంబంధించిన కేసు గత 35 ఏళ్లుగా నలుగుతోంది. కృష్ణ అయ్యర్ అభిప్రాయంతో ఆ తరవాత బొగ్గుగనుల జాతీయాకరణ కేసు విచారణ సందర్భంగా మాజీ న్యాయమూర్తి ఓ.చిన్నప్పరెడ్డి కూడా ఏకీభవించారు. కర్నాటకకు చెందిన రంగనాథ రెడ్డి కేసులో కృష్ణ అయ్యర్ ప్రైవేట్ ఆస్తులను స్వాధీనం

- మిగతా 2 లో

పుతిన్-ట్రంప్ ఫోన్‌లో మాట్లాడుకోలేదు: రష్యా

మాస్కో: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్‌తో తమ అధ్యక్షుడు పుతిన్ మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణ జరగలేదని రష్యా ప్రకటించింది. వారిద్దరూ మాట్లాడుకున్నారన్న వార్తలు పూర్తిగా ఊహాజనితమని స్పష్టం చేసింది. గత గురువారం ఫ్లోరిడాలోని తన ఎస్టేట్ నుంచి ట్రంప్.. పుతిన్‌తో ఫోన్ లో మాట్లాడినట్లు వాషింగ్టన్ పోస్ట్ కథనం వెల్లడించింది. ఉక్రెయిన్ యుద్ధాన్ని విస్తరించొద్దని కోరినట్లు, యుద్ధంపై పరస్పరం చర్చించి ఓ పరిష్కారాన్ని కనుగొందామని రష్యా అధినేతకు ట్రంప్ సూచించినట్లు తెలిపింది. దీనిపైనే రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ నుంచి స్పందన వచ్చింది. "సమాచారం నాణ్యత ఏ స్థాయిలో ఉంటుందో ఈ వార్తలను చూస్తుంటే తెలుస్తుంది. పేరున్న సంస్థలు ఇందుకు మినహాయింపేమీ కాదు. ఈ సమాచారం పూర్తిగా అవాస్తవం. ఇదంతా ఊహాజనిత, తప్పుడు సమాచారం" అని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ మీడియాకు స్పష్టం చేశారు. ఈ ఇద్దరు నేతల మధ్య చర్చల కోసం ప్రస్తుతానికి ఎలాంటి ప్రణాళికలు లేవని తెలిపారు. తాను అధికారంలోకి వస్తే ఒక్క రోజులో ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ముగిస్తానంటూ అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ట్రంప్ వ్యాఖ్యలు చేసిన సంగతి విదితమే. అందుకు అనుగుణంగానే ఇటీవల ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఫోన్‌లో మాట్లాడిన ఆయన.. తాను యుద్ధాన్ని ప్రారంభించబోనని, దాన్ని ముగించేందుకు సాయం చేస్తానంటూ భరోసానిచ్చారు.

అప్పటివరకు కమలా హారిస్‌కు అధ్యక్ష పగ్గాలు!

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ అఖండ విజయం సాధించిన సంగతి తెలిసిందే. మరి కొద్ది వారాల్లో ఆయన ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ స్థితిలో ఓ కొత్త డిమాండ్ తెరపైకి వచ్చింది. ట్రంప్ దేశాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించేవరకు బైడెన్ తప్పించి... ఆ స్థానంలో కమలా హారిస్‌కు అధ్యక్ష పదవి అప్పగించాలని ఆమె మాజీ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ జమాల్ సిమన్స్ సూచించారు. బైడెన్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి, ఉపాధ్యక్షురాలు హారిస్‌ను అమెరికాకు మొదటి మహిళా అధ్యక్షురాలిని చేయాలని ఆయన ఓ టాక్ షోలో పేర్కొన్నారు. ఇప్పటివరకు జో బైడెన్ అద్భుతంగా పరిపాలించారు... కానీ, ఆయన చివరి వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలన్నారు. రాబోయే కాలంలో అధ్యక్ష ఎన్నికల పోటీలో మహిళలు నిలవడానికి ఈ ప్రక్రియ దోహదం చేస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

సెనెట్‌పై పట్టు సాధించేందుకు ట్రంప్ ప్లాన్

మరోవైపు, అధ్యక్ష పీఠాన్ని అధిరోహించేందుకు సిద్ధమవుతున్న వేళ డొనాల్డ్ ట్రంప్ తన పాలకవర్గంపై ప్రత్యేక దృష్టిసారించారు. తన మాజీ తాత్కాలిక యూఎస్ ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ టామ్ హోమన్‌ను 'బోర్డర్ జార్' గా నియమించనున్నట్లు ప్రకటించారు. దక్షిణ, ఉత్తర సరిహద్దులను పర్యవేక్షించడంతోపాటు, సముద్ర, విమానయాన భద్రతను పర్యవేక్షించడంలోనూ ఆయన కీలక పాత్ర పోషిస్తాడని పేర్కొన్నారు. సరిహద్దు భద్రతా వ్యవహారాలను నిర్వహించడంలో ఆయనకు మంచి పట్టు ఉందన్నారు. అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించినవారిని పంపించే బాధ్యత కూడా ఆయనే నిర్వహిస్తారని.. టామ్ హోమన్ ఈ బాధ్యతలను అద్భుతంగా నిర్వర్తిస్తారనడంలో తనకు ఎటువంటి సందేహం లేదని తన సోషల్ మీడియా ట్రూత్ వేదికగా పేర్కొన్నారు.

ఈపీఎఫ్ఓ వేతన పరిమితి రూ.21 వేలు?

(మొదటిపేజీ తరువాయి)

ఆ ఉద్యోగుల సంఖ్యపై పరిమితిని కూడా తగ్గించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం 20... అంతకంటే ఎక్కువమంది ఉద్యోగులు ఉన్న కంపెనీలు తప్పనిసరిగా ఈపీఎఫ్ఓలో చేరాల్సిఉండగా... ఈ సంఖ్యను 10-15కు తగ్గించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ ప్రతిపాదనను చిన్న-మధ్యతరహా పరిశ్రమలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. వేతన పరిమితిని పెంచడం వల్ల ప్రభుత్వంతో పాటు ప్రైవేటు రంగంపైనా ఆ భారం పడుతుంది. దీనివల్ల ఉద్యోగులకు మేలు జరుగుతుంది. ఈపీఎఫ్ఓ గరిష్ఠ వేతన పరిమితిని చివరిసారిగా 2014లో సవరించారు. అప్పట్లో రూ.6,500గా ఉన్న మొత్తాన్ని రూ.15 వేలకు పెంచారు. కాగా, వేతన పరిమితిని పెంచితే... దానివల్ల ఉద్యోగుల భవిష్యనిధి ఖాతాకు జమ అయ్యే మొత్తం పెరగనుంది. సాధారణంగా ఉద్యోగి వాటాగా వేతనంపై 12 శాతం, యజమాని వాటా 12 శాతం చెల్లిస్తారు. ఉద్యోగి వాటా పూర్తిగా ఈపీఎఫ్ ఖాతాలో జమవుతుంది. యజమాని వాటా నుంచి 8.33 శాతం పింఛను పథకంలో... మిగతా మొత్తం ఈపీఎఫ్ ఖాతాలో జమవుతుంది. గరిష్ఠ వేతన పరిమితి పెంచితే ఆ మేరకు ఉద్యోగి, యజమాని చెల్లించాల్సిన వాటా పెరుగుతుంది. దీనివల్ల ఈపీఎఫ్ఓ, ఈపీఎస్ ఖాతాలో జమయ్యే మొత్తం పెరుగుతుంది. దీంతో రిటైర్మెంట్ సమయానికి ఉద్యోగి తన భవిష్యనిధి నిల్వలు పెంచుకోవడానికి వీలుపడుతుంది.

సమాధుల కింద హెజ్బుల్లా భారీ సొరంగం

జెరూసలెం: ఇజ్రాయిల్ హమాస్, హెజ్బుల్లాపై సాగిస్తున్న యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియా అట్టుడుకుతోంది. హెజ్బుల్లాను పూర్తిగా నాశనం చేయడమే లక్ష్యంగా లెబనాన్‌లో ఐడీఎఫ్ భీకర దాడులు చేస్తున్న క్రమంలో ఆ ముఠాకు చెందిన ఓ రహస్య సొరంగం వీడియోను ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. సమాధుల కింద హెజ్బుల్లా ఏర్పాటు చేసిన సొరంగం అది. కిలోమీటర్ల మేర పొడవున్న దీనిలో కమాండ్ కంట్రోల్ రూమ్‌లు, తుపాకులు, రాకెట్లు ఉన్నట్లు గుర్తించామని ఐడీఎఫ్ తెలిపింది. వాటిని ధ్వంసం చేశామని ప్రకటించింది. 'హెజ్బుల్లాకు మానవ జీవితం అంటే లెక్క లేదు. చనిపోయినా, బతికినా పట్టించుకోదు' అంటూ దీనికి సంబంధించిన వీడియోను ఐడీఎఫ్ విడుదల చేసింది. సొరంగంలో కంట్రోల్ రూమ్‌లు, స్లీపింగ్ క్వార్టర్‌లు, దజన్లకొద్దీ ఆయుధాలు, ఇతర సైనిక సామగ్రిని నిల్వ చేసినట్లు ఈ దృశ్యాల్లో స్పష్టమవుతోంది. లెబనాన్‌లోని పౌరుల నివాసాల కింద హెజ్బుల్లా సొరంగాలను ఏర్పాటు చేసుకొని ఆశ్రయం పొందుతున్నట్లు గుర్తించిన ఇజ్రాయెల్ దళాలు ఇటీవల అనేక సొరంగాలను ధ్వంసం చేశాయి. కాగా గాజా, లెబనాన్‌పై ఇజ్రాయిల్ సైన్యం(ఐడీఎఫ్) ఆదివారం భీకరంగా విరుచుకుపడింది. ఇజ్రాయిల్ వైమానిక దాడుల్లో 23 మంది మృతి చెందారని లెబనాన్ అధికారులు తెలిపారు. ఇందులో ఏడుగురు చిన్నారులు ఉన్నారు. గాజాలోని ఓ నివాసగృహంపై చేసిన దాడిలో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇందులో తొమ్మిది మంది మహిళలు ఉన్నారు.

దేశ సమైక్యతకు గాంధీ పరివార్ కృషి

విశాలాంధ్ర-హైదరాబాద్: దేశంలో ఉన్నవి రెండే రెండు పరివార్‌లు ఉన్నాయని... ఒకటి మోదీ పరివార్ అయితే రెండోది గాంధీ పరివార్ అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అందులో ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేందుకు మోదీ పరివార్ పనిచేస్తుంటే దేశ సమైక్యతకు గాంధీ పరివార్ కృషి చేస్తోందన్నారు. సోమవారం భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా రవీంద్రభారతిలో ఆయన చిత్రపటానికి సీఎం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో మైనారిటీలు కీలక పాత్ర పోషించారని తెలిపారు. హిందూ, ముస్లింలు తెలంగాణ ప్రభుత్వానికి రెండు కళ్లలాంటి వారని ఎవ్వరిని తాము చిన్నచూపు చూడమని స్పష్టం చేశారు. మీరంతా అండగా ఉంటే విద్య, వైద్యం,ఉపాధి విషయంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించుకుందామని పిలుపునిచ్చారు. దేశ ప్రజలకు మెరుగైన విద్య అందించేందుకు ఆనాడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎడ్యుకేషన్ పాలసీని తీసుకొచ్చారని గుర్తు చేశారు. ముస్లింలను మేం ఓటర్లుగా చూడటంలేదని, వారుని సోదరులుగా, కుటుంబ సభ్యులుగా భావిస్తున్నామని చెప్పుకొచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క మైనారిటీని ఎమ్మెల్యేగా గెలిపించుకోలేకపోయామని... అందుకే మైనారిటీ వర్గానికి మంత్రి పదవి ఇచ్చే అవకాశం లేకుండా పోయిందన్నారు. కానీ షబ్బీర్ అలీని ప్రభుత్వ సలహాదారులుగా చేశామని... అమీర్ అలీ ఖాన్‌కు ఎమ్మెల్సీ ఇవ్వడంతో పాటు కార్పొరేషన్‌లలో అవకాశాలు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్, అధికారులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టే వారి పై కఠిన చర్యలు

ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బంది పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అటువంటి వ్యాపారులపై అవసరమైతే ఎస్సెన్షియల్ సర్వీసెస్ మెయింటెనెన్స్ యాక్ట్ కింద చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న సంఘటనలు దృష్టికి రావటంతో స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు.

అధికారులపై దాడి

(మొదటిపేజీ తరువాయి)

అప్రమత్తమైన పోలీసులు జిల్లా కలెక్టర్‌ను అక్కడి నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఈ ఘటనలో వాహనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. కొడంగల్ డెవలప్‌మెంట్ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి రాళ్లు తగలడంతో గాయాలయ్యాయి. ఆయన పొలాల వెంటనే పరుగెత్తి అక్కడి నుంచి వెళ్లిపోయారు. వికారాబాద్‌లో ఫార్మా సెజ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. అయితే ఫార్మా సెజ్ ఏర్పాటుతో తమ భూముల సారం కోల్పోతాయని.. అలాగే ఫార్మా కంపెనీల నుంచి వచ్చే కాలుష్యం వల్ల భూసారం పోతుందని, పంటలు తీవ్రంగా నష్టపోతాయని, తమ జీవనాధారం కోల్పోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా స్వయానా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్ లో ప్రజలు అధికారుల పై తిరగబడడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. జిల్లా కలెక్టర్, అధికారులు లగ్గిచర్ల వెళ్లే సమయంలో ముందు జాగ్రత్తగా బందోబస్తు ఏర్పాట్లు చేయకపోవడంతో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది.

రాహుల్‌పై ఈసీకి బీజేపీ ఫిర్యాదు

(మొదటిపేజీ తరువాయి)

స్పందించిన కాషాయ పార్టీ మండిపడింది. రాహుల్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బీజేపీపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. బీజేపీపై ఆయన తీరు ఆమోదయోగ్యం కాదు. దీనిని అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. గతంలో ఆయనకు నోటీసులు అందినప్పటికీ తన తీరును మార్చుకోవడం లేదు. మహారాష్ట్రలో లబ్ధి పొందేందుకే ఆయన అసత్యాలు మాట్లాడుతున్నారు' అని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు.

11 మంది కుకీ మిలిటెంట్లు కాల్చివేత

(మొదటిపేజీ తరువాయి)

సమీపంలో ఉన్న జకురాడోర్ కరోంగ్ గ్రామం వైపు దూసుకెళ్లి బీభత్సం సృష్టించారు. అనేక దుకాణాలకు నిప్పుపెట్టారు. ఈ సందర్భంగా భద్రతా దళాలు-మిలిటెంట్ల మధ్య భారీ స్థాయిలో కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలోనే 11 మంది మిలిటెంట్లు హతమైనట్లు అధికారులు వెల్లడించారు. కొంత మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లకు కూడా గాయాలైనట్లు సమాచారం. ఇదిలాఉంటే, బిష్ణుపూర్ జిల్లాలో ఇటీవల మిలిటెంట్ల దాడిలో ఓ మహిళ మృతి చెందడం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఇంఫాల్ లోయలోని సైటాన్ ప్రాంతంలో నవంబర్ 9న ఈ ఘటన చోటుచేసుకుంది. పొలంలో పని చేస్తున్న రైతులను లక్ష్యంగా చేసుకుని సాయుధులు జరిపిన కాల్పుల్లో మహిళ మృతిచెందడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

రూ.43,402 కోట్లతో వ్యవసాయానికి దన్ను

- ఏపీ అసెంబ్లీలో ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి అచ్చెన్నాయుడు
- సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణకు రూ.14,637 కోట్లు
- రైతుల ఉచిత విద్యుత్‌కు రూ.7,241 కోట్లు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: శాసనసభలో వ్యవసాయశాఖమంత్రి కింజారపు అచ్చెన్నాయుడు రూ.43,402 కోట్లతో ప్రత్యేకంగా వ్యవసాయ బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతు గురించి ప్రముఖ కవి గుర్రం జాషువా రాసిన పద్యం చదవి తన బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించారు. ఆరుగాలం కష్టపడి ఇంటిల్లిపాదీ శ్రమించి ఈ ప్రపంచానికి అన్నంపెట్టే రైతన్నకు మనసా, వాచా, కర్మణా శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని మంత్రి సభ ద్వారా తెలియజేశారు. రాష్ట్రానికి వ్యవసాయం వెన్నెముక లాంటిదని, అటువంటి రంగానికి తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతదృష్ట్యా ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. దాదాపు 62 శాతం జనాభా వ్యవసాయ అనుబంధ రంగాలపై ఆధారపడి ఉండగా, గత ప్రభుత్వం ఈరంగాన్ని పూర్తిగా గాలికొదిలేసిందని విమర్శించారు. అందుకే తమ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రథమ ప్రాధాన్యతనిస్తూ ఈ బడ్జెట్‌లో రూ.14,637 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. భూసార పరీక్షలకు కూడా అధిక ప్రాధాన్యతనిస్తూ, ఇందుకు రిమోట్ సెన్సింగ్ సాంకేతికత ఉపయోగిస్తామని చెప్పారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఎప్పటికప్పుడు రైతులకు చేరువ చేయాలని, దానికనుగుణంగా ఏడాది వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం ప్రవేశపెడుతున్నామని తెలిపారు. పురుగుమందులు, కలుపు మందుల పిచికారీ డ్రోన్లతో చేయడం వల్ల మందుల వినియోగ పరిణామం 25శాతం తగ్గుతుందని, తద్వారా రైతులకు ఖర్చు తగ్గి నికరాదాయం పెరుగుతుందన్నారు. అలాగే డ్రోన్ల సహాయంతో పంటల సస్యరక్షణ తక్కువ కాలంలో ఎక్కువ విస్తీర్ణంలో చేపట్టవచ్చునన్నారు. వచ్చే మూడేళ్లలో డ్రోన్ల వినియోగం అన్ని గ్రామాలకు విస్తరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. విత్తనాలు, సూక్ష్మ పోషక ఎరువులు రాయితీపై అందిస్తున్నామని, వీటిని ప్రాథమిక పరపతి సంఘాల ద్వారా పంపిణీ చేస్తున్నామని వివరించారు. శాసనమండలిలో వ్యవసాయ బడ్జెట్‌ను మున్సిపల్ మంత్రి పి.నారాయణ ప్రవేశపెట్టారు.

వ్యవసాయ బడ్జెట్ కేటాయింపులు:

- నీటిపారుదల ప్రాజెక్టుల నిర్వహణ - రూ.14,637.03 కోట్లు
- అన్నదాత సుఖీభవ - రూ.4,500 కోట్లు
- రాయితీ విత్తనాలకు - రూ.240 కోట్లు
- భూసార పరీక్షలకు - రూ.38.88 కోట్లు
- విత్తనాల పంపిణీ - రూ.240 కోట్లు
- ఎరువుల సరఫరా - రూ.40 కోట్లు
- పొలం పిలుస్తోంది - రూ.11.31 కోట్లు.
- ప్రకృతి వ్యవసాయం - రూ.422.96 కోట్లు
- డిజిటల్ వ్యవసాయం - రూ.44.77 కోట్లు
- వ్యవసాయ యాంత్రీకరణ - రూ.187.68 కోట్లు
- వడ్డీ లేని రుణాలకు - రూ.628 కోట్లు
- రైతు సేవా కేంద్రాలకు - రూ.26.92 కోట్లు
- ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్ - రూ.44.03 కోట్లు
- పంటల బీమా - రూ.1,023 కోట్లు
- వ్యవసాయ శాఖ - రూ.8,564.37 కోట్లు
- ఉద్యాన శాఖ - రూ. 3469.47 కోట్లు
- పట్టు పరిశ్రమ - రూ.108.4429 కోట్లు
- వ్యవసాయ మార్కెటింగ్ - రూ.314.80 కోట్లు
- సహకార శాఖ - రూ.308.26కోట్లు
- ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం - రూ.507.038 కోట్లు
- ఉద్యాన విశ్వవిద్యాలయం - రూ.102.227 కోట్లు
- శ్రీ వెంకటేశ్వర పశు విశ్వవిద్యాలయం - రూ.171.72 కోట్లు
- మత్స్య విశ్వవిద్యాలయం - రూ.38 కోట్లు
- పశుసంవర్ధక శాఖ - రూ.1,095.71 కోట్లు
- మత్స్య రంగం అభివృద్ధి - రూ.521.34 కోట్లు
- ఉచిత వ్యవసాయ విద్యుత్ - రూ.7241.30 కోట్లు
- ఉపాధి హామీ అనుసంధానం - రూ.5,150కోట్లు
- ఎన్టీఆర్ జలసిరి - రూ.50 కోట్లు.

'అమృత్'లో భారీ అవినీతి

(మొదటిపేజీ తరువాయి)

విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు.

రూ.2 కోట్ల లాభం ఉన్న కంపెనీకి రూ.1,137 కోట్ల పనులా?

ముఖ్యమంత్రి బావమరిది కంపెనీ శోధా ఇన్ ఫ్రాక్చర్ లిమిటెడ్ 2021-2022 ఆర్థిక సంవత్సరానికి కేవలం రూ.2 కోట్ల 20 లక్షల లాభాన్ని మాత్రమే చూపించిందన్నారు. అలాంటి కంపెనీకి రూ. 1,137 కోట్ల పనులను అప్పచెబుతారని ప్రశ్నించారు. మొత్తం రూ.1,137 కోట్ల పనుల్లో ఇండియన్ హ్యూమ్ పైప్స్ కో లిమిటెడ్ అనే కంపెనీకి 20 శాతం పనులు, మిగతా 80 శాతం పనులను శోధా సంస్థ చేసేలా ఒప్పందం చేసుకున్నారని కేటీఆర్ అన్నారు. 80 శాతం పనులు సీఎం బావమరిది కంపెనీవే కావటంతో ఇండియన్ హ్యూమ్ పైప్స్ లిమిటెడ్ సంస్థ శోధా సంస్థకు అప్పగించిందని చెప్పారు. సీఎం రేవంత్ ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ అనే నిబంధనను ఉల్లంఘించారని కేటీఆర్ అన్నారు. ఉల్లంఘించిన ఎంతటి ప్రజా ప్రతినిధులపైనైనా వేటు వేయవచ్చని చెప్పారు. ఇందుకు సంబంధించి అనేక కేసులను కేటీఆర్ ఉదహరించారు. కంచె చేను మేసిందన్నట్లుగా ఇక్కడ ప్రత్యక్షంగా సీఎం రేవంత్ రెడ్డే అవినీతికి పాల్పడటం అనైతికమని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు వివరించారు.

అనౌచిత్యాల్లోకెల్లా అనౌచిత్యం

(మొదటిపేజీ తరువాయి)

చేసుకోవచ్చని చెప్తే ఆ తరవాత సంజీవ్ కోక్ కేసులో చిన్నప్పరెడ్డి కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. కృష్ణ అయ్యర్ తీర్పును ఇప్పుడు విమర్శించడం కర్కశమైందని న్యాయమూర్తి ధులియా అన్న విషయాన్ని, అలాగే గతంలో పని చేసిన న్యాయమూర్తుల అభిప్రాయాలను ఇప్పుడు విమర్శించడం ఏమిటని ప్రశ్నించిన న్యాయమూర్తి బీవీ నాగరత్న సమాజ విస్తృత హితం కోరుతున్న వారిగా నిలబెట్టింది. సమాజ భౌతిక వనరులు అంటే ప్రైవేటువారి చేతుల్లో ఉన్న ఆస్తులు కూడా అని న్యాయమూర్తి నాగరత్న శషభిషలు లేకుండానే చెప్పారు. కృష్ణ అయ్యర్, చిన్నప్పరెడ్డి అభిప్రాయాలను తప్పు పట్టడం సమర్థనీయం కాదని, అనవసరమని కూడా నాగరత్న గట్టిగానే చెప్పారు. అందుకే మెజారిటీ తీర్పుతో అంగీకరించినా ఆమె తన తీర్పు విడిగా వెల్లడించారు. 'సమాజహితం' అంటే ఏమిటో న్యాయమూర్తి నాగరత్న ఖండితంగా నిర్వచించారు. సంపద కొద్ది మంది చేతుల్లో పోగుపడకుండా చూడడం ప్రభుత్వ వ్యవస్థ బాధ్యత అని ఆమె గుర్తు చేశారు. ఆదేశిక సూత్రాలలోని అంతర్యం ఇదే.

ఈ తీర్పు సందర్భంగా ప్రస్తావనకు వచ్చిన 39(బి) అధికరణం ఆదేశిక సూత్రాలలో భాగమే. సమాజహితం కోసం పాటుపడడం ప్రభుత్వ బాధ్యత అని ఈ 39(బి) అధికరణం నిర్దేశిస్తోంది. మైనారిటీ తీర్పులే తరవాత చట్టాలు అయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. బొగ్గు గనులను జాతీయం చేయడాన్ని సమర్థించిన న్యాయమూర్తి చిన్నప్పరెడ్డి తీర్పు కృష్ణ అయ్యర్ ఆనాడు వ్యక్తం చేసిన మైనారిటీ అభిప్రాయాన్ని ఆమోదించడమే. 39(బి9) అధికరణం ప్రకారం 'భౌతిక వనరులు' అంటే ఏమిటో విడమర్చడం ఈ తొమ్మిది మంది న్యాయమూర్తుల బెంచి ముందున్న ప్రధాన పరిశీలనాంశం. ఆ పని ఈ బెంచి చేసిందా లేదా అన్న అంశం ఎలా ఉన్నా ప్రజాహితం కోసమైనా ఇష్టానుసారం ప్రైవేటు ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి వీలు లేదని అయిదవ తేదీన తీర్పు ఇవ్వడం అంటే ఆదేశిక సూత్రాలను ఖాతరు చేయకపోవడమే. అన్నింటికన్నా మించి ఇదివరకెప్పుడో కృష్ణ అయ్యర్, చిన్నప్పరెడ్డి లాంటి ప్రగతిశీల న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పులకు, వ్యక్తం చేసిన అభిప్రాయాలను తూర్పార పట్టడం అనౌచిత్యాల్లోకెల్లా అనౌచిత్యం. ఈ అనౌచిత్యాన్ని న్యాయమూర్తులు ధులియా, నాగరత్న బెదురు లేకుండా ఖండించడం వల్ల సమాజహితాన్ని దృష్టిలో పెట్టుకునే న్యాయమూర్తులు కొందరైనా ఉన్నారన్న సంతృప్తి మిగులుస్తోంది. కాంగ్రెస్‌కు అధికారం వస్తే ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న ఆస్తులను లాక్కుని ముస్లింలకు పంచుతారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిరంతరం కొనసాగిస్తున్న దుష్ప్రచారానికి అధికారాంతంలో చంద్రచూడ్ నాయకత్వంలోని తొమ్మిది మంది బెంచీలో ఎనిమిది మంది న్యాయమూర్తుల తీర్పుకు పోలిక కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

భారీ అంకెల బడ్జెట్

(మొదటిపేజీ తరువాయి)



నష్టాన్ని ప్రజలకు తెలియజేయడం నైతిక కర్తవ్యంగా భావించి ఏడు శ్వేతపత్రాల ద్వారా వెల్లడించామని తెలిపారు. ముఖ్యంగా గత ప్రభుత్వంలో చేసిన రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల దుర్వినియోగం, వనరుల మళ్లింపు, లోపభూయిష్టమైన ఇసుక, ఎక్సైజ్ విధానాలు, పరిమితికి మించి అధిక వడ్డీరేట్లకు రుణాలు తీసుకోవడం, స్థానిక సంస్థలు, కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల మళ్లింపు, ఇంధనరంగం విధ్వంసం, కొత్తగా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ ఏర్పాటు ద్వారా కార్పొరేషన్‌ల నిధులు దుర్వినియోగం, ఉద్యోగులకు, కాంట్రాక్టర్లకు పెద్దఎత్తున బిల్లుల బకాయిలు వంటివి తమ ప్రభుత్వానికి సవాళ్లుగా మారాయని మంత్రి వివరించారు. ఈ కారణాల వల్ల తొలిసారి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైందని, దీనిని గాడినపెట్టి రాష్ట్ర ప్రగతిని పున:నిర్మించే బాధ్యత తమపై పడిందన్నారు. 'ప్రతి సంక్షోభాన్ని అంకితభావంతో, సృజనాత్మకతతో నిబద్ధత, కృషితో అవకాశంగా మార్చుకోవాలని' ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పే మాటలే ప్రేరణగా అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతనిస్తూ బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఎన్ని ఆర్థిక సవాళ్లు ఎదురైనా ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా 'తల్లికి వందనం' పథకానికి నిధులు కేటాయించి, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే 1-12 తరగతి విద్యార్థుల తల్లులకు ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ విద్యకు దూరం కాకూడదనేది తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. 'సరళమైన ప్రభుత్వం-ప్రభావవంతమైన పాలన' అనే సూత్రంతో పాలనను క్రమబద్ధీకరించడమే తమ ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొంటూ స్వామి వివేకానందుడి స్ఫూర్తిదాయకమైన మాటలతో మంత్రి తన బడ్జెట్ ప్రసంగాన్ని ముగించారు. వ్యవసాయ బడ్జెట్‌ను ఆ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రవేశపెట్టారు. శాసనమండలిలో ఇదే బడ్జెట్‌ను ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, వ్యవసాయ బడ్జెట్‌ను మున్సిపల్ మంత్రి పి.నారాయణ ప్రవేశపెట్టారు.

బడ్జెట్‌లో వివిధ రంగాలకు కేటాయింపులు...

- పాఠశాల విద్య - రూ.29,909 కోట్లు
- వ్యవసాయం, అనుబంధ రంగాలు - రూ.11,855 కోట్లు
- ఎస్సీ సంక్షేమం - రూ.18,497 కోట్లు
- ఎస్టీ సంక్షేమం - రూ.7,557 కోట్లు
- బీసీ సంక్షేమం - రూ.39,007కోట్లు
- మైనార్టీల సంక్షేమం - రూ.4,376 కోట్లు
- మహిళా శిశు సంక్షేమం - రూ.4,285 కోట్లు
- మానవ వనరుల అభివృద్ధి - రూ.1,215 కోట్లు
- ఉన్నత విద్య - రూ.2,326 కోట్లు
- ఆరోగ్య రంగం - రూ.18,421 కోట్లు
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి - రూ.16,739 కోట్లు
- పట్టణాభివృద్ధి - రూ.11,490 కోట్లు
- గృహ నిర్మాణం - రూ.4,012 కోట్లు
- జలవనరులు - రూ.16,705 కోట్లు
- పరిశ్రమలు, వాణిజ్యం - రూ.3,127 కోట్లు
- ఇంధన రంగం - రూ.8,207 కోట్లు
- రవాణా, రోడ్లు, భవనాలు - రూ.9,554 కోట్లు
- యువజన, పర్యాటక, సాంస్కృతికం - రూ.322 కోట్లు
- పోలీస్ శాఖ - రూ.8,495 కోట్లు
- పర్యావరణ, అటవీ, శాస్త్ర, సాంకేతిక శాఖ - రూ.687 కోట్లు.

15 శాతం వృద్ధి లక్ష్యంగా ప్రణాళిక

అవకాశాల కల్పనతో సంపద సృష్టిస్తాం

విజన్-2047 సాధనపై చంద్రబాబు మేథోమథనం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రానున్న రోజుల్లో 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా ప్రభుత్వ ప్రణాళికలు అమలు చేసి ఫలితాలు సాధిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. అవకాశాల కల్పనతో సంపద సృష్టి సాధ్యమవుతుందని, తద్వారా వచ్చిన సంపదను పేద వర్గాలకు పంచి ప్రజల జీవన ప్రమాణాలు పెంచవచ్చని సీఎం అన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 13.5 శాతం వృద్ధి రేటు సాధించామని, నేడు 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దీనికి అవసరమైన ప్రణాళికలు, పాలసీలను ప్రభుత్వం అమలు చేస్తుందని సీఎం తెలిపారు. స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2047పై సచివాలయంలో పారిశ్రామికవేత్తలతో ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం సోమవారం జరిగింది. విజన్ 2047 లక్ష్యాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై పారిశ్రామిక దిగ్గజాలతో ముఖ్యమంత్రి మేథోమథనం చేశారు. టాస్క్ ఫోర్స్ కమిటీ చైర్మన్‌గా సీఎం చంద్రబాబు, కోచైర్మన్‌గా టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ ఉన్నారు. సచివాలయంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశానికి రాష్ట్ర మంత్రులు, సీఐఐ ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, పారిశ్రామిక రంగ ప్రముఖులు హాజరయ్యారు. విజన్ 2047పై ప్రభుత్వ ఆలోచనలు, పాలసీలను చంద్రబాబు వారితో పంచుకున్నారు. వివిధ రంగాల్లో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పారిశ్రామిక వేత్తల అభిప్రాయాలు, సలహాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఉత్తమ పాలసీలపై తన ఆలోచనలు, అనుభవాలు చెప్పారు. 'ఇప్పుడు టెక్నాలజీ మరింత అడ్వాన్స్‌గా ఉంది. దీన్ని మనం సద్వినియోగం చేసుకోవాలి. యువతకు అవకాశాలు కల్పిస్తే తిరుగులేని ఫలితాలు వస్తాయి. ఏపీలో సహజ వనరులు, మానవ వనరులు, మౌలిక సదుపాయాలు, హైవేలు, ఎయిర్ పోర్టులు ఉన్నాయి. కొత్త ఆవిష్కరణలకు, కొత్త ఆలోచనలకు మేం వేదికగా ఉండాలని అనుకుంటున్నాం. నాడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి మాట్లాడాం....ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి మాట్లాడుతున్నాం' అని సీఎం అన్నారు.

గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాస్, కుటుంబరావు

విశాలాంధ్ర - కొత్తగూడెం : ఇటీవల పాల్వంచ సీపీఐ కార్యాలయంలో జరిగిన తెలంగాణ గిరిజన సమాఖ్య కొత్తగూడెం జిల్లా తృతీయ మహాసభలో ఎన్నికైన నూతన కమిటీని సోమవారం సీపీఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్ ప్రకటించారు. సమాఖ్య జిల్లా గౌరవ అధ్యక్షుడిగా బానోత్ వెంకట్, అధ్యక్షుడిగా సొంది కుటుంబరావు, ప్రధాన కార్యదర్శిగా భూక్యా శ్రీనివాస్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితోపాటు మరో 16మందిని కార్యవర్గ సభ్యులుగా, 36మందిని కౌన్సిల్ సభ్యులుగా మొత్తంగా 55 మందితో నూతన కమిటీ ఏర్పాటైంది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా శ్రీనివాస్ మాట్లాడుతూ మహాసభలో గిరిజనులకు సంబంధించి ఆరు ప్రధాన అంశాలను మహాసభ ఆమోదించిందన్నారు. వాటి పరిష్కారంకోసం ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేసారు. ప్రధానంగా గిరిజనులకు ప్రత్యేక డిఎస్సిని ప్రకటించాలని, ఐటిడిఏలోని నిధులు కేవలం గిరిజన గ్రామాలకు, గిరిజనుల అభివృద్ధికి మాత్రమే వెచ్చించాలని డిమాండ్ చేసారు. పోడు సాగుచేసుకుంటున్న గిరిజనులకు హక్కు పాత్రాలు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన జిఓ 3ని పునరుద్ధరించి ఏజెన్సీలో వందశాతం గిరిజులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గ సభ్యులు బానోత్ గోవిందు, భూక్య దస్రు, వెంకట నర్సమ్మ, రామారావు, నాగేశ్వర్ రావు, సతీష్, కృష్ణ, శ్రీనివాస్, గణేష్, గోవిందు, రాంచందర్, శ్రీను, నారాయణ, గౌరయ్య, దేవీసింగ్, సంపత్ కుమార్, వాసు, భిక్కులాల్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే సమర్ధవంతంగా నిర్వహించాలి : కృష్ణ ఆదిత్య

విశాలాంధ్ర బ్యూరో, కొమరం భీం : ప్రభుత్వం చేపట్టిన సామా జిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజ కీయ, కుల గణన సర్వేను సమర్ధవంతంగా నిర్వహించాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య అన్నారు. సోమవారం జిల్లాలోని కాగజ్ నగర్ మండలం వంజరి గ్రామపంచాయతీలో, కాగజ్ నగర్ మున్సిపల్ పరిధిలోని సర్ సిల్క్ కాలనీ, టీచర్స్ కాలనీ లలో కొనసాగుతున్న సర్వే తీరును జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా లతో కలిసి పరిశీలించారు. సర్వే ప్రక్రియలో భాగంగా ఇండ్ల జాబితా ప్రక్రియ పూర్తయినందున కుటుంబ సభ్యుల సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయాలన్నారు. తహసిల్దార్, మున్సిపల్ కమిషనర్, ఎన్యుమరేటర్స్ పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో : ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం నల్లగొండ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను కలెక్టర్ ఇలా త్రిపాఠి స్వీకరించారు.అనంతరం జిల్లా అధికారుల సమ్మిళిత సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లా అధికారులే మండలాల ప్రత్యేక అధికారులుగా వ్యవహరిస్తుండడం, అలాగే సంబంధిత ఆర్డీవోలు, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ వారి డివిజన్ల పరిధిలోకి వచ్చే ఫిర్యాదులకు సంబంధించిన పరిష్కారం పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, ఆయా మండలాల అధికారులతో ఫిర్యాదుల పరిష్కారంపై తగు చర్య తీసుకునే విధంగా ఎప్పటికప్పుడు సమీక్షించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొనే విధంగా చూడాలని అన్నారు. ఈ నెల 17 ,18 వ తేదీలలో నిర్వహించనున్న గ్రూప్ -3 పరీక్షల నిర్వహణ విషయమై కో-ఆర్డినేషన్ మీటింగ్ తో పాటు, శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని, ఇందుకు అధికారులు సంసిద్ధులు కావాలని తెలిపారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, నల్గొండ ఆర్డీవో అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-పెద్దపల్లి: అర్జీలు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు సోమ వారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రజలు తమ సమస్యలు తెలుపుతూ సమర్పించిన దరఖాస్తులను ఎట్టి పరిస్థితిలోనూ పెండింగ్‌లో ఉంచకుండా, సత్వరమే పరిష్కరించాలని వీటిలో రెవెన్యూ (16), ఇతర దరఖాస్తు లు (19) మొత్తం (35) స్వీకరించామని అన్నారు. గోదావరిఖని విఠల్ నగర్‌కు చెందిన వీరారెడ్డి తనకు కంటి చూపు లేదని, సదరం క్యాంప్ నుంచి 100% కంటి చూపు లేనట్లు సర్టిఫికెట్ జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రూ. 2.90 కోట్ల గంజాయి దగ్ధం

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : భద్రాచలం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న రూ. 2. 90 కోట్ల విలువ చేసే 1160 కేజీలగంజాయిని అధికారులు సోమవారం ధగ్ధం చేసారు. ఈ మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా డిప్యూటి కమిషనర్ జనార్ధన్‌రెడ్డి వివరాలు అందించారు. భద్రాచలం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 35 కేసుల్లో ఈ గంజాయి పట్టుబడినట్లు చెప్పారు. కాల్చివేతకు డిస్పోజల్ అధికారిగా డిప్యూటి కమిషనర్ జనార్ధన్‌రెడ్డి అదేశాల మేరకు దగ్ధం చేయడం జరిగిందన్నారు. ఏడబ్ల్యుఎం కన్సల్టింగ్ లిమిటెడ్ తల్లేడ మండలం గోపాల్‌పేట్‌లో ఉన్న దహన కేంద్రంలో దీన్ని పూర్తిగా కాల్చివేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ గణేష్, కొత్తగూడెం ఎక్సైజ్ సూపరిండెంట్ జనాయ్య, భద్రాచలం ఎక్సైజ్ సీఐ రహీమ్ ఉన్నీషా బేగం పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా అధికారులు గంజాయిని పట్టుకోవడం కాకుండా నిబంధనల ప్రకారం దగ్ధం చేసినందుకు ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి అభినందించారు.

హమాలీలకు కూలీ రేట్లు పెంచాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: గోదావరిఖని కూరగాయల మార్కెట్ లో పని చేస్తున్న హమాలీలకు కూలీ రేట్లు పెంచాలని,లేకుంటే ఏఐటీయుసి ఆధ్వర్యంలో మార్కెట్‌ను నిర్బంధిస్తామని హమాలీ వర్కర్స్ యూనియన్ ఏఐటీయుసి గౌరవ అధ్యక్షులు మడ్డి ఎల్లయ్య అన్నారు. సోమవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్లో జరిగిన హమాలీ వర్కర్స్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథి పాల్గొని మాట్లాడుతూ గోదావరిఖని కూరగాయల మార్కెట్ లో పని చేస్తున్న హమాలీ లకు కూలీ రేట్లు పెంచాలని గత కొన్ని నెలల క్రితం హోల్ సేల్ వ్యాపారులకు, లేబర్ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా,ఇంత వరకు హమాలీ లకు కూలీ రేట్లు పెంచకుండా హోల్ సేల్ వ్యాపారులు నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని ఆయన అన్నారు. ప్రస్తుతం ఉన్న నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి వారికి ఇచ్చే కూలీ రేట్ల డబ్బులు సరిపోవడం లేదని,అనేక అవస్తలు పడుతున్నారని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ.గౌస్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్దెల దినేష్, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కండె లక్ష్మయ్య, రాంచందర్,సతీష్,జానీమియా తదితరులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాంకు నివాళి

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: ప్రతి పేదవారు ఉన్నత విద్యను అభ్యసించాలని భావించి, అందుకు అనుగుణంగా విద్యా సంస్థలను ఏర్పాటు చేసిన భారత తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని అదనపు కలెక్టర్ మెంచు నగేష్ పేర్కొన్నారు. సోమవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ 136వ జయంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జమ్లా నాయక్, ఏవో యూనిస్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డిఏ పిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మెను ప్రకారం భోజనం పెట్టాలి

విశాలాంధ్ర - పినపాక : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం విషయంలో నిర్లక్ష్యం చేయకుండా విద్యార్థులకు మెనూ ప్రకారం అందించాలని తహశీల్దార్ అద్దంకి నరేష్ ఆదేశించారు. ఆయన సోమవారం పినపాక మండలంలోని చేగర్షల ఎంపీపీఎస్ స్కూల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసారు.

రాబోయే ఒలింపిక్స్‌లో బంగారు పతకాలు సాధించాలి

విశాలాంధ్ర -బ్యూరో ఖమ్మం : రాబోయే ఒలంపిక్స్ లో మన తెలంగాణ రాష్ట్రం నుంచి బంగారు పతకాలు సాధించే క్రీడాకారులను తయారు చేయడం లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం మంత్రి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి వైరా పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆవరణలో నిర్వహించిన పదవ జోనల్ స్థాయి విద్యార్ధినుల క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 3 రోజుల పాటు జరిగే పదవ జోనల్ స్థాయి విద్యార్ధినుల క్రీడా పోటీలు నేడు ప్రారంభమయ్యాయని, ఖమ్మం ఉమ్మడి జిల్లా పరిధిలోని 14 సాంఘీక సంక్షేమ గురుకులాల్లోని సుమారు 1190 మంది పిల్లలతో వైరా పాఠశాలలో క్రీడా పోటీలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 చోట్ల ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. చిన్న పిల్లల నుంచి వృద్దుల వరకు ప్రభుత్వ పని తీరు ఎలా ఉందో గమనిస్తున్నారని మంత్రి అన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చి 11 నెలలు అవుతుందని, విద్యా, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించిందని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా 657 కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులను కల్పించామని మంత్రి అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ,విద్య, వైద్యం, వ్యవసాయం పై మన జిల్లా మంత్రివర్యులు ప్రత్యేక దృష్టి సారించారని, అన్నారు . కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ, గొప్ప హోదాల్లో ఉన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు హస్టల్లలోనే చదివారని, క్రీడలలో గెలుపోటములు, చిన్న, చిన్న దెబ్బలు తాకడం సహజమని, విద్యార్థులు ఉత్సాహంతో పోటీలలో పాల్గొనాలని కోరారు. అదేవిధంగా ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం హాస్టల్స్ లో పిల్లలకు మంచి నాణ్యమైన ఆహారం అందాలని డైట్ చార్జీలు పెంచడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల జోనల్ అధికారిణి కొప్పుల స్వరూపారాణి, డి.సి.ఓ. రాజ్యలక్ష్మి, వైరా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ప్రిన్సిపల్ డాక్టర్ డి. సమత, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, వివిధ గురుకులాల విద్యాలయాల ప్రిన్సిపాల్ లు, జోనల్ గేమ్స్ రూరల్ ఓవరాల్ ఇంచార్జ్ కె. శ్రీలత, వ్యాయామ ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు, టీచర్స్, గురుకులాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు మౌలానా ఆజాద్ : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : దేశ స్వాతంత్ర పోరాట యోధుడు, భారతరత్న గ్రహీతుడైన స్వర్గీయ మౌలానా అబుల్ కలాం ఆజాద్ కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఆనాడే విద్యావ్యవస్థ రూపురేఖలు మార్చారని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కొనియాడారు. మౌలానా ఆజాద్ 136 వ జయంతి వేడుకలను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఐ డి ఓ సి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ జితేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన

మౌలానా ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశ విద్యా వ్యవస్థను తీర్చిదిద్దిన పరిపాలన దక్షకుడని తెలిపారు. 11 ఏళ్లు విద్యాశాఖ మంత్రిగా దేశానికి ఆజాద్ ఎనలేని సేవలు అందించారని వివరించారు. ఆయనే తొలిసారిగా జాతీయ విద్యా విధానం అమలు చేశారన్నారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఏటా 11వ తేదీన జాతీయ విద్య దినోత్సవం నిర్వహిస్తున్నట్లు వివరిం చారు. స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న మైనార్టీ వర్గాల్లో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ అగ్రస్థానంలో నిలుస్తారన్నారు. రచయితగా, కవిగా, తత్వవేత్తగా, విద్యావేత్తగా, రాజకీయవేత్తగా దేశానికి అనేక సేవలందించారని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన,జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సంజీవరావు, జిల్లా అధికారులు, మైనార్టీ సంఘ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యస్తి ఉన్నత శిఖరాలకు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-ఇల్లందు : విద్యార్థి దశ నుంచే ఎవరైతే అంకిత భావం, క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తారో వారే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. భారత ప్రభుత్వ కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం పట్టణంలోని మైనారిటీ గురుకులంలో ప్రిన్సిపల్ భీమనపల్లి కృష్ణయ్య ఆధ్వర్యంలో మైనార్టీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కోరం విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఎందరో ఉన్నత స్థానాలకు ఎదిగారని వివరించారు. మైనారిటీ గురుకుల విద్యాలయాల్లో మంచి పౌష్టిక ఆహారం అందించేందుకు ప్రభుత్వం ఇటీవల డైట్ బిల్లులు పెంచిందని ఆయన గుర్తు చేశారు. మైనార్టీ గురుకులాల్లో విద్యార్థులకు ఎలాంటి కొలతలు లేకుండా చూస్తున్నామన్నారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపటి వెంకటేశ్వర రావు, కౌన్సిలర్ రవీందర్, అజాం, డిస్ట్రిక్ట్ అకడమిక్ కో ఆర్డినేటర్ అఫ్రోజ్, మత పెద్దలు ఇబ్రహీం, సిరాజ్, సిబ్బంది, పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ సభ్యత నమోదు

విశాలాంధ్ర-నేరేడు చర్ల : నేరేడుచర్ల మున్సిపల్ కేంద్రంలో అఖిల భారత యువజన సమాఖ్య సభ్యత కార్యక్రమాన్ని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో యువకుల కొరకు ఏర్పడిన మొట్టమొదటి యువజన సంఘం ఏఐవైఎఫ్ అని, దేశవ్యాప్తంగా జరుగుతున్న అన్ని ప్రజా పోరాటాల్లో ఏఐవైఎఫ్ కార్యకర్తలు నాయకులు భాగస్వామ్యం అవుతున్నారని, ముఖ్యంగా నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని స్థానిక పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని ఆయన అన్నారు. నేడు కేంద్రంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం యువతను తప్పుదోవ పట్టిస్తున్నదని కులం పేరుతో మతం పేరుతో యువతలో చైతన్యాన్ని రగిలించకుండా పాలకులను ప్రశ్నించకుండా మతోన్మాదంతో యువతను పక్కదో పట్టించడం వల్ల యువశక్తి నిర్వీర్యం అయిపోతుందన్నారు.సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు పరికే భరత్ బుడిగే సతీష్ కేతవరపు హరీష్ తదితరులు పాల్గొన్నారు

ఔటర్ రింగ్ రోడ్డుతో మారనున్న ఖమ్మం ముఖచిత్రం : మంత్రి తుమ్మల

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : ఖమ్మం నగరం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నామని ఆ రింగురోడ్డుతో ఖమ్మం నగరం ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందని అత్యంత వేగంగా అభివృద్ధి పరుగులు తీస్తుందని రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన ఖమ్మంలోని ధంసలాపురం అల్లిపురం మధ్య ఔటర్ రింగ్ రోడ్డు వద్ద ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఖమ్మం నగరం చుట్టూ జాతీయ రహదారులు ఏర్పాటు అవుతున్నాయని వాటిని కలుపుతూ ఔటర్ రింగ్ రోడ్డును వేయనున్నట్లు ఇందుకు సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. సూర్యాపేట నుండి ఖమ్మం మీదుగా దేవరపల్లి వరకు ఒక జాతీయ రహదారి పనులు వేగంగా జరుగుతుండగా ,మరో జాతీయ రహదారి కోదాడ నుండి కొరివి వరకు పనులు జరుగుతున్నాయని, అదేవిధంగా మరో జాతీయ

రహదారి నాగపూర్ నుంచి ఖమ్మం మీదుగా అమరావతి వరకు ఏర్పాటు కాబోతుందని చెప్పారు. ఆయా రహదారులను కలుపుతూ ఖమ్మం నగరం చుట్టూ రింగ్ రోడ్డు వస్తుందని తెలిపారు. ఇది ఇలా ఉంటే వచ్చే ఆగస్టు 15 నాటికి మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని, దాని ద్వారా రఘునాథపాలెం మండలానికి సాగునీరు తాగునీరు సమస్య పరిష్కారం అవుతుందని ఆయన తెలిపారు. ఖమ్మం జిల్లా నుంచి పరిసర ప్రాంతాలకు నూతనంగా వేయబోతున్న జాతీయ రోడ్ల వివరాలను నేషనల్ హైవే సంస్థ మేనేజర్ దివ్య ముందుగా తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ, గతంలో తాను మంత్రిగా పనిచేసిన సమయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని దాదాపు 45 మండలాలకు సాగునీటి సరఫరా కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. పాలేరు నియోజకవర్గం పరిధిలో భక్త రామదాసు ప్రాజెక్టుతో 70 వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చామని తెలిపారు. ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపల్లి మండలంలో సాగునీటి వసతి లేదని, ఎత్తైన ప్రాంతంలో ఉన్నందున సాగర్ నుంచి 66.33 కోట్లతో మంచుకొండ ఎత్తిపోతల పథకం మంజూరు చేశామని, వి.వెంకటాయ పాలెం గ్రామం దగ్గర 13 కిలోమీటర్ల వద్ద పంపు ఏర్పాటు చేసి మంచుకొండ ఎత్తిపోతల ద్వారా రఘునాధపాలెం మండలంలోని 30 చెరువులకు సాగర్ నీటి సరఫరా చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్ రావు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అంబి సాంబయ్య స్ఫూర్తితో ప్రజా పోరాటాలు ఉధృతం

విశాలాంధ్ర -ములుగు జిల్లా బ్యూరో (వరంగల్) : అంబి సాంబయ్య అందించిన స్ఫూర్తితో ప్రజా పోరాటాలు ఉధృతం చేద్దామని భారత జాతీయ మహిళా సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, సిపిఐ హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. దేశంలో నేడు నెలకొన్న అసమాన తలపై సామాజిక రుగ్మతలపై సమరశీల పోరాటాలు నిర్వహించాలని నేదునూరి జ్యోతి కర్రే బిక్షపతి పిలుపునిచ్చారు సోమవారం కొట్టేపాక రవి అధ్యక్షతన అంబి సాంబయ్య సంస్మరణ సభ దామర మండలం పెద్దాపురం గ్రామంలో నిర్వహించారు.సంస్మరణ సభకు ముఖ్య అతిథులుగా హాజరైన నేదునూరి జ్యోతి, కర్రే బిక్షపతి మాట్లాడుతూ అంబి సాంబయ్య స్ఫూర్తితో ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన సాంబయ్య భారత కమ్యూనిస్టు పార్టీలో, అతి కొద్ది కాలంలోనే క్రియాశీల నాయకునిగా ఎదిగి, పార్టీ ఇచ్చిన అనేక పోరాటాలలో నిర్భయంగా పాల్గొన్న వీరుడు,అంబి సాంబయ్య అని తెలిపారు. ప్రజలపై, పాలకవర్గాలు కొనసాగిస్తున్న, దుర్మార్గమైనటువంటి ప్రజా వ్యతిరేక విధానాలపై ధ్వజమెత్తాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆరేళ్ల రవి, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాలోత్ శంకర్,దాడి రవి కుమారులు, విద్యాసాగర్,రాజశేఖర్, భార్య సరోజన తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరకు ధాన్యం కొనుగోలుచేస్తే మిల్లులు సీజ్

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర 2320 కన్నా తక్కువగా రైస్ మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేయవద్దని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో కోరారు. ఒకవేళ ఎవరైనా రైస్ మిల్లరు మద్దతు ధర కన్నా తక్కువగా ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను మోసం చేసినట్లయితే ఆ రైస్ మిల్లును సీజ్ చేయడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. రైస్ మిల్లును సీజ్ చేయడంతో పాటు, ఆ మిల్లుకు సంబంధించిన అన్ని రకాల లైసెన్సులను రద్దు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2320 తక్కువ కాకుండా మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆమె కోరారు.రైతులు ధాన్యాన్ని అమ్మేందుకు రైస్ మిల్లులకు వెళ్లకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధరతో పాటు, బోనస్ ను కూడా పొందాలన్నారు.

బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో గ్రేస్ హాపర్ సెలబ్రేషన్స్

బెంగళూరు: భారతదేశంలో గ్రేస్ హాపర్ సెలబ్రేషన్ ఇండియా (జీహెచ్‌సీఐ) 2024ని అనితాబీ.ఆర్గ్ నిర్వహిస్తుండగా, ఇది భారతదేశంలోని మహిళలు, నాన్-బైనరీ సాంకేతిక నిపుణులకు సాధికారతకు అంకితమైన ప్రధాన కార్యక్రమం. ఇది బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్ (బీఐఈసీ)లో నవంబర్ 20-22 వరకు నిర్వహిస్తుండగా, సంయుక్త ఆవిష్కరణలతో కూడిన భవిష్యత్తును ప్రేరేపించేందుకు, నెట్‌వర్క్‌కు, ముందుకు కొనసాగేందుకు టెక్ నిపుణుల శక్తివంతమైన సముదాయన్ని ఒకచోట చేర్చేందుకు “నేను, మేము, కలెక్టివ్ పవర్” అనే థీమ్‌తో ఈ ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వారసత్వపు ప్రభావాన్ని కొనసాగిస్తూ, హిమాచల్ ప్రదేశ్‌లోని హమీర్‌పూర్‌లో నిర్వహించిన గత జీహెచ్‌సీఐ ఎడిషన్‌కు భారతదేశంలోని 205 నగరాల నుంచి 6,529 మంది హాజరయ్యారు. ఇందులో ఆఫ్ఘనిస్థాన్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, బొలీవియా, సింగపూర్, యూకే, యూఎస్‌ఏతో సహా 9 దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు

అమరావతి: ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో (ఈ-వేస్ట్) పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందనీ, వీటివల్ల ఎదురయ్యే అనర్ధాల గురించి ప్రజల్లో అవగాహన పెంచేందుకు యువత నడుం బిగించాలని గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పిలుపునిచ్చారు. ప్రముఖ సెల్‌ఫోన్ల తయారీ కంపెనీ ఒప్పో ఇండియాతో కలిసి ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ గురువారం ఈ-వేస్ట్‌పై ప్రత్యేక అవగాహనా సదస్సు నిర్వహించింది. పలు పాఠశాలల విద్యార్థులతో పాటు ఎన్విరాన్మెంటల్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థులు సదస్సుకు హాజరయ్యారు. దృశ్యమాధ్యమ పద్ధతిలో వీడియో సందేశాన్ని పంపిన కలెక్టర్ నాగలక్ష్మి ఈ వేస్ట్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, ఏపీ ఎస్ఆర్ఎం, ఒప్పో కంపెనీల చొరవను ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతాల్లోని స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు సమస్యను పరిష్కరించడంలో భాగస్వాములు కావాలని సూచించారు. విశిష్ట అతిథిగా హాజరైన ఒప్పో ఇండియా కంపెనీ ప్రజా వ్యవహారాల విభాగం అధిపతి రాకేశ్ భరద్వాజ్ మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా సెల్‌ఫోన్ల తయారీలో రెండో స్థానంలో ఉన్న భారత్ ఈ-వేస్ట్ రీసైక్లింగ్లో వెనుకబడి ఉన్నామన్నారు.

ఏడబ్ల్యూఎస్‌తో కోమ్వివా భాగస్వామ్యం

ముంబయి: కోమ్వివా అనేది వినియోగదారులకు మంచి అనుభవాలను అందించడానికి, సమాచారాన్ని డబ్బులుగా మార్చే పరిష్కారాలకు ఒక అగ్రగామి సంస్థ. అది ఈరోజు అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) అనే ఒక అమెజాన్.కామ్ సంస్థతో తన భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఏడబ్ల్యూఎస్ కామ్వివాని మొదట క్లౌడ్ ఫర్స్ట్, ఏఐ నడిపించే వాటి ద్వారా నిర్మించాలని అనుకుంటుంది. అవి మార్కెట్‌లో వేగవంతంగా సమయానికి అనుకూలంగా నడుస్తాయి. ఎలాంటి ఇబ్బంది లేని ఆర్థిక ఎదుగుదలని అందిస్తాయి. ఏడబ్ల్యూఎస్‌పై నిర్మించిన కోమ్వివా కమ్యూనికేషన్స్ సర్వీస్ ప్రొవైడర్స్ (సిఎస్‌పి)కి సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులను, ప్లాట్ఫామ్‌లను తరువాత తరం వారికి సాఫ్ట్‌వేర్- యాజ్-ఏ-సర్వీస్ (ఎస్ఏఏఎస్) మోడల్ ద్వారా అందిస్తుంది. ఏడబ్ల్యూఎస్, కోమ్వివా కలిసి ఉత్పత్తిని ఆధునీకరించడం, దానికి తగ్గ పురోగతి, సాంప్రదాయక మార్పు, వ్యాపార ఎదుగుదల, జెనరేటివ్ ఏఐని అందించడం వంటి వాటిని కలిసి చేస్తున్నాయి.

రెండు మోడళ్లతో న్యూ డిజైర్‌ను ప్రవేశపెట్టిన మారుతీ సుజుకి

న్యూఢిల్లీ: కాంపాక్ట్ సెడాన్ విభాగంలో కొత్త బెంచ్‌మార్క్‌ను సృష్టిస్తూ, మారుతీ సుజుకి ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్), పెట్రోల్, ఎస్-సీఎన్‌జీ మోడళ్లతో అద్భుతమైన న్యూ డిజైర్‌ను తాజాగా ప్రవేశపెట్టింది. మారుతి సుజుకి పోర్ట్‌ఫోలియోలో అత్యంత విజయవంతమైన, దిగ్గజ బ్రాండ్‌లలో ఒకటిగా, డిజైర్ దేశవ్యాప్తంగా 27 లక్షల మంది వినియోగదారుల నమ్మకాన్ని సంపాదించుకుంది. మిరుమిట్లు గొలిపే న్యూ డిజైర్ దాని వారసత్వం, సాటిలేని శైలి, సౌలభ్యం, విశ్వసనీయత బలమైన పునాదిపై నిర్మించడానికి పునఃరూపకల్పన చేయబడింది. దాని ప్రగతిశీల డిజైన్, ఖరీదైన టూ-టోన్ ఇంటీరియర్స్, సెగ్మెంట్-ఫస్ట్ ఫీచర్ల హోస్ట్‌తో, మిరుమిట్లు గొలిపే న్యూ డిజైర్ విశిష్టమైన, ప్రీమియం అనుభవాన్ని అందిస్తుంది. కార్లను వారి వ్యక్తిత్వానికి ప్రతిబింబంగా చూసే యువ, నిష్ణాతులైన వ్యక్తుల కోసం రూపొందించబడిన కొత్త డిజైర్ పనితీరు, అధునాతనత, సౌకర్యాలతో శైలిని అప్రయత్నంగా ఏకీకృతం చేయడం ద్వారా గేమ్-ఛేంజర్‌గా మారాలని లక్ష్యంగా పెట్టుకుంది. నెక్స్ట్-జెన్ జెడ్-సిరీస్ ఇంజిన్‌తో, ఆల్-న్యూ మారుతి సుజుకి డిజైర్ భారతదేశపు అత్యంత ఇంధన-సమర్థవంతమైన సెడాన్‌లిగా అద్భుతమైన విలువను అందిస్తుంది.

ఫ్యూచర్-టెక్ స్కిల్స్‌లో 3,500 మందికి శామ్‌సంగ్ శిక్షణ

గురుగ్రామ్: శామ్‌సంగ్ ఇండియా 2024 సంవత్సరానికి శామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ (ఎస్ఐసీ) ప్రోగ్రామ్ కింద 3,500 మంది విద్యార్థుల సర్టిఫికేషన్‌ను పూర్తి చేసింది. భారత ప్రభుత్వం స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా కార్యక్రమాలకు అనుగుణంగా, శామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ యువతకు ఏఐ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బిగ్ డేటా, కోడింగ్, ప్రోగ్రామింగ్ వంటి అధిక డిమాండ్ ఉన్న సాంకేతిక రంగాలలో శిక్షణ ఇవ్వడం ద్వారా వారికి ఉపాధిని మెరుగుపరచడంపై దృష్టి సారిస్తుంది. 2024లో, శామ్‌సంగ్ ఫ్లాగ్‌షిప్ సీఎస్ఆర్ చొరవ 2023లో 3,000 మంది విద్యార్థులను చేర్చుకోవడం ద్వారా 3,500 మంది విద్యార్థులను చేర్చుకోవడం ద్వారా తన పరిధిని విస్తరించింది. ఇది ఉత్తరప్రదేశ్, ఢిల్లీ ఎన్‌సీఆర్, తమిళనాడు, కర్ణాటకలోని విద్యా సంస్థలలో నిర్వహించబడిన 12 ఎస్ఐసీ ధృవీకరణ ఈవెంట్‌లను కలిగి ఉంది. ఎస్ఐసీ కింద కోర్సులు ఆరు విశ్వవిద్యాలయాలు, ఒక జాతీయ నైపుణ్య సంస్థలో పనిచేస్తున్నాయి.

సోనీ లివ్‌లో నవంబర్ 15న ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్

హైదరాబాద్: ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫ్రీడమ్ ఎట్ మిడ్ నైట్ ట్రైలర్ విడుదలైంది. స్టూడియోనెక్స్ట్‌తో కలిసి ఎమ్మే ఎంటర్‌టైన్‌మెంట్ (మోనిషా అద్వానీ అండ్ మధు భోజ్వానీ) నిర్మించారు, ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్‌లో తెరవెనుక ఒక అద్భుతమైన బృందం ఉంది. నిఖిల్ అద్వానీ ఈ ప్రాజెక్ట్‌కి షోరన్నర్, డైరెక్టర్‌గా నాయకత్వం వహిస్తుండగా, అభినందన్ గుప్తా, అద్వితీయ కరేంగ్ దాస్, గుందీప్ కౌర్, దివ్య నిధి శర్మ, రేవంత సారాభాయ్, ఏతాన్ టేలర్‌లతో సహా ప్రతిభావంతులైన బృందంతః కథను అందించింది. లారీ కాలిన్స్ మరియు డొమినిక్ లాపియర్ రాసిన పేరులేని పుస్తకం ఆధారంగా, ఈ ధారావాహిక భారతదేశం స్వాతంత్ర్య పోరాటం చుట్టూ ఉన్న గందరగోళ సంఘటనలను లోతుగా పరిశోధిస్తుంది. ఈ ధారావాహికలో జవహర్‌లాల్ నెహ్రూగా సిధాంత్ గుప్తా, మహాత్మా గాంధీగా చిరాగ్ వోహ్రా, సర్దార్ వల్లభాయ్ పటేల్‌గా రాజేంద్ర చావ్లా, ముహమ్మద్ అలీ జిన్నాగా ఆరిఫ్ జకారియా, ఫాతిమా జిన్నాగా ఇరా దూబే, సరోజినీ నాయుడుగా మలిష్కా మెండోన్సా, లిఖ్వా కుమారి రాజ్‌త్‌తో సహా నక్షత్ర తారాగణం నటించింది.ఇది సోనీ లివ్‌లో నవంబర్ 15న ప్రసారం కానుంది.

హిందుస్థాన్ జింక్ శిక్షా సంబల్ దీపావళి క్యాంప్ విజయవంతం

ఉదయ్‌పూర్: భారతదేశంలోని అతిపెద్ద, ప్రపంచంలోని రెండవ అతిపెద్ద సమీకృత జింక్ ఉత్పత్తిదారు అయిన హిందుస్తాన్ జింక్ లిమిటెడ్, దాని శిక్షా సంబల్ దీపావళి క్యాంప్ 2024ని విజయవంతంగా ముగించింది. హిందుస్థాన్ జింక్ యొక్క శిక్షా సంభాల్ కార్యక్రమంలో భాగంగా, విద్య-కేంద్రీకృత సీఎస్ఆర్ కార్యక్రమం, 2008 నుండి రాజస్థాన్‌లో నిర్వహించబడుతోంది, తక్కువ గ్రామీణ ప్రాంతాల్లో ఏటా 2 లక్షల మంది పిల్లల జీవితాలను ఉద్ధరించింది. శిబిరాల ఉద్దేశం ఆర్థిక, సామాజిక పరిమితుల కారణంగా, చదువులు, సంతృప్తికరమైన వృత్తిని కొనసాగించే అవకాశం ఉన్న మొదటి తరం అభ్యాసకులకు మద్దతు ఇవ్వడం. పండుగ విరామ సమయంలో పాఠశాల విద్యను ముగించే చివరి దశలో ఉన్న 9, 10 తరగతుల విద్యార్థులకు విద్యాపరమైన సహాయాన్ని అందించే ఈ సంవత్సరం శిబిరం రెండు దశల్లో జరిగింది. ఈ శిబిరాలు నిర్మాణాత్మక సెషన్‌ల ద్వారా చదవడం, రాయడం, గణితం, సైన్స్ వంటి పునాది సబ్జెక్టులలో మద్దతునిచ్చాయి, గణితం, ఆంగ్లం కోసం మెరుగైన లైబ్రరీ పనితో పాటు సైన్స్ విద్యార్థుల కోసం ఫీచర్ చేసిన వర్క్‌బుక్ వ్యాయామాలు, ప్రాక్టికల్ ల్యాబ్ పని.

భారతదేశంలో బిగ్ బాల్‌ను విడుదల చేసిన డైసన్

ముంబయి: తమ అత్యంత శక్తివంతమైన కార్డెడ్ వాక్యూమ్ క్లీనర్ డైసన్ బిగ్ బాల్ వాక్యూమ్‌ను విడుదల చేశామని డైసన్ ప్రకటించింది. ఇది సులభమైన స్టీరింగ్ కోసం బాల్ సాంకేతికతను కలిగి ఉండడంతో, శ్రమ రహితంగా మూలల్లోకి, ఇరుకైన ప్రదేశాల్లోకి దూసుకుపోతూ, దొర్లుతూ తనంతర తానే ధూళిని సేకరిస్తుంది. ఇది అన్ని రకాల ఫ్లోర్లను శుభ్రం చేసేందుకు అనువైన ఇంజినీరింగ్‌తో, కార్బన్-ఫైబర్ క్లీనర్ హెడ్, ఒక మ్యాట్రెస్ టూల్, కాంబి/క్రీవిస్ టూల్‌తో లభిస్తుంది. ఇది ఒక పెద్ద 1.6లీ బిన్, పొడవైన 22 అడుగుల వైరుతో, ఇది మీ ఇంటిలో లోతైన శుభ్రతను అందించేందుకు, ప్రతి ఉపరితలాన్ని చేరుకునేందుకు అనుమతిస్తుంది. ఇది నో-టచ్ బిన్ స్పేస్‌ను కూడా అందిస్తుంది. సెల్ఫ్-రైటింగ్ సాంకేతికత కలిగి ఉండడంతో అది బోర్లా పడినప్పుడు దానంతట అదే పైకి లేచేందుకు అవకాశం కల్పిస్తుంది.

మైఖేల్ మోబియస్‌కు డైమ్లర్ ఇండియా కీలక బాధ్యతలు

ముంబయి: డైమ్లర్ ట్రక్ ఏజి వారి పూర్తిగా సొంతం చేసుకున్న అనుబంధ సంస్థ డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికిల్స్ (డిఐసివి) మైఖేల్ మోబియస్‌ను ప్రెసిడెంట్, ఛీఫ్ ప్రొక్యూర్మెంట్, సప్లై చెయిన్ ఆఫీసర్‌గా నవంబర్ 1, 2024 నుండి నియామకం చేసినట్లుగా ప్రకటించింది. మైఖేల్ ముత్తు మరుతాచలం సి స్థానంలో ఈ పదవి చేపడుతున్నారు, ప్రయాణికులు, వాణిజ్య వాహనాల పరిశ్రమలో ఈయనకు 30 సంవత్సరాలకు పైగా అంతర్జాతీయ అనుభవం ఉంది. జపాన్‌లో డైమ్లర్ ట్రక్ ఏసియా (డిటిఏ)లో క్వాలిటీ మేనేజ్మెంట్ ప్రధాన అధికారిగా మైఖేల్ పని చేస్తున్నారు, ఆయన అంతర్జాతీయంగా మిట్సుబిషి ఫ్యూజో, డిఐసివి, పీఏబీసీఓ, కీలకమైన సీకేడీ అసెంబ్లీ ప్రాంతాల కోసం నాణ్యత చొరవలకు మార్గదర్శకత్వం వహించారు. ఆయన తన పదవీ కాలంలో, ఉత్పత్తి నాణ్యతను మెరుగుపరచడంలో, వారంటీ ఖర్చులు తగ్గించి, విఫలమవడాన్ని ముందస్తుగా గుర్తించడానికి ఆధునికమైన పెద్ద డేటా పరిష్కారం ‘ప్రోయాక్టివ్ సెన్సింగ్’ వంటి వినూత్నమైన చొరవలను ప్రోత్సహించడంలో కీలకమైన వ్యక్తిగా ఉన్నారు. 1990లో డైమ్లర్‌తో తన కెరీర్‌ను ప్రారంభించిన మైఖేల్, మెర్సిడెస్-బెంజ్ కార్లు, డైమ్లర్ బస్సుల విభాగాల్లో వివిధ పదవులు నిర్వహించారు.

పిల్లల కంటి సంరక్షణ పై అవగాహన

హైదరాబాద్: పిల్లలలో వచ్చే వివిధ కంటి వ్యాధులపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ అవగాహన వాక్ నిర్వహించింది. ఈ అవగాహన వాక్‌ను హైదరాబాద్‌లోని కల్లం అంజి రెడ్డి క్యాంపస్ దగ్గర సంగీత దర్శకుడు తమన్, నటుడు విశ్వ కార్తికేయ ప్రారంభించారు. ఈ కంటి సంరక్షణ అవగాహన వారోత్సవం ఈనెల 7న ప్రారంభమైంది. 14వ తేదీ వరకు జరగనుంది.ఈ సంవత్సరం థీమ్ ‘చైల్డ్ హుడ్ క్యాటరాక్ట్’. ఈ సందర్భంగా తమన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగం కావడం ఆనందంగా ఉందన్నారు. ‘తక్షణం గుర్తించండి, త్వరగా చర్య తీసుకోండి, పిల్లలు స్పష్టంగా చూడటానికి అవసరమైన చర్యలు తీసుకోండి’ అని తల్లిదండ్రులకు సూచించారు.

సంపాదకీయం

రాజకీయపత్రంగా బడ్జెట్

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు ముగిసి నూతన ప్రభుత్వం ఏర్పడిన ఆరుమాసాల తర్వాత తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం తొలిసారిగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. బడ్జెట్ అంటే భారీ కేటాయింపులు, ఆచరణకు వచ్చేసరికి కోతలు, ప్రాధమ్యాల్లో మార్పులు... ఈ ఆనవాయితీని పయ్యావుల కేశవ్ బడ్జెట్ కూడా అనుసరించింది. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి రూ. 2, 94,427.25 కోట్లతో వార్షిక బడ్జెట్‌ను రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం శాసనసభలో ప్రవేశపెట్టారు. బడ్జెట్లో రెవెన్యూ వ్యయం అంచనా రూ. 2, 35,916.99 కోట్లు, మూలధన వ్యయం అంచనా రూ. 32,712.84 కోట్లుగా పేర్కొన్నారు. రెవెన్యూ లోటు రూ. 34,743.38 కోట్లు, ద్రవ్య లోటు రూ. 68,742.65 కోట్లుగా పయ్యావుల తన బడ్జెట్ ప్రసంగం ద్వారా వెల్లడించారు. బడ్జెట్లో వివిధ కీలక రంగాలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీల ఊసు అంతగాలేకుండానే ఈ బడ్జెట్‌ను వండివార్చినట్లు స్పష్టమవుతోంది. అద్భుతాలు చేయగలిగే ఆర్థికస్థితి లేనప్పుడు, ఉన్నదానిలో ప్రాధాన్యాలను సవ్యంగా నిర్ణయించుకోవడం సరైన పద్ధతి. దాన్నే ఈ బడ్జెట్ రూపకల్పనలో అనుసరించినా, కొన్ని కీలక రంగాలకు కేటాయింపులను తగ్గించడం కొట్టొచ్చినట్లు కనిపించే లోపం. ప్రజాసంక్షేమం, అభివృద్ధిని ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించింది. కేవలం ఐదు నెలలకు మాత్రమే ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇది. రూ.43, 402 కోట్లతో వ్యవసాయ బడ్జెట్ ను మంత్రి అచ్చెన్నాయుడు ప్రవేశపెట్టారు.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పతనం అంచున ఉందనీ, అభివృద్ధి పథంలో నడిపించాల్సి ఉందని బడ్జెట్ ప్రసంగం మొదట్లోనే ఆర్థిక మంత్రి చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు. గత దుర్మార్గపు ప్రభుత్వ పాలనను ప్రజలు పాతరేశారన్నారు. దయనీయమైన ఆర్థిక వ్యవస్థను వారసత్వంగా ఇచ్చారంటూనే, దాన్ని గాడిన పెట్టే ప్రయత్నం చేయకపోవడం విచిత్రం. రూ.68, 742.65 కోట్ల ద్రవ్యలోటు భారీ బడ్జెట్ అమలుపై సందేహాలను రేకెత్తిస్తూనే ఉంది. విభిన్న రంగాల్లో అవసరాలకు దీటుగా సొంత వనరులను సమీకరించుకోవడంపై శ్రద్ధ చూపాల్సిన అవసరాన్ని ఈ లోటు గుర్తుచేస్తోంది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో బడ్జెట్లో కనీస ప్రస్తావనకు నోచుకోలేదు. ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగం ఆత్మస్తుతి, పర నిందతో నిండిపోయింది. అనేక పేరాల్లో ముఖ్యమంత్రిని కీర్తించడం, అలాగే గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసాన్ని వర్ణించడానికే సరిపోయింది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వైసీపీ సర్కారు ఛిన్నాభిన్నం చేసిందని బడ్జెట్ అనంతరం మంత్రులు పేర్కొన్నారు. గత వైసీపీ సర్కారు రూ. 1.35 లక్షల కోట్ల మేర బకాయిలు పెట్టి వెళ్లిపోయిందనీ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు నిర్దిష్టంగా కలిగే ప్రయోజనాల గురించి బడ్జెట్లో ఏమాత్రం ప్రస్తావన లేదు. సంక్షేమ పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం గురించి ఘనంగా చెప్పిన ఆర్థిక మంత్రి మహిళలకు ఉచిత బస్ ప్రయాణం త్వరలో ప్రారంభిస్తామని చెప్పారేతప్ప సూపర్ 6లో భాగమైన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటివి ఎప్పుడు అమలు చేస్తారో చెప్పకపోవడం ఆయా తరగతులకు తీవ్ర నిరాశ కలిగిస్తోంది. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పిన కూటమి బడ్జెట్లో చార్జీల తగ్గింపు గురించి ప్రస్తావనే చేయకపోవడం విడ్డూరం. విద్యుత్ రంగం విషయంలో ప్రజల పైన తీవ్రభారాలు పడుతున్నాయి. ప్రజలపై విద్యుత్ భారాలు మోపకుండా బడ్జెట్ ప్రతిపాదనలలో ఎటువంటి పరిష్కారం చూపలేకపోయారు. బడ్జెట్లో నీటిపారుదల రంగానికి మాత్రం సమగ్ర ప్రాధాన్యత ఇచ్చినట్టు కనిపిస్తోంది. టీడీపీ కూటమి ఎన్నికల ముందు హామీ ఇచ్చిన మహాశక్తి పథకం బడ్జెట్లో కానరాకుండాపోయింది. 19 నుంచి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ. 1500 ఆర్థిక సహాయం అందిస్తామని ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే బడ్జెట్లో ఈ అంశం ఊసెత్తకపోవటం గమనార్హం. తల్లికి వందనానికీ బడ్జెట్లో అరకొర నిధుల్ని కేటాయించారు. మొత్తం పాఠశాల విద్యకు బడ్జెట్లో 29,900 కోట్ల నిధులు కేటాయించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం ప్రతి ఇంట్లో పాఠశాలలకు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15వేలు ప్రకటించింది. ఈ పథకానికి రాష్ట్ర వ్యాప్తంగా 80లక్షల మంది అర్హతగల తల్లులున్నారు. వారికి రూ.10వేల కోట్లకుపైగా నిధుల్ని కేటాయించాలి. తల్లికి వందనానికి 2,491 కోట్లను మాత్రమే ప్రభుత్వం కేటాయించింది. ఈ కొద్దిపాటి నిధులతో ఎలా పథకాన్ని అమలు చేస్తారనేదీ ప్రశ్నార్థకంగా మారింది. పోలవరం ప్రాజెక్టును పూర్తిచేయడం ప్రభుత్వ ప్రాధాన్యత అని మంత్రి బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. కానీ, నిర్వాసితుల గురించి మాటమాత్రమైనా ప్రస్తావించలేదు. ఎప్పటిలోగా ప్రాజెక్టును పూర్తి చేస్తారన్నదీ స్పష్టంగా చెప్పలేదు. పరిశ్రమలకు, పెట్టుబడులకు గమ్యంగా రాష్ట్రాన్ని మారుస్తామన్నారు కానీ సంపద సృష్టించే కార్మికుల సంక్షేమం ఊసు లేదు. ఆదివాసులు, దళితులకు, మహిళలు, మైనార్టీల సంక్షేమానికి నామమాత్రంగా నిధులు కేటాయించడం అన్యాయం. మహిళా శిశు సంక్షేమ కేటాయింపులు రూ. 4,285 కోట్లు మాత్రమే. మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాల ప్రస్తావన లేదు. ఇక వివిధ పథకాలు వల్లె వేసిన మంత్రి వాటిని బాల బాలికలకు, బాలింతలకు సేవలందిస్తున్న అంగన్వాడీ వర్కర్లకు, హెల్పర్లకు పెండింగ్‌లో వున్న వేతన పెంపు హామీల గురించి ప్రస్తావించలేదు. పంటల బీమా స్వచ్ఛంద నమోదు అన్న ఆకర్షణీయ మాటల వెనుక ఇప్పటివరకున్న ఉచిత బీమా ఇకపై రైతు ప్రీమియం చెల్లిస్తేనే అమలవుతుందన్న విషయాన్ని దాచిపెట్టడం అన్నదాతను మభ్యపెట్టడమే తప్ప మరేమి కాదు. ఇటీవల కాలంలో తరచు సంభవిస్తున్న తాగునీరు కలుషితం కావడం, అకస్మిక భారీ వర్షాలు కారణంగా నీటమునగడం వంటి ఘటనలను ప్రస్తావించడం కానీ, పరిష్కార మార్గాలకు చర్యలను గానీ ప్రస్తావించలేదు. ధరల పెరుగుదల నుంచి ప్రజలకు కలిగించే ఉపశమనం ఏమిటో బడ్జెట్ ప్రసంగంలో పేర్కొనలేదు. ఇప్పటికే విద్యుత్ చార్జీల భారాలు మోపిన ప్రభుత్వం మద్యం అమ్మకాలు, రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు ద్వారా మరిన్ని భారాలు వేసింది. రాష్ట్రంలో సరాసరిన ఒక్కొక్కరిపై రూ. 1, 44,000 అప్పుల భారంపడిందని చెప్పిన ప్రభుత్వం ఈ బడ్జెట్లో రూ. 68,743 కోట్లు అప్పులు వేస్తూ భారాన్ని మరింత పెంచడం అన్యాయం. లోటు పూడ్చుకోవాలన్నా, ఆదాయాన్ని రాబట్టుకోవాలన్నా ఏదో రూపంలో ప్రజలపై భారం వేయక తప్పదు. ఖరారు చేసిన లక్ష్యాలు మంచివే అయినా, వాస్తవాలకు సుదూరంగా ఉన్నప్పుడు అనుకొన్న ప్రయోజనం సిద్ధించదు. బడ్జెట్ అంకెలకు విశ్వసనీయత లేకపోవడం ఈ బడ్జెట్లోనూ కనబడింది. బడ్జెట్లో వాస్తవికతకూ, ఆశకూ మధ్య లంకె కుదరని పరిస్థితి కనిపిస్తోంది. ప్రజా, కార్మిక, రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ ప్రతిపాదనలలో మార్పులు చేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది.

నాయకుల కులం

చింతపట్ల సుదర్శన్

రంగస్థలం

మనిషి మనిషిలా కాక మరోలా ప్రవర్తిస్తే పశువు అంటారట. మనిషి మనిషిలా కాక పశువు కంటే హీనంగా ప్రవర్తిస్తే, మనిషిని పశువుతో పోల్చడం న్యాయం కాదు అంది డాగీ చెవులు ఎగరేస్తూ, ముక్కు ఉబ్బిస్తూ. ఎందుకో గ్రామ సింహం గ్రామంలోని జనం మీద ఆగ్రహిస్తున్నది అంది డాంకీ.

పేదవాడి కోపం పెదవికి చేటు వీధి కుక్క కోపం గాలిలో దీపం. నా కోపం వల్ల ఎవరికి ప్రమాదంలే అంది డాగీ. అసలింతకీ నీ ఈ 'అన్‌రెస్టు' కి కారణమేమిటో చెప్పరాదూ. ఏం చెప్పమంటావు డాంకీ బ్రో ఈ మధ్య మనుషుల ఆగడాలు శృతి మించిపోతున్నవి. నిన్న రాత్రి ఒక దుష్ట దుర్మార్గ భ్రష్టభ్రాష్టుడు మన వీధిలోని ఓ కుక్కను బలవంతంగా ఈడ్చుకుపోయి మూడవ అంతస్తు పైనుంచి కిందకు తోసేశాడు. అది గాలిలోనే గాలి వదిలేసి చచ్చి నేలమీద పడింది. ఇప్పుడే ఈ వీధి కుక్కలతో కల్సి వెళ్లిచూసి వస్తున్నా కోపం కట్టలు తెచ్చుకుంది కానీ కొరకటానికి పిక్క దొరకలేదు అంది డాగీ. ఇదే ఈ తొందరపాటే ఆ కుక్క ప్రాణం తీసింది. ఆ తోసిన వాడి కొడుకుని ఈ కుక్క కరిచిందట గదా. కరిచింది కరవక ఏం చేస్తుంది. దీపావళి బాంబుల చేరు ఒకటి అంటించి దాని వీపు మీద వేస్తే అదిరి, బెదిరి ఏం చేయాలో తోచక కరిచేసింది. కొడుకు చేసిన అఘాయిత్యాన్ని సమర్థిస్తూ, ఆ పుండాకోరు తండ్రి దీన్ని పైనుంచి తోసి చంపేయాలా? మహామహా యమహా నేరాలు చేసిన మనుషులకేమో బెయిళ్లూ, క్షమాపణలూనా? అంది డాగీ. పిచ్చి డాగీ! ఈ ప్రపంచకం మనిషి తాత ముల్లె. ఇక్కడ వాడిదే రాజ్యం. వాడు తండ్రిని చిన్నాననీ, బావనీ, మామనీ, బామ్మనీ ఎవడినైనా చంపి షంషీర్‌లాగు, బహద్దూరు లాగు తిరుగవచ్చు. కానీ కుక్కలకు మనిషిని కరిచే హక్కులేదు అంది డాంకీ. అవునవును మనుషుల్ని మనుషులు చంపి పాతరేసుకోవచ్చు. కారణం లేకుండా కాల్చి బూడిద చేయవచ్చు. చట్టంలో దొంగా పోలీసు ఆట ఆడవచ్చు. అడవిలో పులీ, సింహం ఆకలి తీర్చుకోవడానికి, అంటే బతికి ఉండటానికి జంతువుల్ని వేటాడుతాయి కానీ మనుషులు ప్రాణం నిలుపుకునే అవసరానికి కాక డబ్బు కోసం, పదవి కోసం, సుఖం కోసం చంపుకోవడం ఎంత దుర్మార్గం అని డాగీ అంటుండగా అబ్బాయి అరుగు ఎక్కాడు.

మనుషుల్ని మనుషులు కోసుకుంటారు, చంపుకుంటారు అది వాళ్ల ఇష్టారాజ్యం. నాయకులు అవతలి పార్టీ వాళ్లను బూతులు తిడ్తారు, బురదతో కొడ్తారు గుడ్డ కాల్చి మీదేస్తారు, ఆరోపణలు చేస్తారు, ఎత్తి కుదేస్తారు అది నాయకులుగా వాళ్ల జన్మహక్కు అన్నాడు అబ్బాయి. అవునవును ఈ మధ్యన ఒకాయన అవతలి పక్షం నాయకుడిపైన బాంబులు, అణుబాంబులు పేలబోతున్నవని భయపెడ్తున్నాడు అంది డాంకీ. నోరూ, నోటిలో నాలుకా, చుట్టూ జైకొట్టే జనమూ ఉన్న వారందరూ ఇదే చేస్తారు. మాజీలు తాము అధికారంలో ఉన్నప్పుడు చేసిన గొప్పలు ఢంకా బజాయించి చెప్తే వాటిలో లోపాలు ఎత్తి చూపుతారు ఇప్పటి మారాజులు. వీళ్ల చేసినవన్నీ మేము అప్పుడే చేశామని వాళ్లు, వాళ్లు చేసినవన్నీ తప్పులూ, తడకలూ అని వీళ్లు ఇలాగ నెట్టుకొస్తారు మరి, ఐదు ఏళ్లూ అంది డాగీ. గెలిచిన వాళ్లకు ఐదేళ్లూ రేసుగుర్రంలా పరుగెత్తాలని ఉంటుందిలే అన్నాడు అబ్బాయి. అవును బ్రో ఒకాయన మరొకాయనను కుక్క చావు చస్తావని శాపనార్థాలు పెట్టాట్ట నిజమేనా? అనడిగింది డాంకీ. కుక్క చావా? ఎవడా మాట అన్నది. కుక్కలం ఎట్లాగూ రోడ్లమీద వాహనాల కింద మా చావు మేం చస్తున్నాం ఇక మనుషులు కూడా కుక్కల్లా చావడం దేనికి అని కోప్పడింది డాగీ.

ముఖం నిండా చెమటతో, చేతిలో కాగితాల కట్టతో అరుగు ఎక్కింది ఓ అమ్మాయి. డాగీ, డాంకీ సైలెంటయి పోయాయి. అబ్బాయి మాత్రం ఆ అమ్మాయికేసి ఏమిటి విషయం అన్నట్టు చూశాడు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే కోసం వచ్చాను అందా పాఠశాల ఉపాధ్యాయిని. బళ్లో పాఠాలు మానిపించి, మీతో ఈ తలా తోకా లేని పని చేయిస్తున్నారా అంది డాగీ, కానీ అదామెకు అర్థం అయ్యేలా వినిపించలేదు. ఊరుకో 'సీను' క్రియేట్ అవుతుంది అంది డాంకీ, డాగీకి మాత్రమే వినపడేట్టు అవునూ కులగణన కోసం సర్వే అన్నారు మరి. దాన్ని ఆ అదే కుల సర్వేను మరియు అంటూ మిగతా వాటికి చివరన 'తోకలా' తగిలించేరేం అన్నాడు అబ్బాయి. నాకే తెలీదు ఈ ఇంట్లో ఎవరెవరుంటారు అందా సర్వేయరు. ఈ కూలిన కొంపలో ఎవరుంటారు కుక్కా, గాడిదా, ప్రస్తుతం నేనూ అంతే. తమరెవరు అందామె. ఈ ఇల్లు కోర్టు లిటిగేషన్‌లో ఉంది. నేను యజమానిని మాత్రం కాను. ఆధార్‌కార్డు ఇవ్వను. బ్యాంకులో డబ్బులేదు. చేయడానికి ఉద్యోగం లేదు. కోళ్లూ, ఆవులూ, గొర్రెలూ, బర్రెలూ లేవు అన్నాడు అబ్బాయి. అమ్మాయి మరో మాట అనకుండా అరుగు దిగిపోయింది.

కోళ్లూ, గొర్రెలూ అంటారు కాని కుక్కల గురించి అడగరేం? అంది డాగీ. శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్టు, ఒట్టు తీసి గట్టున పెట్టటానికి, జనాన్ని మభ్య పెట్టటానికి ఎన్నో చేస్తుంటారు ఏలుకునేవారు. మనుషుల్లోంచి మనుషుల కోసం మనుషుల ఓట్ల వల్ల కొందరు మహా మనుషులు పుట్టుకొస్తుంటారు, ఐదేళ్లకోసారి జరిగే ఎన్నికల్లో. ఏ కులాల వారు ఏమైపోయినా, సంచార కులాలు, సంప్రదాయ కులాలు మాయమైపోయినా ఎప్పటికీ ఉండే కులమే నాయకుల కులం అంది డాంకీ.

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఎర్రజెండా పార్టీకి లక్ష ఓట్లు !

డి.సోమ సుందర్

అమెరికాలో ఇటీవల ముగిసిన అధ్యక్ష ఎన్నికల్లో పార్టీ ఆఫ్ సోషలిజం అండ్ లిబరేషన్ (పీఎస్ఎల్) తరపున పోటీచేసిన అభ్యర్థిని క్లాడియా డిలా క్రూజ్‌కు ఒక లక్షా ఏడువేల ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల తుది ఫలితాలకు సంబంధించి వెల్లడైన గణాంకాలను పరిశీలించగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అలాగే అధ్యక్ష ఎన్నికల్లో భాగంగా వివిధ రాష్ట్రాల్లో జరిగిన "రిఫరెండం" లలో మహిళా హక్కులకు, కార్మికవర్గ హక్కులకు కొన్ని విజయాలు లభించాయి. పైకి కనిపించే ఫలితాలు ఎలా ఉన్నప్పటికీ అమెరికన్ సమాజంలో మారుతున్న సామాజిక సమీకరణాలకు వివిధ అంశాలపై నిర్వహించిన రిఫరెండం ఫలితాలు అద్దం పడుతున్నాయని ఎకనమిక్ పాలసీ ఇనిస్టిట్యూట్ ప్రకటించింది. ఆరిజోనా, జార్జియా రాష్ట్రాల్లో లెక్కింపు కేంద్రాలకు పోస్టల్ బ్యాలెట్లు చేరడానికి గడువు ఆరో తేదీ వరకూ ఉండటం, అవి లక్షల సంఖ్యలో ఉండటంతో ఓట్ల లెక్కింపులో జాప్యం జరిగింది.

పదో తేదీ నాటికి కూడా ఇంకా లెక్కింపు కొనసాగుతున్నా, తుది ఫలితాన్ని మార్చగలిగే స్థాయిలో పోస్టల్ బ్యాలెట్ల సంఖ్య లేదు. దాంతో ఆరెండు రాష్ట్రాల ఫలితాన్ని కూడా ప్రకటించారు. అక్కడి ఎలక్టోరల్ ఓట్లు కూడా డొనాల్డ్ ట్రంప్ ఖాతాలో పడ్డాయి. డోనాల్డ్ ట్రంప్ 312 ఎలక్టొరల్ ఓట్లు దక్కించుకుని 7 కోట్ల 48 లక్షల 32 వేల 689 పాపులర్ ఓట్లు పొందారు. డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ కు 226 ఎలక్టోరల్ ఓట్లు రాగా 7కోట్ల 12 లక్షల 38 వేల 770 పాపులర్ ఓట్లు పోలయ్యాయి. గ్రీన్ పార్టీ అభ్యర్థిని జిల్ స్టెయిన్ కు 7 లక్షల 5 వేల 470 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, ప్రచారం చివరిదశలో ట్రంప్‌కు మద్దతు ప్రకటించిన జాన్ ఎఫ్ కెన్నెడీ మనుమడు రాబర్ట్ కెన్నెడీ కి 6 లక్షల 81 వేల 122 ఓట్లు, లిబర్టేరియన్ పార్టీ అభ్యర్థి చేజ్ ఒలివర్ కు 6 లక్షల 11 వేల 177 ఓట్లు పోలయ్యాయి. మార్క్సిజం-లెనినిజం భావజాల ప్రాతిపదికపై అమెరికాలో పెట్టుబడిదారీ వర్గ వ్యవస్థను కూలద్రోసి సోషలిస్టు రాజ్యాన్ని ఏర్పాటు చేయడం, వర్ణ, జాతి, లింగ వివక్షలేని శ్రామికవర్గ సమాజాన్ని నిర్మించడం లక్ష్యంగా పార్టీ ఆఫ్ సోషలిజం అండ్ లిబరేషన్ పనిచేస్తున్నది. ఎర్రజెండా తరపున ఉపాధ్యక్ష స్థానానికి కరీనా గార్సియా పోటీ చేశారు. అమెరికాలో కమ్యూనిస్టు ఉద్యమంపై దశాబ్దాల తరబడి తీవ్ర వ్యతిరేక ప్రచారం ఉన్నసంగతి తెలిసిందే.

ఇంత సంక్లిష్టమైన ప్రతికూల ఎన్నికల విధానం, వ్యతిరేక వాతావరణం ఉన్న అమెరికాలో ఒక వామపక్ష అభ్యర్థి ఎన్నికల్లో పోటీ చేయడమే కష్టం. నిజానికి 1919లో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన నాటినుండి దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించింది. నల్లజాతి ప్రజల హక్కుల పోరాటంలో మొనగాడుగా నిలిచింది. రెండో ప్రపంచ యుద్ధం ముగిసేవరకూ ప్రధాన రాజకీయ పార్టీగా కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ యు.ఎస్.ఎ. ప్రజాభిమానం పొందింది. పార్టీ తరపున అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేసి మంచి ఓటింగు సాధించింది. అయితే ప్రచ్ఛన్న యుద్ధం రోజుల్లో అమెరికన్ కమ్యూనిస్టులను సోవియట్ కేజిబి ఏజెంట్లు అనిచెప్పి తీవ్ర నిర్బంధాన్ని అమలు జరిపారు. కోర్టు కేసుల్లో ఇరికించారు. జైళ్లలో పెట్టారు. సోవియట్‌కు అమెరికా రహస్యాలు అందచేస్తున్నారనే అభియోగాలు మోపారు. దాంతో కమ్యూనిస్టు ఉద్యమం చెల్లా చెదురు అయిపోయింది. 1970, 80 దశకాలలో పార్టీ ప్రధాన కార్యదర్శి గస్ హాల్ దేశ అధ్యక్ష స్థానానికి, పార్టీ నాయకురాలు ఏంజెలా డేవిస్ ఉపాధ్యక్ష స్థానానికి పోటీ చేసిన చరిత్ర ఉంది. అప్పట్లో పార్టీ కి 70 వేల వరకూ ఓట్లు పడ్డాయి. అయితే ప్రపంచ పరిణామాల పర్యవసానంగా అమెరికాలో కమ్యూనిస్టు పార్టీ పలు చీలికలకు గురయ్యింది. ఇప్పటికీ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ యు.ఎస్.ఎ. ఉన్నప్పటికీ అమెరికన్ తరహా సోషలిజం అనే భావనతో పనిచేస్తున్నది. ట్రాట్స్కీయిస్ట్ బృందాలు, లెఫ్ట్ రాడికల్ బృందాలు, సోషల్ డెమోక్రసీ బృందాలు, అనార్కిస్ట్ బృందాలు, రకరకాల పేర్లతో విడివిడి ఎర్రజెండా పార్టీలు పనిచేస్తున్నాయి. అయితే ఆ బృందాలు ఏవీ ఎన్నికల్లో పోటీ చేయలేదు. పార్టీ

ఆఫ్ సోషలిజం అండ్ లిబరేషన్ పార్టీ మాత్రమే పోటీకి ముందుకు వచ్చింది. ఎన్నికల నియమావళికి అనుగుణంగా పార్టీ అభ్యర్థిని క్లాడియా డిలా క్రూజ్ పంతొమ్మిది రాష్ట్రాలలో అధ్యక్ష బ్యాలెట్ లో స్థానాన్ని సాధించ గలిగారు. అయితే జార్జియా రాష్ట్రంలో ఆఖరు నిమిషంలో కోర్టు జోక్యంతో క్లాడియా పేరును బ్యాలెట్ పత్రం నుండి తొలగించారు. దాంతో 18 రాష్ట్రాల బ్యాలెట్ పత్రంలో మాత్రమే ఆమె పేరును ఉంచారు. అలాగే బ్యాలెట్ పేపరులో ఖాళీ స్థలంలో ఆమె పేరు రాయడానికి 26 రాష్ట్రాలలో అనుమతి ఇచ్చారు. అయితే ఆఖరు నిముషం వరకూ చిక్కులు కొనసాగుతూనే వచ్చాయి. ఇంత ప్రతికూల పరిస్థితుల్లో సైతం 18 రాష్ట్రాల్లో క్లాడియాకు ఒక లక్షా ఏడువేల ఓట్లు రావడం విశేషమే అని చెప్పాలి. కమ్యూనిస్టు అభ్యర్థి పోటీలో ఉన్న సమాచారాన్ని మీడియా అసలు ప్రస్తావించనేలేదు. పార్టీకి సొంత పత్రికలు, ఛానెళ్లు కూడా లేవు. సోషల్ మీడియా వేదికల ద్వారా, కార్యకర్తల ద్వారా చేసుకున్న ప్రచారమే వారికి ఆధారం అయ్యింది. లెక్కింపు పూర్తయ్యాక కూడా క్లాడియాకు వచ్చిన ఓట్లను అధికారులు ప్రకటించలేదు. మీడియా కూడా ఇక్కడ ప్రస్తావించలేదు. పద్దెనిమిది రాష్ట్రాల ఎన్నికల ఫలితాల గణాంకాలను ఆయా రాష్ట్రాలనుండి ఈ వ్యాసకర్త సేకరించుకోవాల్సి వచ్చింది.

అధ్యక్ష ఎన్నికల్లో గర్భస్రావపు హక్కుల గురించిన చర్చ పెద్ద ఎత్తున జరిగిన సంగతి తెలిసిందే. గర్భస్రావం చేయించుకోవడానికి స్త్రీలకు గల హక్కుకు సంబంధించిన ఫెడరల్ చట్టాన్ని రద్దుచేస్తూ అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. డొనాల్డ్ ట్రంప్ తన తొలి పాలనాకాలంలో నియమించిన ముగ్గురు సుప్రీంకోర్టు జడ్జీలు ఈ తీర్పు రావడానికి అసలు కారకులు. అప్పటినుండి రాష్ట్రాల రాజ్యాంగాల్లో ఈ హక్కును చేర్చాలన్న పెద్ద ఉద్యమం దేశంలో కొనసాగుతోంది. దీనికి డెమోక్రటిక్ పార్టీ మద్దతు ఇస్తోంది. రిపబ్లికన్ పార్టీకి లోపల ఇష్టం లేకపోయినా పైకి నామమాత్రపు సానుభూతి చూపుతోంది. ఈ నేపథ్యంలో అధ్యక్ష ఎన్నికల్లో భాగంగా గర్భస్రావపు హక్కును రాష్ట్రపు రాజ్యాంగంలో చేర్చాలా, వద్దా అనే ప్రశ్నను పదిరాష్ట్రాల బ్యాలెట్ పత్రంలో చేర్చారు. అరిజోనా, కొలరాడో, మేరీలాండ్, మిస్సోరి, మోంటానా, నెవాడా, న్యూయార్క్ రాష్ట్రాల్లో స్త్రీల హక్కులకు భారీస్థాయిలో ఓటర్లు మద్దతు పలికారు. ఇందులో డొనాల్డ్ ట్రంప్ గెలుపొందిన రాష్ట్రాలు కూడా ఉండటం గమనార్హం. సౌత్ దకోటా, నెబ్రాస్కా, ఫ్లోరిడా రాష్ట్రాల్లో స్త్రీ హక్కులకు వ్యతిరేక ఫలితం వచ్చింది. అయితే సుప్రీం తీర్పు తర్వాత ఇంతవరకూ 29 రాష్ట్రాలు స్త్రీల గర్భస్రావపు హక్కులకు రాజ్యాంగంలో చోటు కల్పించగా, తాజా ఎన్నికల్లో రిఫరెండం ద్వారా మరో ఏడు రాష్ట్రాలు అందుకు ఆమోదం తెలిపాయి. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షునిగా ఎన్నికైనప్పటికీ రాష్ట్రాల రాజ్యాంగాలను కాదనే అధికారం చట్టబద్ధంగా ఆయనకు ఉండదు. అధ్యక్ష ఎన్నికల సందర్భంలోనే మరికొన్ని రాష్ట్రాల్లో కార్మిక హక్కులకు సంబంధించిన అంశాలపై జరిగిన రిఫరెండంలో శ్రామిక ప్రజలు, కార్మికులు మంచి విజయాలు సాధించారు. ఫెడరల్ స్థాయిలో శ్రామికుల కనీస వేతనం గంటకు 7.25 డాలర్లు మాత్రమే ఉన్నది. 2009 వ సంవత్సరంలో నిర్ణయించిన ఈ కనీస వేతనాన్ని అప్పటినుంచి పెంచలేదు. కనీస వేతనాన్ని పెంచాలని కార్మిక సంఘాలు ఎప్పటి నుండో పోరాడుతున్నాయి. ఇప్పటికే 30 రాష్ట్రాల్లో, 63 స్థానిక సంస్థలలో కనీస వేతనాన్ని గంటకు 15 డాలర్లుగా నిర్ణయిస్తూ చట్టాన్ని చేశాయి. ఈ ఎన్నికల్లో అలాస్కా, మిస్సోరి రాష్ట్రాల్లో కనీస వేతనం గంటకు 15 డాలర్లు చేయాలన్న ప్రతిపాదనను బ్యాలెట్ లో చేర్చారు. రెండు రాష్ట్రాలలో కనీస వేతనం పెంపుదలకు ఆమోదం తెలుపుతూ ప్రజలు భారీగా ఓట్లువేశారు. కొలరాడోలో మునిసిపల్ కార్మికులు సంఘం పెట్టుకుని సమష్టి బేరసారాల ప్రక్రియలో పాల్గొనే హక్కును ప్రస్తుత ఎన్నికల్లో బ్యాలెట్ ద్వారా గెలుచు కున్నారు. 67 శాతం ఓటర్లు దీనికి అనుకూలంగా ఓటు వేశారు. దాంతో 7 వేల మంది మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికులు లబ్ధి పొందుతారు. న్యూ ఆర్లియన్స్ లో తాజా ఎన్నికల్లో వర్కర్స్ బిల్ ఆఫ్ రైట్స్ పై జరిగిన రిఫరెండంలో ఓటర్లు కార్మికులకు మద్దతు పలికారు. దీనివల్ల అసంఘటిత కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు, న్యాయబద్ధమైన వేతనాలు, సిక్ లీవు, ఆరోగ్య సంరక్షణ, వంటి ప్రయోజనాలు కలుగుతాయి. ఒరెగాన్‌లో గంజాయి సాగుచేసే క్షేత్రాల్లో పనిచేసే కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు ఇవ్వడానికి మద్దతుగా ప్రజలు ఓటు వేసారు. అలాస్కా, నెబ్రాస్కా రాష్ట్రాల్లో సిక్ లీవును వినియోగించుకోవడానికి గల పరిమితులను సడలించే చర్యకు ఓటర్లు మద్దతు పలికారు. అలాస్కా రాష్ట్రంలో ఒక విచిత్రమైన సమస్యపై రిఫరెండం తీసుకున్నారు. తమ సిబ్బందిని యూనియన్లలో చేరవద్దని హెచ్చరించడానికి యజమానులు బలవంతపు సమావేశాలు నిషేధించాలిన అలస్కాలో ఒక ఆనవాయితీ. ఈ బలవంతపు సమావేశాలు పెట్టడాన్ని నిషేధించాలన్న అంశాన్ని బ్యాలెట్‌లో చేర్చి రిఫరెండం తీసుకున్నారు. నిషేధించడానికి అనుకూలంగా 60 శాతం ఓటర్లు మద్దతు పలికారు. జైళ్లలో దీర్ఘకాలిక శిక్ష అనుభవిస్తున్న వారిని అర్ధ బానిసలుగా చూడటం నిర్బంధ వెట్టిచాకిరీ చేయించడం అమెరికాలో చిరకాలంగా కొనసాగుతున్న దురాగతం. అలాంటి వారికి కార్మిక చట్టాలు, మానవహక్కులు వర్తించకుండా కొన్ని చట్టాలు ఎప్పటి నుండో అమల్లో ఉన్నాయి. కాలిఫోర్నియా, నెవడా రాష్ట్రాల్లో మొన్నటి ఎన్నికల్లో ఈ సమస్యపై రిఫరెండం తీసుకున్నారు. ఖైదీలకు కార్మిక చట్టాలు వర్తించేందుకు వారికి ఓవర్ టైమ్ అలవెన్స్ చెల్లించేందుకు అనుకూలంగా ఓటర్లు ఓటు వేశారు.

కొలరాడో, కెంటకీ రాష్ట్రాల్లో స్కూల్ వోచర్లకు వ్యతిరేకంగా ప్రజలు ఓటు వేశారు. ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వ నిధులు ఇవ్వకుండా పిల్లల చదువుల నిమిత్తం తల్లి తండ్రులకు స్కూలు ఓచర్లు ఇచ్చే విధానం రాష్ట్రాల్లో అమల్లోఉంది. దీనివల్ల ప్రభుత్వ పాఠశాలలకు నిధులు అందవు. పాఠశాలలు నిర్వీర్యం కావడంతో పాటు ఓచర్లు తీసుకున్న తల్లి తండ్రులు ఆ సొమ్ముతో తమ పిల్లల్ని ప్రైవేటు స్కూళ్ళలో చేర్పిస్తున్నారు. ప్రభుత్వ సొమ్ము అంతిమంగా ప్రైవేటు పాఠశాలలకు లబ్ధి చేకూరుస్తున్నది. దీనిపై ఆ రెండు రాష్ట్రాల ఓటర్లు స్కూలు ఓచర్లను వ్యతిరేకిస్తూ ఓటుచేసారు. ఎన్నికల పోరాటంలో కార్మికవర్గం కూడా తనదైన కొన్ని విజయాలు సాధించిన విషయం చిన్నదేమీ కాదు. ఈ విజయాలు రానున్న రోజుల్లో అమెరికన్ సమాజంలో సామాజిక సమీకరణాలను మార్చడానికి ఉత్ప్రేరకంగా పనిచేస్తాయని ఆశించవచ్చు.

సీనియర్ పాత్రికేయుడు
సెల్: 9866074026

జార్ఖండ్‌లో ఇండియా బ్లాక్ ముందంజ

డాక్టర్ జ్ఞాన్ పాఠక్

జార్ఖండ్ రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిదశ పోలింగ్‌లో జెఎమ్ఎమ్ నాయకత్వంలోని ఇండియా ఐక్య సంఘటన ముందంజలో ఉందని అంచనాలు వచ్చాయి. మొత్తం 81 నియోజకవర్గాలకిగాను మొదటిదశలో నవంబరు 13న 43 నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి. ప్రధానంగా ఇండియా బ్లాకు, బీజేపీ మధ్యన ప్రధాన పోటీ జరగనున్నది. మూడవవంతు జార్ఖండ్, జార్ఖండేతరులు, ఆదివాసీలు ఇతరుల మధ్య అలాగే హిందువుల, ముస్లింల మధ్య ప్రధానంగా పోటీ జరిగే అవకాశం కనిపిస్తున్నది. ఈ వర్గాల మధ్యగల సమస్యలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపుతాయి. ప్రధాని నరేంద్ర మోదీ హోంమంత్రి అమిత్ షా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రధానంగా బంగ్లాదేశ్ ముస్లింలు జార్ఖండ్‌లోకి చొరబడుతున్నారని, గిరిజన ఓటర్లను ప్రభావితం చేసేందుకువీరు ప్రయత్నిస్తున్నారని అబద్ధాలను ప్రచారంచేస్తూ ఓటర్లను తమ వైపు మలచుకునేందుకు బీజేపీ నాయకులు ప్రయత్నిస్తున్నారు.

జెఎంఎం, కాంగ్రెస్ ప్రభుత్వం బంగ్లాదేశ్ ముస్లింల చొరబాటుకు ప్రోత్సహిస్తున్నారని బీజేపీ ఇష్టం వచ్చినట్లుగా అబద్ధాలను చెబుతోంది. అయినప్పటికీ గిరిజన ఓటర్లను ఈ ప్రచారం ప్రోత్సహించడంలేదు. జార్ఖండ్



సంస్కృతిని ఓటర్లు ఎక్కువగా పెంపొందిస్తున్నారు. ఒకవేళ ఎవరైనా బంగ్లాదేశ్ నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడినప్పటికీ వారు బీజేపీని ఎంపిక చేసుకోవచ్చునని అంటున్నారు. రాష్ట్రం వెలుపలనుంచి వచ్చినవారు గిరిజనులను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని కొంతమంది చెబుతున్నారు. జార్ఖండ్‌కు చెందిన ఓబీసీ మహతో జాతి ప్రజలు అత్యధికంగా ఇండియా బ్లాక్‌ను ఆకర్షిస్తున్నారని తెలుస్తోంది. గిరిజనులు సైతం గత ఎన్నికల్లోనూ జార్ఖండ్, కాంగ్రెస్‌లకు ఎక్కువగా ఓటు వేశారు. అందువల్లే బీజేపీ ఓటమిపాలైంది. రాష్ట్ర జనాభాలో మహతోలు 25శాతం ఉన్నారు. వీరు గతంలో ప్రధానంగా బీజేపీకి తోడ్పాటు ఇచ్చేవారు. ఇప్పటికీ ఎక్కువగా తమకే ఓటువేస్తారని బీజేపీ చెబుతోంది. మహతోలకు ఎస్టీ హోదా ఇచ్చినట్లయితే తమకు ప్రమాదం కలుగుతుందని గిరిజన జాతులు ఆందోళన చెందుతున్నాయి. వీరి దారిని మళ్లించేందుకు మోదీ ఇతర బీజేపీ నాయకులు ఓబీసీలు,ఎస్టీలకు రిజర్వేషన్లను లాగివేసి ముస్లింలకు కట్టబెట్టాలని చూస్తున్నట్లు తప్పుడు ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఈ అంశాన్ని గిరిజనులు కూడా గ్రహిసున్నారు. అయినప్పటికీ ఇండియా బ్లాక్ వెంట గిరిజనజాతులు బలంగా నిలబడిఉన్నారు. మహతోలు మాత్రం మూడు గ్రూపులుగా విడిపోయినట్లు అంచనా. మెజారిటీ గ్రూపు బీజేపీని బలపరుస్తున్నారని, ఇతర చిన్న గ్రూపులు జయరాం మహతో నాయకత్వంలో జెఎల్‌కెఎమ్ గ్రూపు, సంజయ్‌మెహతా నాయకత్వంలో జెబికెఎస్ఎస్ పనిచేస్తున్నాయి. అత్యధిక మహతోలు బీజేపీపై ఆగ్రహంతో ఉన్నారని చెపుతున్నారు. మాజీ కేంద్రమంత్రి, బీజేపీ నాయకుడు అర్జున్ ముండా ఎస్టీ హోదాను వ్యతిరేకిస్తున్నారు. బంగ్లాదేశ్ నుంచి జార్ఖండ్‌లో చొరబడుతున్నారని చెబుతున్న ముస్లింలపైన బీజేపీ నాయకులు ఆగ్రహం చెందుతున్నారు. ఇదే సమయంలో గిరిజనేతర, హిందుజాతులమధ్య బీజేపీ నాయకులు ముమ్మరంగా పనిచేస్తున్నారు. అలాగే ఓబీసీల మధ్య కూడా ప్రచారం ఉధృతంగా నిర్వహిస్తున్నారు. అనేక నియోజకవర్గాలలో మత విభజనను దృష్టిలో ఉంచుకుని ఓటర్లను ప్రభావితం చేసేందుకు బీజేపీ కార్యకర్తలు పనిచేస్తున్నారు. సదాన్ కమ్యూనిటీ ప్రజలు హిందువులతో సహా ఓబీసీలు తమకు ఉద్యోగాలలో తగినవాటా ఇవ్వాలని, తమను ఎక్కువగా పట్టించుకోవడంలేదని భావిస్తున్నారు.

కొదర్మ, బర్కథా, బర్హి,బర్క్‌గాన్ నియోజకవర్గాలలో బీజేపీ, ఇండిపెండెంట్లు, ఐఎన్‌సీ పార్టీలకు చెందినవారు, 2019 అసెంబ్లీ నియోజకవర్గాలలో గెలుపొందారు. బర్కథా సీటును ఇండిపెండెంటు గెలుచుకుని ప్రస్తుతం బీజేపీ అభ్యర్థిగా పోటీచేస్తున్నారు. ఇక్కడ జెఎమ్ఎమ్ అభ్యర్థికంటే అధిక ఓట్లు రావచ్చునని భావిస్తున్నారు. ఆర్‌జేడీ అభ్యర్థి కొదర్మలో బీజేపీకి గట్టిపోటీ ఇస్తున్నారు. బర్హి, బకగాన్ నియోజకవర్గాలలో ఐఎన్‌సీ పైచేయిగాఉన్నారు. ఈస్ట్ సంఘంలో జెఎమ్ఎమ్ బహర్‌గొరా, పొట్కా, జగ్‌సలయ్ నియోజకవర్గాలలో 2019లో జెఎమ్ఎమ్ గెలుపొంది ఇప్పుడు కూడా పైచేయిగాఉంది. జంషడ్‌పూర్ తూర్పు నియోజకవర్గంలో ఐఎన్‌పి జెడి(యు) పోటాపోటీగా ఉన్నాయి. వెస్ట్ సింఘం, ఛాయ్ బసా, మజగాన్ సీట్లలో 2019లో జెఎమ్ఎమ్ గెలుపొందింది. ఈ సారికూడా బీజేపీపై గెలిచే అవకాశాలు గట్టిగా ఉన్నాయి. జగన్నాథ్‌పూర్‌లో 2019లో ఐఎన్‌సి గెలుపొందింది. ఈ సారి ఐఎన్‌సీ, బీజేపీ అభ్యర్థుల మధ్య గట్టిపోటీ ఉండనుంది. 2019లో జెఎమ్ఎమ్ అభ్యర్థులు మనహర్‌పూర్, చక్రధర్‌పూర్‌ల గెలుపొందారు. ఈసారి ఏజెఎస్‌యూ బీజేపీపై ముందంజలో ఉంటారని అంచనాలు వేస్తున్నారు. సరయ్‌కెలా-ఖర్సావన్‌ల పట్ల సింగ్‌భమ్ ప్రాంతంలో ఆసక్తిగాఉన్నారు. గతంలో కొల్హన్ ఏరియాలో జెఎంఎం నాయకుడు చంపయ్ సొరేన్ ప్రస్తుతం పార్టీ మారిపోయారు. జార్ఖండ్‌లో జరగనున్న మొదటి దశ ఎన్నికల్లో ఇండియా బ్లాక్ వైపు సానుకూలంగా ఉన్నదని ఈ సారి కూడా ఇండియా బ్లాక్ గెలిచే అవకాశం ఉందని అంచనా వేశారు. నవంబరు 20న 38 సీట్లకు రెండవదశ పోలింగ్ జరుగనుంది.

16 మంది రెబల్స్‌పై కాంగ్రెస్ వేటు

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి భారీ సంఖ్యలో రెబల్ అభ్యర్థులు బరిలో నిలిచారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు వారిపై చర్యలు చేపట్టాయి. 16 మంది రెబల్ అభ్యర్థులను ఆరేళ్ల పాటు కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేసింది. సోనాల్ కోవ్, అభిలాషా గవతురే, ప్రేంసాగర్ గన్వీర్, అజయ్ లంజేవార్, విలాస్ పాటిల్, హన్స్‌కుమార్ పాండే, కమల్ వ్యావరే, మోహన్‌రావ్ దండేకర్, మంగళ్ భుజ్‌బల్, మనోజ్ సిండే, విజయ్ ఖడ్సే, షబీర్ ఖాన్, అవినాష్ లాడ్, యాజ్ఞవల్క్య జిచ్కర్, రాజేంద్ర ములక్, రాజేంద్ర ములక్, ఆనందరావును పార్టీ నుంచి బహిష్కరించారు. మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. కాగా, కాంగ్రెస్ రెబెల్ నేత ముఖ్తార్ షేక్, కస్బా పేత్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ ఉపసంహరించుకున్నారు. ఎంవీఏ కూటమి అభ్యర్థి రవీంద్ర ధంగేకర్‌కు ఆయన మద్దతు ఇచ్చారు. మరోవైపు బీజేపీ కూడా ఇదే తరహా చర్యలు చేపట్టింది. పార్టీకి విరుద్ధంగా వ్యవహరించి 37 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెబల్స్‌గా పోటీ చేస్తున్న వారిలో 40 మంది నేతలు, ఆఫీస్ బేరర్లను బహిష్కరించింది.

గిరిజన మహిళను పెళ్లి చేసుకుంటే భూ బదలాయింపు ఉండదు

అమిత్‌షా

రాంచి: జార్ఖండ్‌కు చెందిన గిరిజన మహిళను ఎవరైనా చొరబాటుదారులు పెళ్లి చేసుకుంటే, వాళ్లకు పట్టా భూములను ఇవ్వబోమని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. సోమవారం సెరైకేలాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఒకవేళ బీజేపీ అధికారంలోకి వస్తే, చొరబాటుదారులకు భూమి బదలాయింపును నిలిపివేసే చట్టాన్ని రూపొందించనున్నట్లు చెప్పారు. 'చొరబాటుదారులు మన ఆడపిల్లలను పెళ్లి చేసుకుని భూమిని లాక్కుంటున్నారు. గిరిజన మహిళలను పెళ్లి చేసుకుంటే అక్రమార్కులకు భూమిని బదలాయించకుండా చట్టం తీసుకువస్తాం. చొరబాటుదారులను గుర్తించి వారిని తరిమికొట్టేందుకు, కబ్జా చేసిన భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేస్తాం' అని తెలిపారు. బంగ్లాదేశీ చొరబాటుదారులకు జేఎంఎం, కాంగ్రెస్, ఆర్‌జేడీ మద్దతుగా నిలుస్తున్నాయని ఇటీవల ప్రధాని మోదీ కూడా తన ప్రసంగంలో ఆరోపించారు. అమిత్ షా మాట్లాడుతూ 'జేఎంఎం-కాంగ్రెస్ ప్రభుత్వం బుజ్జగింపును గరిష్ఠ స్థాయికి తీసుకువెళ్లింది. ఈ పార్టీలు రాష్ట్ర సామాజిక సామరస్యాన్ని నాశనం చేస్తున్నాయి. వారు చొరబాటుదారుల మద్దతుదారులు. బంగ్లాదేశ్ చొరబాటుదారుల ఓట్లను పొందడానికి వారు జార్ఖండ్ అంతటా వారిని స్థిరపరుస్తున్నారు' అని ఆయన అన్నారు. చంపై సోరెన్ అవమానపరచారని కూడా ఆరోపించారు. 'ఇది కేవలం చంపై సోరెన్‌ను అవమానించడమే కాదు గిరిజన ప్రజలను అవమానించడమే' అని ఆయన అన్నారు.

'దర్బార్ మూవ్' పునరుద్ధరించాలి

సీపీఎం

జమ్మూ: 'దర్బార్ మూవ్'ను పునరుద్ధరించాలని, జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఇందుకోసం సోమవారం జమ్మూకశ్మీర్ శీతాకాల రాజధాని జమ్మూలో నిరసన ప్రదర్శన నిర్వహించింది. దర్బార్ మూవ్ అనేది కశ్మీర్ వేసవి రాజధాని శ్రీనగర్ నుండి శీతాకాల రాజధాని జమ్మూకు రాష్ట్ర సచివాలయం మరియు ఇతర ప్రభుత్వ కార్యాలయాల ద్వైవార్షిక మార్పు. 1872లో మహారాజా రణబీర్ సింగ్ పాలనలో ప్రారంభమైన ఈ సంప్రదాయం 2020 వరకు కొనసాగింది. జేకే కిసాన్ తెహ్రీక్ అధ్యక్షుడు కిషోర్ కుమార్ నేతృత్వంలో పెద్ద ఎత్తున సీపీఎం కార్యకర్తలు 'దర్బార్ మూవ్' పునరుద్ధరించాలని, రాష్ట్ర ప్రజల భూమి, ఉద్యోగ హక్కుల కోసం కశ్మీర్ ప్రత్యేక హోదాను పునరుద్ధరించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. 'దర్బార్ మూవ్ బహాల్ కరో, రాష్ట్ర హోదా బహాల్ కరో' అంటూ నినదించారు. రాష్ట్ర స్థాయిని కేంద్ర పాలిత ప్రాంతం గా మార్చి తగ్గించినందుకు, దర్బార్ మూవ్‌ను నిలిపివేసినందుకు నిరసనకారులు బీజేపీని దుయ్యబట్టారు. వెంటనే దర్బార్ మూవ్, రాష్ట్ర హోదా, స్థానికులకు ప్రత్యేక భూమి మరియు ఉద్యోగ హక్కులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ప్రపంచ పర్యాటక కేంద్రంగా వయనాడ్

ప్రియాంక ప్రచారంలో రాహుల్ హామీ

వయనాడ్ (కేరళ) : కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ సోమవారం వయనాడ్ లోక్‌సభ స్థానానికి ఉపఎన్నికల ప్రచారం చివరి రోజున తన సోదరి ప్రియాంక గాంధీ వాద్రాతో కలిసి వయనాడ్‌ను ప్రపంచంలోని ప్రధాన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఉప ఎన్నికల్లో యూడీఎఫ్ అభ్యర్థిగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా పోటీ చేస్తున్నారు. ఇక్కడ సుల్తాన్ బతేరిలోని అసంప్షన్ జంక్షన్ నుంచి చుంగమ్ జంక్షన్ వరకు ప్రియాంకతో రోడ్ షో సందర్భంగా జరిగిన సభలో రాహుల్ మాట్లాడుతూ 'ఒక సవాలుగా వయనాడ్‌ను ప్రపంచంలోనే అత్యుత్తమ పర్యాటక కేంద్రంగా మార్చడానికి నేను ఆమెకు (ప్రియాంక గాంధీ) సహాయం చేస్తాను' అని చెప్పారు. రాజకీయాల్లో ప్రేమ అనే పదానికి గొప్ప స్థానం ఉందని వయనాడ్ ప్రజలు తనకు నేర్పారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత అన్నారు. 'నేను ఆ పదాన్ని ఉపయోగించలేదు. కానీ వయనాడ్ ప్రజలు ఈ పదానికి రాజకీయాల్లో గొప్ప స్థానం ఉందని నాకు నేర్పించారు' అని తెలిపారు. ద్వేషం, కోపాన్ని ఎదుర్కోవడానికి ప్రేమ, ఆప్యాయత మాత్రమే ఆయుధాలని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. ఇటీవలి పార్లమెంటు ఎన్నికల్లో రాయ్‌బరేలీలో విజయం సాధించడంతో రాహుల్ గాంధీ ఆ స్థానాన్ని ఖాళీ చేయడంతో నవంబరు 13న జరగాల్సిన వయనాడ్ ఉప ఎన్నిక అనివార్యమైంది.

మహాయుతి ప్రచారమంతా ద్వేషం... విషం: జైరాం రమేశ్

మహారాష్ట్రలోని బీజేపీ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వం తన ఎన్నికల ప్రచారంలో ఉద్దేశపూర్వకంగా 'ద్వేషం, విషం' నింపిందని, 'రాష్ట్రంలో మత సామరస్యానికి భంగం కలిగించడానికి' ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ సోమవారం విమర్శించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మాట్లాడుతూ ఈ ప్రచారం బీజేపీకి ఉన్న 'అనారోగ్య బుద్ధి'ని బయటపెట్టిందన్నారు. 'బీజేపీ నేతృత్వంలోని మహాయుతి తన ప్రచారంలో ఒకే ఒక అజెండా కలిగి ఉంది. ఇది కేవలం మతం ఆధారంగా సమాజాన్ని విభజించడం, రాష్ట్రంలో మత సామరస్యాన్ని భంగపరచడం మాత్రమే. ఇలాంటి భయంకరమైన ప్రచారం దాని అనారోగ్య మనస్తత్వాన్ని వెల్లడిస్తుంది' అని ఆయన ఒక 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ప్రచారం ద్వేషంతో నిండి ఉంది. ఉద్దేశపూర్వకంగా విషం చిమ్ముతోంది. కానీ మహారాష్ట్ర ప్రజలు నవంబరు 20న నిర్ణయాత్మకంగా ఈ రకమైన ప్రచారాన్ని తిరస్కరిస్తారు' అని కాంగ్రెస్ నాయకుడు పేర్కొన్నారు.

రైతులు, మహిళల తీవ్ర ఇబ్బందులు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, కార్మికుల్లో అభద్రతాభావం వంటి ప్రజలకు రోజువారీ ఆందోళన కలిగించే ప్రాథమిక సమస్యలపై కాంగ్రెస్ నేతృత్వంలోని మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) మహారాష్ట్రలో ప్రచారం చేస్తోందని జైరాం రమేశ్ చెప్పారు. యువతకు ఉద్యోగాలు లేకపోవడం, నీటి ఎద్దడి, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఓబీసీలకు తగిన సామాజిక న్యాయం అందకపోవడం, భారీ పెట్టుబడి ప్రాజెక్టుల్లో మహారాష్ట్రపై వివక్ష కూడా ఎంవీఏ కూటమి అజెండాలో ప్రధానాంశమని అన్నారు. రాష్ట్రంలో నవంబరు 20న ఎన్నికలు జరగనుండగా, 23వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు.

సమాజాన్ని విభజించే శక్తులను ఓడించండి

ప్రధాని మోదీ

అహ్మదాబాద్: ప్రతిపక్షాలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం సమాజాన్ని విభజించాలని ప్రయత్నిస్తున్నారని, వాటిని ఓడించాలని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి ఐక్యత ,సమగ్రత అవసరమని స్పష్టం చేశారు. గుజరాత్‌లోని వడ్తాల్‌లో ప్రఖ్యాత స్వామినారాయణ్ మందిర్ 200వ వార్షికోత్సవంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని పాల్గొని ప్రసంగించారు. వికసిత భారత్ ఆలోచనతో ప్రతి ఒక్కరూ మమేకం కావాలని, ఎవరెవరు ఎక్కడున్నా వికసిత్ భారత్ కోసం తమ వంతు భాగస్వామ్యం అందించాలని పిలుపునిచ్చారు. కలల సాకారానికి యువతను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మోదీ అన్నారు. "నేను, మీరు, మనమంతా వికసిత్ భారత్ కోసం ప్రజలను ప్రోత్సహించాలి. ముఖ్యంగా యువత ఆలోచనను ప్రోత్సహించి వికసత్ భారత్ కలలను సాకారం చేయాలి. అభివృద్ధి భారతం కలల సాకారంలో తొలుత దేశం స్వయం సమృద్ధి సాధించాలి. ఇందుకోసం బయట నుంచి ఎవరో సాయం రారు, మనమే దీన్ని స్వయంగా సాధించాలి. 'వోకల్ ఫర్ లోకల్' ప్రమోషన్‌తో ముందుకెళ్లాలి. కలిసికట్టుగా మనం ఉంటేనే ఇది సాధ్యం. కొందరు వ్యక్తిగత ప్రయోజనాల కోసం కులం, లింగ వివక్ష పేరుతో దేశాన్ని విడదీయాలనుకుంటున్నారు. ఇది దురదృష్టకరం. ఇలాంటి శక్తులను ఓడించాలి" అని ప్రధాని దిశానిర్దేశం చేశారు. యువత ఆలోచనలకు పదునుపెట్టడం ద్వారా మాత్రమే ఏ దేశమైన అభివృద్ధి పథంలోకి వెళ్తుందని లార్డ్ స్వామినారాయణ్ బోధించేవారని, అందుకోసం యువతను విద్యావంతులను చేయడం, నిపుణులైన యువత అనివార్యమని చెప్పారు. కులం, మతం, భాష, లింగం ప్రాతిపదికన సమాజాన్ని విభజించేందుకు ప్రతిపక్షాలు కుట్ర పన్నుతున్నాయని మోదీ ఆరోపించారు. కులగణన ను నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న ప్రతిపక్షాలను విమర్శిస్తూ తమ స్వార్థ ప్రయోజనాల కోసం సమాజాన్ని విభజించాలని చూసే వారి ఆలోచనలను ప్రజలు గుర్తించి, తగిన బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. దేశ వ్యతిరేకులు పన్నే కుట్రలను దేశ ప్రజలంతా కలసికట్టుగా ఎదుర్కోవాలని మోదీ పిలుపునిచ్చారు.

షెడ్యూల్డ్ కులాలు, తెగలు, ఇతర వెనకబడిన తరగతులు అభివృద్ధి చెందడాన్ని కాంగ్రెస్ జీర్ణించుకోలేకపో తుందని ఆరోపించారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ రిజర్వేషన్లను వ్యతిరేకించారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ నేతలు ఓబీసీలలోని కులాలను విభజించడానికి చూస్తున్నారని మండిపడ్డారు.

మహాయుతి ప్రభుత్వం అవినీతిమయం: సుప్రియా సూలె

ముంబై: మహారాష్ట్రలో మహాయుతి ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ-ఎస్‌పీ) వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియాసూలే విమర్శించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం పూణెలో మీడియాతో ఆమె మాట్లాడారు. బీజేపీ, దాని మిత్రపక్షాలు మహారాష్ట్ర ప్రముఖులను అవమానిస్తున్నాయని, వక్రీకరించిన చరిత్రను ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. గత ఎన్నికల్లో అవినీతి వంటి అంశాలను లేవనెత్తాయని, కానీ ప్రస్తుత మహాయుతి ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని అన్నారు. దీంతో ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా మాట్లాడేందుకు బీజేపీ, దాని మిత్రపక్షాలు భయపడుతున్నాయని అన్నారు. పాలక కూటమి పథకాలను ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి కాపీ కొట్టిందన్న మహాయుతి ఆరోపణలను కొట్టిపారేశారు. కాంగ్రెస్, ఎన్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో రైతులకు అతిపెద్ద రుణమాఫీ ప్రకటించాయని, వ్యవసాయ ఉత్పత్తులకు ధర గ్యారెంటీ ఇచ్చాయని అన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్, సాహూ మహారాజ్, మహాత్మా పూలె, డా.అంబేద్కర్ వంటి లెజెండ్స్‌ను అవమానిస్తున్నారని, చరిత్రను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కొల్హాపూర్‌లో కొందరు బీజేపీ ఎంపీలు మహిళలను బెదిరిస్తున్నారని దుయ్యబట్టారు. వారిపై ప్రతిపక్షాలు కోర్టుకు వెళ్తాయని, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు.

కాషాయమంటే కాంగ్రెస్‌కు పడదు: ఫడ్నవిస్

నాగపూర్: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలకు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ స్పందించారు. కాంగ్రెస్‌కు కానీ, ఆ పార్టీ అధ్యక్షుడికి కానీ కాషాయం రంగు అంటే గిట్టదన్నారు. శతాధిక వత్సరాల ఆ పార్టీ దేవుడికి కూడా వ్యతిరేకమని చెప్పారు. మల్లికార్జున ఖర్గే ఆదివారం జరిగిన 'సంవిధాన్ బచావో సమ్మేళన్'లో యోగి ఆదిత్యనాథ్ పేరును నేరుగా ప్రస్తావించకుండా, సాధువులమని చెప్పుకునే చాలామంది ఇప్పుడు రాజకీయనాయకులుగా మారుతున్నారని, ముఖ్యమంత్రులు కూడా అవుతున్నారని అన్నారు. గోరఖ్‌నాథ్ మఠానికి ప్రధాన అర్చకుడిగా యోగి ఆదిత్యనాథ్ ఉన్నారు. ఖర్గే వ్యాఖ్యలపై నాగపూర్ సౌత్ వెస్ట్‌లో రోడ్‌షో సందర్భంగా ఫడ్నవిస్ స్పందిస్తూ... కాంగ్రెస్ పార్టీకి కాషాయం అంటేనే నచ్చదని, అయితే ఇది సఫ్రాన్ సనాతన్, సఫ్రాన్ ఇండియా, సఫ్రాన్ హిందుత్వ అని, దీనిని ఎవరూ ఆపలేరని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో చాలా దయనీయంగా ఉందని, ఆ పార్టీని ఎవరూ నమ్మరని చెప్పారు. గతంలోనూ కాంగ్రెస్ వాగ్దానాలు చేయడమే కానీ అమలులో మాత్రం విఫలమైందన్నారు. నాగపూర్ సౌత్ వెస్ట్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజలు తనను ఆరోసారి గెలిచిపేందుకు సిద్ధంగా ఉన్నారని, తాను, తన కుటుంబం చేసిన పనులను వారెవరూ మరిచిపోలేదని చెప్పారు. అదేసమయంలో ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీపై ఫడ్నవిస్ విమర్శలు గుప్పించారు. తల్లీచెల్లెళ్ల గౌరవాన్ని లూటీ చేసిన రజాకార్ల వారసత్వాన్ని ఒవైసీ కొనసాగిస్తున్నారని అన్నారు. ఆయన నుంచి తాము నేర్చుకునేది లేదని, ఆయనకున్న జ్ఞానం అంతంతమాత్రమేనని అన్నారు. దేశంలోని 52 శాతం పెట్టుబడులు మహారాష్ట్రలో ఉన్నాయని, హైదరాబాద్‌లో కాదని గుర్తుచేశారు. ఆర్థిక వాస్తవాలను ఒవైసీ గుర్తెరగాలని హితవు పలికారు.

ఆరోపణలు నిరూపిస్తే... రాజకీయాలకు స్వస్తి

మోదీకి సిద్ధరామయ్య సవాల్

హావేరీ: కర్నాటక ఎక్సైజ్ శాఖలో రూ. 700 కోట్ల కుంభకోణం జరిగినట్టు ఆరోపించిన ప్రధాని నరేంద్రమోదీ... ఆ ఆరోపణలను నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సవాల్ విసిరారు. నిరూపించలేకపోతే మోదీ రాజకీయాల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. రెండ్రోజుల క్రితం మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో మోదీ మాట్లాడుతూ కర్ణాటక ఎక్సైజ్ శాఖలో భారీ కుంభకోణం జరిగిందని, ఆ సొమ్మును మహారాష్ట్ర, జార్ఖండ్‌లో ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ వాడుకుంటోందని ఆరోపించారు. కర్నాటక వైన్ మర్చంట్స్ అసోసియేషన్ ఇటీవల ఎక్సైజ్ విభాగంపై తీవ్ర ఆరోపణలు చేసింది. మరీ ముఖ్యంగా మంత్రి తిమ్మాపూర్‌ను లక్ష్యంగా చేసుకుంది. లైసెన్సులు మంజూరు చేసేందుకు, ట్రాన్స్‌ఫర్ల కోసం రూ. 30 లక్షల నుంచి రూ. 70 లక్షలు వసూలు చేస్తున్నట్టు ఆరోపించింది. గత ఏడాది కాలంలో ఇలా 1000 లైసెన్సులను అక్రమంగా కేటాయించారని, ఫలితంగా రూ. 300-700 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించింది.

మోదీ ఆరోపణలను ఖండించిన సీఎం సిద్ధరామయ్య నిధుల దుర్వినియోగం జరగలేదని స్పష్టం చేశారు. దేశానికి ప్రధాని అయి ఉండీ మోదీ ఇన్ని అబద్ధాలు ఆడతారని అనుకోలేదని, ఆయన ఆరోపణలు తనను ఆశ్చర్యానికి గురిచేశాయని పేర్కొన్నారు. మోదీ తన ఆరోపణలను నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి వైదొలగుతానని, లేదంటే ఆయన రాజకీయాలకు రిటైర్మెంట్ ప్రకటించాలని సవాలు విసిరారు. ప్రధాని చేసే ఆరోపణలు వాస్తవానికి కాస్తయినా దగ్గరగా ఉండాలని, కానీ మోదీ ఆరోపణలు వాస్తవానికి చాలా దూరంగా ఉన్నాయని పేర్కొన్నారు. స్వతంత్ర భారతదేశంలో ఇంతగా అబద్ధాలు చెప్పే వ్యక్తిని ఇప్పటి వరకు చూడలేదని సిద్ధరామయ్య ఎద్దేవా చేశారు.

మోదీతో పనిచేయడం సంతోషం

ఆయన మా డిమాండింగ్ బాస్: జైశంకర్

ముంబై: ప్రధాని నరేంద్రమోదీ తమ 'డిమాండింగ్ బాస్' అని విదేశాంగమంత్రి జైశంకర్ చెప్పారు. ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రధానితో జరిగే సమావేశాలు ఏవిధంగా ఉంటాయో వివరించారు. 'నిత్యం ప్రధానితో మంత్రులకు సమావేశాలు జరుగుతుంటాయి. ఆయనతో సమావేశం అంటే చర్చించే విషయంపై కచ్చితమైన డేటాతో రావాల్సిందే. ఎందుకంటే, ఆ విషయంపై ఆయనకు పూర్తి అవగాహన ఉంటుంది. ప్రతి అంశంపై క్షుణ్ణంగా చర్చిస్తారు. ఆయన నిజాయతీ గల వ్యక్తి. ప్రధాని మా డిమాండింగ్ బాస్. నిజంగా ఆయనతో కలిసి పనిచేయడం నాకు ఎంతో ఆనందంగా ఉంటుంది' అని జైశంకర్ పేర్కొన్నారు. 'ఉక్రెయిన్- రష్యా యుద్ధం వేళ భారతీయ విద్యార్థులను రక్షించేందుకు ఎంతో కృషి చేశారు. అక్కడ ఉన్నవారికి ఎలాంటి హాని కలగకుండా స్వదేశానికి తీసుకురావాలని మమ్మల్ని ఆదేశించారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది దేశాధినేతలతో భారత్ సత్సంబంధాలు ఏర్పరుచుకుంది. ట్రంప్ సహా ఒబామా, జోబైడెన్ హయాంలో అమెరికాతో స్నేహబంధం కొనసాగుతోంది. ఎంతమంది నేతలు మారినా ఆ దేశంతో బంధం స్థిరంగా ఉంది. అందుకు మోదీనే కారణం' అని జైశంకర్ అన్నారు. మరోవైపు.. ముంబైలో నిర్వహించిన ఇండియా-రష్యా బిజినెస్ ఫోరంలో పాల్గొన్న విదేశాంగ మంత్రి ప్రసంగిస్తూ భారత్- రష్యా పరిష్కరించుకోవాల్సిన సమస్యలు చాలా ఉన్నాయన్నారు. ప్రతిపాదిత ఇండియా-యురేషియన్ ఎకనామిక్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందంపై చర్చలను వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. బ్యాంకింగ్, పేమెంట్, రవాణా సవాళ్లు, బీమా, మార్కెట్ ప్రవేశాలు తదితర సమస్యలకు పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం 66 బిలియన్ డాలర్లుగా ఉన్న ద్వైపాక్షిక వాణిజ్యం... 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల లక్ష్యానికి చేరుకోవాలన్నారు.

అందుకు రెండు దేశాల మధ్య సమస్యలను త్వరగా పరిష్కరించుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో రష్యా ఫస్ట్ డిప్యూటీ ప్రైమ్ మినిస్టర్ డెనిస్ మంటురోవ్ కూడా పాల్గొన్నారు.

తమ్ముడి కోసం అన్న ప్రచారం

ముంబై: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో మహారాష్ట్రలో రాజకీయాలు వేడెక్కాయి. ఇందులో భాగంగా లాతూర్ నుంచి ఎన్నికల బరిలో దిగుతున్న తన సోదరుడు, కాంగ్రెస్ అభ్యర్థి ధీరజ్ దేశ్‌ముఖ్ తరపున బాలీవుడ్ నటుడు రితేశ్ దేశ్‌ముఖ్ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. కొంతమంది తమ మతం ప్రమాదంలో ఉందని చెబుతున్నారని, కానీ అక్కడ ప్రమాదంలో ఉన్నది వారి పార్టీనే అని రితేశ్ పేర్కొన్నారు. అందుకే దానిని రక్షించమని వారు ప్రజలను కోరుతున్నారని, అటువంటి వారికి అభివృద్ధి గురించి మాట్లాడాలని ప్రజలు తెలియజేయాలని సూచించారు. మన పని మనం చేసి, ఫలితాన్ని వదిలేయాలని భగవంతుడు చెప్పాడని, చిత్తశుద్ధితో పని చేయని వారు మాత్రమే మతం గురించి మాట్లాడతారని ఆయన విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో యువతకు ఉద్యోగ అవకాశాలు లేవని, వారికి ఉపాధి కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉందని వ్యాఖ్యానించారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో తన సోదరుడు ధీరజ్ 1.21 లక్షల ఓట్ల తేడాతో గెలుపొందారని, ఈ ఎన్నికల్లోనూ ప్రజలు ఆయనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. యువత పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత విలాస్‌రావ్ దేశ్‌ముఖ్ తనయుడే రితేశ్ దేశ్‌ముఖ్. విలాస్‌రావ్ మరో కుమారుడు ధీరజ్ దేశ్‌ముఖ్ కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేశారు.

ఉద్ధవ్ బ్యాగులు తనిఖీ చేసిన ఈసీ

ఇది ప్రజాస్వామ్యం కాదు: ఠాక్రే మండిపాటు

యవత్మాల్: మహారాష్ట్రలోని యవత్మాల్‌లోని హెలిప్యాడ్‌లో దిగిన శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే బ్యాగులను ఎన్నికల సంఘం (ఈసీ) అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ఈ ఘటనతో కలత చెందిన ఠాక్రే... ప్రధాని మోదీ, అమిత్ షా, దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ పవార్, ఏక్‌నాథ్ షిండే బ్యాగులను కూడా తనిఖీ చేస్తున్న వీడియోను పంపాలని ఈసీ అధికారులను డిమాండ్ చేశారు. వనీలోని హెలిప్యాడ్ వద్ద ఈసీ అధికారులు తన బ్యాగులను తనిఖీ చేస్తున్న సంఘటనను ఠాక్రే వీడియో తీశారు. ఈ సందర్భంగా యూరిన్ పాట్‌ని, హెలికాప్టర్‌లోని ఫ్యూయల్ ట్యాంక్‌ని కూడా చెక్ చేయమని కూడా వారిని వ్యంగ్యంగా అడిగారు. 'నా బ్యాగులు చూసే ముందు మీరు ఏ రాజకీయ నేతల బ్యాగులను తనిఖీ చేశారు? మీరు ఏక్‌నాథ్ షిండే, ఫడ్నవీస్, అజిత్ పవార్, నరేంద్ర మోదీ, అమిత్ షా బ్యాగ్‌లను తనిఖీ చేశారా? మీరు మోదీ బ్యాగ్‌లను తనిఖీ చేస్తున్న వీడియోను నేను చూడాలి. నేను దీన్ని వీడియో చేస్తున్నాను' అని ఠాక్రే ఈసీ అధికారులకు చెప్పడం కనిపించింది. యవత్మాల్‌లోని వనీలో జరిగిన బహిరంగ సభలో థాకరే ఈ అనుభవాన్ని పంచుకున్నారు. తాను హెలికాప్టర్‌లో వనీకి వచ్చినప్పుడు ఠాక్రే బ్యాగ్‌ను అనేక మంది ప్రభుత్వ అధికారులు తనిఖీ చేశారని శివసేన (యూబీటీ) అధ్యక్షుడు చెప్పారు. తమ పార్టీ కార్యకర్తలను, ఓటర్లను తనిఖీ చేసే అధికారుల జేబులు, గుర్తింపు కార్డులను కూడా తనిఖీ చేయాలని ఆయన కోరారు. 'నాకు వ్యవస్థపై కోపం లేదు. వారు వారి పని చేస్తున్నారు. నేను నా పని చేస్తున్నాను. కానీ వారు ప్రధాని మోదీ, అమిత్ షా బ్యాగ్‌లను తనిఖీ చేసారా లేదా అని నేను అడగాలనుకుంటున్నాను. ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్, దేవేంద్ర ఫడ్నవీస్ బ్యాగులను తనిఖీ చేయాలా వద్దా? అని ఆయన ప్రశ్నించారు. 'ఈ పనికిరాని పనులన్నీ జరుగుతున్నాయి. నేను దీనిని ప్రజాస్వామ్యంగా పరిగణించను. ఇది ప్రజాస్వామ్యం కాదు. ప్రజాస్వామ్యంలో ఎవరూ పెద్దవారు కాదు, చిన్నవారు కాదు' అని ఠాక్రే అన్నారు. ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు తమ బ్యాగులను (అధికార పార్టీల సీనియర్ నాయకులు) తనిఖీ చేసే హక్కు ఓటర్లకు ఉన్నందున పోలీసులు, ఎన్నికల సంఘం జోక్యం చేసుకోకూడదని ఆయన అన్నారు.

బస్సు మార్షల్స్ శాశ్వత నియామకం

ఎల్జీని కోరిన ఢిల్లీ ప్రభుత్వం

న్యూఢిల్లీ: పది వేల మంది బస్ మార్షల్స్‌ను శాశ్వత ప్రాతిపదికన కొనసాగించే విధానాన్ని రూపొందించేందుకు తమ ప్రభుత్వం లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాకు ప్రతిపాదన పంపుతున్నట్లు ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశి సోమవారం తెలిపారు. ఇక్కడ ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బస్ మార్షల్స్‌ను తొలగించడం వల్ల ప్రజా రవాణా బస్సుల్లో మహిళలపై నేరాలు పెరుగుతున్నాయని అన్నారు. ఆదివారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో బస్ మార్షల్స్‌ను పునరుద్ధరించే నిర్ణయాలను లెఫ్టినెంట్ గవర్నర్ అధికార పరిధిలోకి వస్తాయని రవాణా కమిషనర్ సూచించారని, ఇది సేవా సంబంధిత అంశం అని ముఖ్యమంత్రి చెప్పారు. ఢిల్లీ ప్రభుత్వం తన పౌరుల భద్రతకు కట్టుబడి ఉందని, మార్షల్స్ జీతాల కోసం అవసరమైన ఆర్థిక వనరులను అందిస్తుందని చెప్పారు. ఈ విషయానికి శాశ్వత పరిష్కారాన్ని తీసుకురావడానికి లెఫ్టినెంట్ గవర్నర్‌కు 'నెలలు లేదా సంవత్సరాలు పట్టవచ్చు' అని ఆమె భయాన్ని కూడా వ్యక్తం చేసింది. విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఢిల్లీ ఆరోగ్య, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సౌరభ్ భరద్వాజ్... ఈ విషయంలో ఎల్‌జీ వ్యవహరిస్తున్న తీరును విమర్శించారు. ఈ విషయాన్ని అత్యవసరంగా పరిష్కరించాలని నొక్కి చెప్పారు. ఎల్‌జీ నియమించిన రవాణా అధికారి సమస్యను 'రిజర్వు' అంశంగా వర్గీకరించారని, తక్షణ చర్య తీసుకునే రాష్ట్ర సామర్థ్యాన్ని పరిమితం చేశారని ఆయన పేర్కొన్నారు. 'ఎల్‌జీ ట్రాక్ రికార్డ్ దృష్ట్యా శాశ్వత పాలసీ రూపకల్పనలో గణనీయమైన జాప్యాన్ని మేము అంచనా చేస్తున్నాం. అందుకే మార్షల్స్‌ను పునరుద్ధరించడానికి మేము మధ్యంతర పరిష్కారం కోసం ముందుకు వస్తున్నాం' అని భరద్వాజ్ చెప్పారు. డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ డిఫెన్స్ నుంచి వచ్చిన అభ్యంతరం కారణంగా బస్ మార్షల్స్‌గా నియమించబడిన 10 వేల మంది పౌర రక్షణ వలంటీర్లను తొలగించడం జరిగింది. వాలంటీర్లు వాస్తవానికి ప్రజా రవాణా భద్రత కోసం కాకుండా విపత్తు నిర్వహణ విధుల కోసం నియమితులయ్యారని డైరక్టరేట్ వాదించింది.

రామమందిరంపై దాడిచేస్తాం

ఖాలిస్థానీ ఉగ్రవాది పన్నూన్ బెదిరింపు

అయోధ్య: సిక్కు వేర్పాటువాద నాయకుడు, ఖాలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూన్ మరోసారి తీవ్ర బెదిరింపులకు పాల్పడ్డాడు. అయోధ్యలోని రామ మందిరం సహా హిందూ ఆలయాలను లక్ష్యంగా చేసుకొని హెచ్చరికలు జారీ చేశాడు. నవంబర్ 16, 17 తేదీల్లో ఆలయాలపై దాడి చేస్తామంటూ హెచ్చరించాడు. ఈ మేరకు ఓ వీడియో విడుదల చేశాడు. 'హింసాత్మక హిందుత్వ భావజాలానికి పుట్టినిల్లు అయిన అయోధ్య పునాదులు పెకిలిస్తాం' అని హెచ్చరించాడు. ఈ వీడియోలో రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా అక్కడ ప్రధాని మోదీ ప్రార్థనలు చేస్తున్న దృశ్యాలను ప్రదర్శించారు. మరోవైపు హిందూ దేవాలయాలపై ఖాలిస్థాన్ దాడులకు దూరంగా ఉండాలని కెనడాలోని భారతీయులను సైతం పన్నూన్ హెచ్చరించాడు. కాగా, పన్నూన్ బెదిరింపులకు పాల్పడటం ఇదేమీ మొదటిసారి కాదు. గతంలోనూ అనేకసార్లు ఇలాంటి హెచ్చరికలే చేశాడు. నవంబర్ 1వ తేదీ నుంచి 19వ తేదీ వరకూ ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణించొద్దని గత నెలలోనూ బెదిరించాడు. భారత్‌లో సిక్కు వ్యతిరేక అల్లర్లు జరిగి 40 ఏళ్లు కావొస్తున్న సందర్భంగా ఎయిర్ ఇండియా విమానాలపై దాడి జరిగే అవకాశం ఉందని పేర్కొన్నాడు. గతేడాది నవంబర్ నెలలో ఇలాంటి బెదిరింపులే చేశాడు.

విశాలాంధ్ర హైదరాబాద్

దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

విశాలాంధ్ర- హైదరాబాద్ : ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కదిరవన్ పలని తో కలసి పాల్గొని ప్రజలనుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి లో వివిధ సమస్యలపై చేసుకున్న దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పక్కాగా జరగాలని అదిశగా ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలనీ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు పలు సమస్యలపై 184 దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో 184 దరఖాస్తులు రాగా గృహ నిర్మాణ శాఖ కు 133, పెన్షన్లు15, జిల్లా ఉపాధి కల్పనాధికారి10, డిఇఓ 8, రెవెన్యూ 9, ఇతరులు 9 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వెంకటచారి, ఆర్డిఓలు రామకృష్ణ, సాయిరామ్, అధికారులు జి ఆశన్న, పవన్ కుమార్, డాక్టర్ సురేందర్,ఇలియాజ్ అహ్మద్, ఒడ్డెన్న, ఆర్. రోహిణి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర, మల్కాజిగిరి : మౌలాలి డివిజన్ పరిధిలోని ఆండాళ్ నగర్ లో రూ.20 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు, మహాత్మా గాంధీ నగర్ స్మశాన వాటికలో రూ.17 లక్షలతో ఏర్పాటు చేసిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి చేయడం కోసం అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలని, అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేస్తే ప్రజలు ఇబ్బంది పడుతారని, ప్రజలను ఇబ్బంది పెట్టిన వారెవరూ నాయకుడని అనిపించుకోరని అన్నారు. అదే విధంగా కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని, ప్రజల సొమ్ము వృధాగా పోకుండా అధికారులు పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మౌలాలి కార్పొరేటర్ సునీత యాదవ్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, వెంకన్న, రాము యాదవ్, భాగ్యనంద్ రావు, ఉస్మాన్, సంతోష్ నాయుడు, సాదిక్, వంశీ ముదిరాజ్, సందీప్ పల్లవు, ఆది నారాయణ, జోగు శ్రీనివాస్ తదితరలు పాల్గొన్నారు.

సురేష్ మృతికి నివాళి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : సహ ఉద్యోగి సురేష్‌కు శ్రద్ధాంజలి ఘటించిన మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టరేట్ స్టాఫ్, అదనపు కలెక్టర్ రెవెన్యూ విజయేందర్ రెడ్డి మంగళవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ మీటింగ్‌హాల్ లో మత్స్యశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సురేష్ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. ఆయనకి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఏఓ రామ్‌మోహన్ మాట్లాడుతూ సురేష్ చాల మంచి వ్యక్తి అని తమ వృత్తి పట్ల మంచి పేరు సంపాదించుకున్నాడన్నారు. మన అందరం కూడా తమ తమ వ్యక్తిగత ఇబ్బందులు ఎన్ని ఉన్న ఉద్యోగంలో ఒత్తిడి ఉన్న ఎవరికీ వారు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఎప్పటికప్పుడు హెల్త్ చెకప్ చేపించుకొని జాగ్రత్తగా ఉండాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఎం సివిల్ సప్లైఎస్ ఎల్ సుగుణ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

మార్టిన్స్ స్కూల్‌లో వార్షిక స్పోర్ట్స్ మీట్

విశాలాంధ్ర, మల్కాజిగిరి : గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని మధుసూదన్ నగర్‌లో St మార్టిన్స్ స్కూల్‌లో వార్షిక స్పోర్ట్స్ మీట్ సందర్భంగా ముఖ్యఅతిథిగా గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతా రాము యాదవ్, మర్రి లక్ష్మణ్ రెడ్డి , చంద్రశేఖర్ యాదవ్, జై కిషన్ యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో St మార్టిన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ సుధ హరికృష్ణన్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలు ఇవ్వాలి

విశాలాంధ్ర కాప్రా : దివ్యాంగులకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా రూ.6 వేలు ఇవ్వాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం కాప్రా పట్టణ వికలాంగుల సమాఖ్య ఆధ్వర్యంలో కాప్రా మునిసిపల్ కార్యాలయం నుంచి ఈసీఐఎల్ చౌరస్తా వరకు జరిగిన ర్యాలీ లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని వారికి మద్దతు తెలిపారు.వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని అలాగే మెట్రో ల్లో వికలాంగుల పాసులు అనుమతించాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, హౌసింగ్ బోర్డు మిర్పెట్ కార్పొరేటర్ ప్రభుదాస్, వికలంగుల సమాఖ్య ప్రతినిధులు బాబు, జానీ ,కుంటి అంజి, లక్ష్మి, చంద్ర శేఖర్, పాండు నాయక్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి బీఆర్ఎస్ బీటీం: మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజా ప్రభుత్వంపై కావాలనే బీఆర్ఎస్ బీజేపీకి బీ టీంగా పనిచేస్తూ తపుడు ప్రచారం చేస్తుందని మంత్రి సీతక్క మండిపడ్డారు. సోమవారం ఆమె సచివాలయంలో మాట్లాడుతూ మహారాష్ట్రలో బీజేపీకి లబ్ధి చేకూర్చేందుకు బీఆర్ఎస్ కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కేసులు నుంచి తప్పించుకునేందుకు బీజేపీతో బీఆర్ఎస్ అంటకాగుతోందని, అందుకే మహారాష్ట్ర ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నాటి నుంచి పక్కా ప్రణాళికతో కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ విష ప్రచారం చేస్తుందని విమర్శించారు. అందులో బాగంగా మహిళల ఉచిత ప్రయాణ పథకంపై దుష్ప్రచారం చేస్తున్నారని, అత్యవసర సమయాల్లో చేతిలో చిల్లి గవ్వ లేకున్నా మహిళలు ఉచిత ప్రయాణాలు చేస్తున్నారని తెలిపారు. ఆటో డ్రైవర్లను ఉసి గొల్పి ధర్నాలు చేయిస్తున్నారని కానీ ఇదే బీఆరెస్ హయాంలో ఓలా, ఉబర్ క్యాబ్లు, బైక్లు తెచ్చినప్పుడు ఆటో డ్రైవర్లు గుర్తుకు రాలేదా అంటూ నిలదీశారు. కోట్లాదిమంది మహిళలకు అన్యాయం చేసేలా బీఆర్ఎస్ కుట్రలుల పన్నుతోందని ధ్వజమెత్తారు. పంట రుణమాఫీని చేయని బీఆర్ఎస్ ఇప్పుడు రైతుల ప్రేమ కురిపించడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ హాయంలో 20 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయలేదని, చివరకు బీఆర్ఎస్ చేసిన రుణ మాఫీ వడ్డీలకు కూడా సరిపోలేదన్నారు. కానీ ప్రజా ప్రభుత్వం కేవలం 27 రోజుల్లోనే రూ.18 వేల కోట్ల పంట రుణాలను మాఫీ చేసిందని, బీఆర్ఎస్ ఏక కాలంలో కనీసం లక్ష రూపాయలు రుణమాఫీ చేయలేదని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం రుణ మాఫీ చేయకపోవడంతో ఎంతో మంది రైతులు బ్లాక్ లిస్టులోకి వెళ్లారని, దీంతో ఇప్పుడు రుణ మాఫీ చేయాలంటే సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. మేమే ఏక కాలంలో పంట రుణ మాఫీలు చేస్తుంటే బీఆర్ఎస్ సహించలేకపోతుందని అన్నారు. రూ.50 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, సామాన్యుల గృహాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలన్న ఆలోచన బీఆర్ఎస్ చేయలేదన్నారు. మహిళలకు వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇస్తూ వారిని ఆర్థికతంగా బలోపేతం చేస్తున్నామని చెప్పారు. మహిళలకు బీఆర్ఎస్ ఎగ్గోట్టిన వడ్డీలను మేమే చెల్లిస్తున్నామని చెపుకొచ్చారు. బీఆర్ఎస్, బీజేపీలు కలిసి రూ. 400 ఉన్న గ్యాస్ ధరను రూ.1200 చేసారని, అందుకే వంటింటి భరాన్ని తగ్గించేందుకు రూ.500 కే సిలిండర్ ఇస్తున్నామన్నారు. పదేళ్లలో కనీసం లక్ష ఉద్యోగాలు బీఆర్ఎస్ ఇవ్వకపోయిందని, ఆరు మాసాల్లోనే మేము 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. మాకు ప్రజలు ఐదేళ్ల మాండేట్ ఇచ్చారని, ఇంకా నాలుగు సంవత్సరాల సమయం ఉందని కావున ఈ నాలుగేళ్లలో ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేస్తామన్నారు. గూడు లేని వాళ్లకు కాంగ్రెస్ గత ప్రభుత్వాలు లక్షల ఇండ్లు ఇస్తే ఇప్పుడు కూడా రూ.5 లక్షలతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తోందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అణచివేత విపక్షంలో ఉన్నప్పుడు అవస్తవాలు చెప్పడమే బీఆర్ఎస్ నైజం అంటూ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం చేసిన రూ.7 లక్షల కోట్ల అప్పులకే రూ.54 వేల కోట్లు వడ్డీలే చెల్లించామన్నారు. గతంలో బీఆర్ఎస్ ఎన్నో హామీలిచ్చి ప్రజలను మోసం చేసిందని, దళిత సీఎం లేదు, దళితులక మూడెకరలా భూమి లేదని విమర్శించారు. ఇప్పుడు ట్విట్టర్లో తప్పుడు ప్రచారం చేస్తూ తెలంగాణ మీద విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. పంచాయతీ భవనం తాకట్టు అని హరీష్ రావు ప్రచారం చేయడం సరికాదని, అసలు నిజాలు తెలుసుకోకుండా ట్వీట్లు పెట్టి ఎందుకు గౌరవం పొగొట్టుకుంటున్నారని అన్నారు. కులగణను అడ్డుకుంటున్న బీఆర్ఎస్ ను బీసీ సంఘాలు నిలదీయాలని, కులగణనకు అడ్డుపడుతున్న బీఆర్ఎస్ వైఖరిని కుల సంఘాలు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. విదేశాల నుంచి రప్పించి బీఆర్ఎస్ కుటుంబ సర్వే చేసి ప్రజలకు నయా పైసా ప్రయోజనం చేయలేదన్నారు. ఇంటింటి సమగ్ర సర్వేను బహిష్కరించడం అంటే మన హక్కులను, అభివృద్ధిని వదులుకోవడమే అవుతుందన్నారు.

ఘనంగా అబుల్ కలాం ఆజాద్ జయంతి

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారతజాతి గర్వించదగ్గ నాయకుడు భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జరిగిన వేడుకల్లో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొని మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా, భారత విద్యావ్యవస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన గొప్ప మార్గదర్శి అని, విద్యావ్యవస్థ లో ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టారని, నేటి విద్యా వ్యవస్థ ఇంత పటిష్టంగా ఉందంటే నాడు ఆయన చేసిన కృషి ఫలితమే అని పేర్కొన్నారు. గాంధీజీ స్ఫూర్తితో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం, గాంధీజీ ఆశయాలకు ఆయన కట్టుబడి ఉన్నారన్నారు.

ముదిరాజుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది,...

ముదిరాజ్‌ల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని కోటకదిర గ్రామంలో ముదిరాజ్ సంఘం భవనానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కులమతాలకు అతీతంగా సముచితమైన స్థానం, ప్రాధాన్యత ఇస్తామని ఆయన తెలిపారు. అత్యధిక సంఖ్యలో ఉన్న ముదిరాజ్ ల ను గత ప్రభుత్వం విస్మరించిందని, ఇన్ని సంవత్సరాలుగా వారికి ఒక భవనం లేకపోవడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజ్ అభివృద్ధికి కట్టుబడి వారికి అన్ని విధాలా ప్రభుత్వ పరంగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, జిల్లా మత్స్యకారుల సంఘం అధ్యక్షులు గంజి ఆంజనేయులు, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్ పి వెంకటేష్, ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శి, ముకుంద రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజావాణి: మేయర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : ప్రజా సమస్యల పరిష్కరించదానికే ప్రజావాణి కార్యక్రమమని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను పరిశీలించి వెంటనే పరిష్కరించేలా చొరవ చూపాలని సంబంధిత అధికారులను మేయర్ ఆదేశించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మేయర్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డితో కలిసి విజ్ఞప్తులను స్వీకరించారు. ఆయా అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి సమస్యల పరిష్కారానికి ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ... ప్రజావాణిలో వచ్చిన అర్జీలను జాప్యం లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అర్జీదారులకు తెలిపారు. సమస్యల పరిష్కారానికి సరియైన దారి వెతకాలని, అర్జిదారులను కార్యాలయం చుట్టూ తిప్పవద్దని సూచించారు అర్జీదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్జీదారులు సంయమనం పాటించాలని కోరారు. ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా నాలుగు విన్నపాలు రాగా సంబంధిత అధికారులకు పరిష్కారానికై పంపించడం జరిగింది. డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ... అర్జీదారుల సమస్యల పరిష్కారంలో అధికారులు విశేష కృషి చేయాలన్నారు. ఎప్పటి కప్పుడు విన్నపాలను సత్వర న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 43 విన్నపాలు రాగా అందులో అత్యధికంగా టౌన్ ప్లానింగ్ విభాగానికి 26 ఫిర్యాదులు రాగా, హెల్త్ 4, ఈ.ఎన్.సి విభాగానికి 3, ట్యాక్స్ సెక్షన్, యు.బి.డి, ఎఫ్.ఏ విభాగాలకు రెండు చొప్పున, లీగల్, లేక్స్, హెచ్.ఎం.డబ్ల్యు.ఎస్.ఎస్.బి, ఎల్.డబ్లు.ఎస్ విభాగాలకు ఒకొక్క ఫిర్యాదు చొప్పున వచ్చాయని తెలిపారు. జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 103 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్ లో 62, శేరిలింగంపల్లి జోన్ లో 19, ఎల్బీనగర్ జోన్ లో 11, సికింద్రాబాద్ జోన్ లో 4, ఖైరతాబాద్ జోన్ లో 4, చార్మినార్ జోన్ లో 3 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, నళిని పద్మావతి, యాదగిరి రావు, వేణుగోపాల్ రెడ్డి, గీతా రాధిక, పంకజ, అశోక్ సామ్రాట్, రఘు ప్రసాద్, సుభద్ర దేవి, సిసిపి శ్రీనివాస్, సీఈ భాస్కర్ రెడ్డి, అడిషనల్ సి సి పి గంగాధర్, లేక్స్ ఎస్ ఈ నారాయణ, సి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ పద్మజ, వెటర్నరీ చీఫ్ డాక్టర్ అబ్దుల్ వకీల్, జాయింట్ కమిషనర్లు మహేష్ కులకర్ణి, ఉమ ప్రకాష్, వాణిశ్రీ, వాటర్ వర్క్స్ డి జి ఏం సాయి రమణ, హౌసింగ్ ఎస్ఈ కృష్ణారావు, పీవీ రమణ, రాజేశ్వర్, యు బి డి డైరెక్టర్ శ్రీనివాస్, అడ్వర్టైజ్మెంట్ ఆఫీసర్ దుర్దనా బేగం ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-హైదరాబాద్ : ప్రజావాణి దరఖాస్తులు తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయా భవనంలోని సమావేశమ మందిరంలో తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల వద్ద నుంచి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీతలతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా వెంట వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో వివిధ అంశాలపై 67 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. హయాత్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్న అజయ్ అనే విద్యార్థి ప్రమాదవశాత్తూ పాఠశాల గేట్ పడి మృతిచెందిన విద్యార్థి కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారము చెక్కును జిల్లా కలెక్టర్ అందజేశారు. రెవెన్యూ శాఖ - 56 , ఇతర శాఖలకు - 11 మొత్తం 67 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహాశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు..

16న ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి : ఆర్ కృష్ణయ్య

విశాలాంధ్ర-బషీర్ బాగ్: ఫీజుల బకాయిలు, స్కాలర్‌షిప్‌లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16న కాలేజీ విద్యార్థులు తరగతులు బహిష్కరించి రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్లు, ఆర్డీఓ, ఎమ్మార్వో ఆఫీస్‌లు ముట్టడించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, మాజీ ఎంపీ ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఆదివారం బషీర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫీజుల బకాయిలు రూ.4వేల కోట్లు చెల్లించాలని, పెరిగిన ధరల ప్రకారం విద్యార్థుల స్కాలర్షిప్‌ను 5500 నుంచి 20 వేల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి11 నెలలు గడుస్తున్న ఇంతవరకు స్కాలర్షిప్ ఫీజులకు ఒక్క రూపాయి బడ్జెట్ ఇవ్వలేదన్నారు. 14 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్షిపులు ఇవ్వడానికి 4వేల కోట్లు బడ్జెట్ కేటాయించడం లేదని ఆరోపించారు. కొందరు కాంట్రాక్టర్లు బిల్లులు వేల కోట్లు ఎలా పాస్ చేస్తున్నారని ప్రశ్నిందారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని బకాయిలు చెల్లించాలని కోరారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఫీజుల బకాయిలు చెల్లించకపో వడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలేజీ యాజమాన్యాలు కోర్సు పూర్తి అయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఉన్నత కోర్సులలో సీట్లు వచ్చిన 'చదవలేక పోతున్నారని, అలాగే ఉద్యోగాలు వచ్చిన సర్టిఫికెట్లు లేక ఉద్యోగాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బి.సి విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ, గుజ్జ సత్యం, జిల్లపల్లి అంజి, సి.రాజేందర్, అనంతయ్య, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యాదవ్ సదర్ సమ్మేళనం

యాదవ భవన నిర్మాణానికి రూ. 5 లక్షల నా వంతు సాయం ఎమ్మెల్సీ నవీన్

విశాలాంధ్ర,షాద్ నగర్,రూరల్: యాదవ భవన నిర్మాణం ఎప్పుడు చేపట్టినా నా తరపున రూ,5,00,000 లక్షల విరాళంగా ఇస్తా, అని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని నిర్వహించిన యాదవ సదర్ సమ్మేళన కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అంగరంగ వైభవంగా దున్నలను చేతబూని, డీజేలతో, టపాసులు మోతలు మధ్య గ్రాండ్ గా ఎంట్రీ ఇస్తూ సదరు సమ్మేళన సమావేశవేదిక వద్దకు చేరుకున్నారు. ఆయన వేదిక వద్దకు చేరుకోగానే సదరు సమ్మేళన కమిటీ సభ్యులు శాలువా కప్పి వేదిక పైకి ఆహ్వానించి భారీ మాలతో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ... ఎవరు ఏ సహాయం అడిగినా తన సొంత ఖర్చులతో భరిస్తానని, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రారంభించిన ఈ కార్యక్రమం చాలా ఉత్సాహంగా జరుగుతుందని, యాదవులందరూ ఏకతాటిపైకివచ్చి అద్భుతమైన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, యాదవ భవనం ఎప్పుడు నిర్మించినతన వంతు సహాయంగా 5 లక్షల రూపాయల విరాళాన్ని ఇస్తానని, నేను ఇచ్చే విరాళమే కాకుండా ప్రజలందరూ సహకరించాలని ఆయన తన ప్రసంగంలో తెలిపారు. యాదవ సోదరుల అభివృద్ధికి తనవంతు సహాయం ఎల్లవేళలా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన యాదవులందరికి పేరుపేరునా అభినందనలు తెలుపారు.

అక్బరుద్దీన్ షా ఖాద్రి దర్గాలో ఉర్సు ఉత్సవాలు

విశాలాంధ్ర, షాద్ నగర్, రూరల్ : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఫరూక్ నగర్‌లోని నాగులపల్లి రోడ్డులో ఉన్న సయ్యద్ అక్బరుద్దీన్ షా ఖాద్రి దర్గాలో ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సయ్యద్ షాబుద్దీన్, సయ్యద్ అజారుద్దీన్ హాఫెజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, అజీజ్‌ఉల్లా ఖాద్రి, రిజ్వాన్ పాషా ఖాద్రీ, అలీ ముస్తఫా ఖాద్రి, మునవర్ హాఫెజ్, ఎతేషామ్, నదీమ్ హాఫెజ్, షోయేబ్ హాఫెజ్, హాజరయ్యారు. ఇందులో భాగంగా ఫరూక్ నగర్‌లోని జమే మస్జీద్ దగ్గర నుంచి ర్యాలీగా గంధాన్ని తీసుకువెళ్లి అక్బరుద్దీన్ షా దర్గాలు పూలతో, చాదర్‌లతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మిలాద్, నాతే షరీఫ్, భక్తి గీతాలు అలపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా అతిథులకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి పలువురు మత పెద్దలతో పాటు, నాయకులు బాబర్ అలీ ఖాన్, జమ్రుద్ ఖాన్,ఇబ్రహీం,సర్వర్ పాషా, రఫిక్ పటేల్,అలీమ్ సకీబ్,జఫర్,యాకుబ్, పిల్లి శేఖర్, గంగాధర్, రిపోర్టర్ ఇలియాజ్, మొయిజ్, మునీర్, రహీం, మజాహర్, ఎజాస్, సజద్, రషీద్, హామెద్, ఆసిఫ్, ఇమ్రాన్, ఆమీర్, ఉమేర్, అర్బాజ్,అర్షత్,ఓవేజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో ప్రైవేట్ ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: ఆటో ప్రైవేట్ ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 13 నుంచి 24 వరకు పలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలంగాణ ఆటో అండ్ ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ యూనియన్ ఐక్య కార్యాచరణ సమితి తెలిపింది. సోమవారం సమితి ఆధ్వర్యంలో బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో డ్రైవర్ల సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీపీటీఎంఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి, బీఎంఎస్ ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి బీ. పెంటయ్య గౌడ్ లు మాట్లాడుతూ ఆటో, టాక్సీ డ్రైవర్ల ఉపాధిని దెబ్బతీసే ఓల్లో, ఉబర్, రాపిడో యారి బైకుల అక్రమ వ్యాపారాన్ని నిషేధించాన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఆటో మీటర్ రేట్లు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. మహాలక్ష్మి పథకాన్ని ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. గ్రేటర్, జిల్లాలలో ఆటో, గూడ్స్ వాహనాలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, ఆత్మహత్యలు చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. ప్రైవేట్ రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 21న హైదరాబాదులో జరిగే మహాధర్నా కు వేలాదిమంది డ్రైవర్లు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎన్టీయూసీ యాదగిరి, టీఏటీయూ రవి, ఈశ్వర్, ఎన్టీఏడీయూ రవికుమార్, జేబీఎస్ కిషన్, టాక్స్ శ్రీధర్ రెడ్డి, వజ్ర లింగం, సాయిలు, శ్రీనివాస్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి, కూమార్తెకు భారత్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు

విశాలాంధ్ర-బషీర్ బాగ్: రవీంద్రభారతిలోని ప్రధాన మందిరంలో తల్లీ, కూతురు నర్తకీమని హైకోర్టు న్యాయవాది దువ్వూరి వాస్తల్యేంద్ర, మిస్సెస్ యూనివర్స్ ఇంటలిజెన్స్ నర్తకీమని అభిమానికా యాదవ్‌లు కలిసి నారీ శక్తి నాట్య హేళలో 90 నిముషాల పాటు నవజనార్ధన పారిజాతం, పేరిణి తాండవం చేసి తమ పేర్లని భారత్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు చేసుకున్నారు. శ్రీకృష్ణుడు, శివుడి ప్రత్యేక పాత్రలో డాక్టర్ కాంతిలాల్ జైన్ అలరించారు. ముఖ్య అతిధి సముద్రాల వేణుగోపాలాచారి, భారత్ వరల్డ్ రికార్డ్స్ అధ్యక్షుడు లయన్ కె.వి.రమణారావు, ఏ. శ్రీధర్, ప్రముఖ నాట్యాగురువు పేరిణి కుమార్, డాక్టర్ కాంతిలాల్ జైన్ ప్రముఖ ఆర్తో పెడిక్ సీనియర్ సర్జన్ ల చేతుల మీదుగా తల్లి వత్సలెంద్ర, కుమార్తె అభిమానిక నారీ శక్తి నాట్య హేళ భారత్ వరల్డ్ రికార్డ్స్‌ను అందజేశారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

విశాలాంధ్ర - అమనగల్లు : గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఆధ్వర్యంలో మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమం ఉద్యమంలా కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా పత్రీజీ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రపంచంలో ప్రసిద్ధిగాంచిన మహేశ్వర మహా పిరమిడ్ ఆవరణలో పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు పత్తి రవికుమార్, చంద్రశేఖర్,నిర్మల మాధవి మరియు గ్రీన్ ఇండియా చాలెంజ్ కోఆర్డినేటర్ సతీష్ లతో కలిసిరాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి పత్రీజీ శక్తి స్థల్ ప్రాంతంలో మొక్కలు నాటడం జరిగింది. ట్రస్టీ సభ్యులు, లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటాలనే సంకల్పంతో మొదలుపెట్టిన ఈ కార్యక్రమం భావితరాలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మొక్కలు నాటడం సామాజిక బాధ్యత అన్నారు, పత్రీజీ జన్మదిన పురస్కరించుకొని ఈ కార్యక్రమం చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి కర్త, కర్మ, క్రియ అయిన సంతోష్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రవాస భారతీయురాలు ఉమ, గ్రీన్ ఇండియా చాలెంజ్ కోఆర్డినేటర్లు రాజు, రాహుల్, రమేష్, పిరమిడ్ సిబ్బంది పాల్గొన్నారు.

అమెరికా టెక్నాలజీతో గుంతలు పూడ్చివేత : కోమటిరెడ్డి

విశాలాంధ్ర- హైదరాబాద్ : రాష్ట్రంలో పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ రోడ్లను అమెరికా టెక్నాలజీతో గుంతలు పూడ్చి కొత్త రోడ్లను వేయుటకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం చిలుకూరు-తంగడపల్లి రోడ్డులో గల గుంతలను అమెరికన్నె టెక్నాలజీ మిషనరీతో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల నుంచి మండలాలకు ప్రతి తండాలలో సిసి రోడ్లు వేయుటకు టెండర్లను పిలవడం జరిగిందని , పనులు రెండు నెలల్లో ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. గత సంవత్సరాలుగా గుంతలు ఉన్న రోడ్లలో అనేక ప్రమాదాలు జరిగి ప్రజలు హాస్పిటల్లో ఉంటున్నారని, ఈ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి సారధ్యంలో అన్ని రోడ్లకు మరమ్మతులు చేయటము, కొత్త రోడ్లను వేయటం కొరకు మంచి నిర్ణయం తీసుకున్నామని

అన్నారు. ఉప్పల్-నారపల్లి ఫ్లైఓవర్ గత మూడు సంవత్సరములలో పిల్లర్ల దశలోనే నిలిచిపోయిందని, తాము కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి 18 నెలలు పూర్తి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం 15 వేల కి.మీ రాష్ట్రంలో డబల్ రోడ్లు వేయుటకు టెండర్ల ప్రక్రియ ప్రారంభించనున్నామని తెలిపారు. ఇటీవలే రోడ్లు, భవనాల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా 156 మందిని నియమించి ఈ రోడ్ల నిర్మాణాల పనులు వేగవంతం చేయుటకై ఆదేశించినట్లు ఆయన తెలిపారు. గతంలో 2020 సంవత్సరంలో రోడ్ల నిర్మాణం కొరకు 1800 కోట్లు మంజూరు అయినప్పటికీ పనులు ప్రారంభించలేదని, తాము ఆ పనులు వెంటనే ప్రారంభిస్తున్నామని మంత్రి తెలియజేశారు. ఈ పనులకు అటవీ అనుమతులు, ఎన్జీటీ గ్రీన్ బెల్ట్ క్లియరెన్స్ లేక పనులు పురోగతిలో లేవని, ఈ ప్రభుత్వం అన్ని అనుమతులు తీసుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య, రోడ్లు భవనాల శాఖ స్పెషల్ సెక్రటరీ డి.హరిచందన, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

యాదవుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత : ఎమ్మెల్యే

విశాలాంధ్ర, షాద్‌నగర్,రూరల్: ఘనంగా సదర్ ఉత్సవాలు యాదవుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని, నేడు యాదవులకు సంస్కృతి సంప్రదాయమైన సదర్ పండుగను ప్రభుత్వపరంగా అధికారికంగా జరుపుతున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, షాద్ నగర్ వీర్లపల్లి శంకర్ తెలిపారు.షాద్ నగర్ పట్టణంలో ఆదివారం రాత్రి జరిగిన యాదవుల సదర్ పండగ వేడుకల్లో ఎమ్మెల్యే శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నియోజకవర్గానికి చెందిన పలువురు యాదవ పెద్దలు, ప్రజలు, యువత, మహిళలు పిల్లలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. సదర్ కమిటీ అధ్యక్షుడు నడికుడ యాదగిరి యాదవ్, గౌరవ అధ్యక్షుడు దంగు శ్రీనివాస్ యాదవ్ తదితరుల యాదవ సోదరుల ఆధ్వర్యంలో జరిగిన సదర్ సయ్యాటకు భారీ ఎత్తున ప్రజలు హాజరయ్యారు. దున్నపోతుల ఆటలు చూడటానికి నియోజకవర్గం నలుమూలల నుండి తరలివచ్చి ప్రజలు ఆసక్తిగా తిలకించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ....యాదవులు ఐక్యంగా ఉండడం వల్లే అభివృద్ధి చెందుతారని తెలిపారు. పాండవుల పక్షాన ధర్మం,

న్యాయం ఉండటం వల్లనే శ్రీకృష్ణుడు పాండవుల పక్షాన నిలబడ్డారని, యాదవులు కూడ శ్రీకృష్ణుని మార్గంలో పయనించి దేశం, సమాజం కోసం ధర్మం పక్షాన నిలబడాలని ఆయన కోరారు. యాదవ సోదరులు అందరికీ అండగా నిలవాలన్నారు. యాదవుల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. అందుకే సదర్ వేడుకను ప్రభుత్వం అధికారికంగా జరుపుతోందని అన్నారు. నేడు ఈ ప్రాంతంలో ఇంత పెద్ద ఎత్తున సదర్ పండుగ వేడుకలు అధికారికంగా జరుగుతున్నాయంటే అది యాదవ సోదరులకు ప్రభుత్వం ఇచ్చిన గౌరవం అని అన్నారు. గత పదేళ్లు ఎవరు ఎలా పాలించారో అందరికీ తెలుసని యాదవులకు పెద్దపీట వేస్తున్నది మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వమని స్పష్టం చేశారు. యాదవులకు దేశంలోనే ఘనమైన చరిత్ర ఉందని, యాదవ బిడ్డలను బాగా చదివించుకోవాలన్నారు. శ్రీకృష్ణుని వారసులుగా యాదవ సోదరులు ఎంతో అభివృద్ధి సాధించాలని వీర్లపల్లి శంకర్ కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాజీ జడ్పీటీసీ శ్యామ్ సుందర్ రెడ్డి, తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ యదయ్య యాదవ్, విశ్వం, కొంకళ్ళ చెన్నయ్య, చెంది తిరుపతి రెడ్డి,బాబర్ అలీ ఖాన్,అగ్గనూర్ బస్వాం ఇబ్రహీం, అందే మోహన్, శ్రీనివాస్, సర్వర్ పాషా,ముబారక్, ఖదీర్, కమిటీ అధ్యక్షుడి నడికూడా యాదగిరి యాదవ్, శ్రీనివాస్ యాదవ్, బక్కన యాదవ్,రఘు నాద్ యాదవ్,కావాలి కృష్ణ యాదవ్, షాబాద్ మల్లేష్ యాదవ్, నర్సింలు యాదవ్, తుమ్మల నర్సింహులు యాదవ్, ప్రవణ్ యాదవ్,మధువు లు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే రంగారెడ్డి

విశాలాంధ్ర-తుర్కయంజాల్ : నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోనీ 17వ వార్డు తొర్రూరులోని శ్రీరామ కాలనీ, గ్రీన్‌హౌస్ కాలనీలలో చైర్మెన్ మల్‌రెడ్డి అనురాధ రాం రెడ్డి కౌన్సిలర్ నక్క శివలింగం గౌడ్ తో కలసి రూ.43 లక్షల రూపాయలతో చేపట్టనున్న డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నాయకులు,

ప్రజా ప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ కొశిక ఐలయ్య, నాయకులు ధనరాజ్ గౌడ్, వంగేటి గోపాల్ రెడ్డి, షాగ రమేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయ ముఖద్వారం ప్రారంభం

విశాలాంధ్ర, మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పర్వతపూర్ లోని సత్యనారాయణపురం రోడ్ నెంబర్ 12లో గల దుర్గ మల్లేశ్వర స్వామి ఆలయ సత్యనారాయణపురం ముఖద్వార ప్రారంభోత్సవ కార్యక్రమానికి దాత బోడిగె ఉదయ్ రాజ్ ఆహ్వానం మేరకు సోమవారం ఉదయం ముదుర్గ మల్లేశ్వర స్వామి ఆలముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించిన టీపీసీసీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జి వజ్రేష్ యాదవ్, నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుదీర్ రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, మేయర్ అమర్ సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, కార్పొరేటర్లు, బొడిగె రాందాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువజన నాయకులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అపర్ణా నియోమాల్ షాపింగ్ ఫెస్టివల్

విశాలాంధ్ర, జూబిలీహిల్స్ : నల్లగండ్లలో ప్రముఖ రియల్ ఎస్టేట్సంస్థ అపర్ణా కన్స్ట్రక్షన్ అండ్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో అపర్ణా నియో మాల్లో

నెలరోజుల బహుమతి పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. నెల రోజులపాటు సాగిన ఈ లక్కీడ్రా ముగింపు కార్యక్రమంలో 16 మంది విజేతలకు ప్రత్యేక బహుమతులు అందించారు. రూ.4,999 లేదా అంతకంటే ఎక్కువ కొను గోళ్లు చేసినవారు బహుమతుల్లో టీవీఎస్ అపాచీ ఆర్ఆర్ 310 మోటార్సైకిల్ ఉన్నాయి. ఆటోమొబైల్ భాగస్వామి అభినవ్టీ వీఎస్ ఎలక్ట్రానిక్ భాగస్వామి, క్రోమా నుంచి ప్రీమియం ఎలక్ట్రానిక్స్ అనుబంధంతో వాషింగ్ మెషీన్, రిఫ్రిజిరేటర్, లెడ్ టీవీ, వాటర్ ప్యూరిఫైయర్, ఎయిర్ఫైయర్ ఇతర ఉపకరణాల వంటివి వంటివి విలాస వంతమైన గడియారాలు బహుమతిగా ఇచ్చే భాగస్వామి కమల్ వాచ్ క్ గొప్ప బహుమతి టీవీఎస్పా చీ ఆర్ఆర్ 310 అందించబడింది. విజేతలను అపర్ణా నియో సెంటర్ హెడ్ సునీల్ ద్వివేది సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియో మాల్ ఇన్చార్జ్ సునీల్, ఇతర ఉద్యోగులు, వినియోగదారులు పాల్గొన్నారు.



క్షత్రియా హోటల్ అండ్ టవర్ససాంప్రదాయ కేక్ మిక్సింగ్

విశాలాంధ్ర, జూబిలీహిల్స్ : క్రిస్మస్, కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేకును తయారు చేసే కార్యక్రమాన్ని సాంప్రదాయపద్ధతిలో నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇలా నిర్వహించబడే ఈ కేక్ మిక్సింగ్ కార్యక్రమం రోజులను, సంతోషాన్ని తీసుకొని వస్తుందన్న నమ్మకంతో జరుపబడుతుంది. క్రిస్టమస్ పండుగ ప్రేమ, శాంతి కి ప్రతిబింబంగా నిలుస్తుంది. ఇలాంటి ప్రత్యేక సందర్భాలను మన తర్వాత తరం వారికి గుర్తుకు తెచ్చేలా, వారిని ఇలాంటి ప్రత్యేక పండుగలను ఆనందంతో నిర్వహించుకొనేలా ప్రోత్సహించాలనే లక్ష్యంతో క్షత్రియా హెూటల్ అండ్ టవర్స్ ఏటా నిర్వహించే పలు కార్యక్రమాలలో ఈ సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించబడే కేక్ మిక్సింగ్ ఒక భాగం. కేక్ మిక్సింగ్ కార్యక్రమం సంతోషం, ప్రేమ ఉత్సాహానికి ప్రతిరూపం. విశిష్ట అతిథిగా హాజరైన మాస్టర్ చెఫ్ భక్తి అరోరా, మిస్టర్ గోపి, ఎక్జిక్యూటివ్ చెఫ్, క్షత్రియా హెూటల్ అండ్ టవర్స్ నేతృత్వంలో ఒక పెద్ద టేబుల్ పై అందంగా అలంకరించిన వివిధ ఫలాలకు చెందిన ముక్కలకు బాదం, కిస్ మిస్, వివిధ రంగుల చెర్రిస్ ను జత చేర్చి కార్యక్రమానికి హాజరైన ఇతర గెస్టులైన శివరామ రాజు, మేనేజింగ్ డైరెక్టర్, క్షత్రియా హెూటల్ అండ్ టవర్స్, గాయత్రి రాజు, జాయింట్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్, రమేష్ బాబు, జనరల్ మేనేజర్, , అశోక్, ఫుడ్ బేవరేజెస్ మేనేజర్, క్షత్రియా హెూటల్ అండ్ టవర్స్, శామ్యూల్ రాజ్, సేల్స్ మార్కెటింగ్ మేనేజర్, క్షత్రియా హెూటల్ అండ్ టవర్స్ లతో కలసి కలిపారు. వివిధ ఫలాలను, బాదం, కిసిమిస్, వివిధ రంగుల చెర్రీస్ కలిపిన అనంతరం వాటిపై పలు రకములైన లిక్కర్ కలపడం ప్రారంభించారు. వీటన్నింటినీ చక్కగా కలిపేందుకు సిబ్బంది కార్యక్రమానికి హాజరైన గెస్టులు చూపిన ఉత్సాహం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం రమేష్ బాబు, జనరల్ మేనేజర్, క్షత్రియా హెూటల్అండ్ టవర్స్ మాట్లాడుతూ రాబోయే పండుగల సీజన్‌ను పురస్కరించుకొని క్షత్రియా హెూటల్‌లో ఎన్నో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించబోతున్నామని వెల్లడించారు.

జాతీయ విద్యా విధానం అమలు ఆజాద్ దే : ఎమ్మెల్యే

విశాలాంధ్ర,షాద్ నగర్,రూరల్: భారతరత్న, కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 11 ఏళ్లు విద్యాశాఖ మంత్రిగా ఆజాద్ ఎనలేని సేవలు అందించి, జాతీయ విద్యా విధానం అమలు చేశారనీ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో మైనార్టీ నేతల ఆధ్వర్యంలో జరిగిన మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ 136వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పండ్లు ఉచితంగా పంపిణీ చేశారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ 136 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. మైనార్టీ సోదరులు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ సేవలను గుర్తుచేసుకొని వారి పేరిట సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. ఒక గొప్ప విద్యావేత్త మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ అని ఆయన పేరిట విద్య దినోత్సవం జరపడం గర్వకారణం అని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి మనోహర్, ప్రధాన ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి,బాబర్ అలీ ఖాన్, సర్వర్ పాషా, మున్సిఫ్ జర్నలిస్ట్ మన్సూర్ అలీ ఖాన్,చెన్నయ్య,శ్రీకాంత్ రెడ్డి,ఖదీర్,సయ్యద్ మక్తదీర్ అలీ, మసూద్ ఖాన్, అంజద్ గోరి, లాయిఖ్, మహమ్మద్, మహమూద్, అష్రఫ్, హఫీజ్ ఖాన్, ఫెరోజ్, అసదుల్లా ఖాన్, ఫిరోజ్, ఆలిం షకీబ్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేపై సమీక్ష

విశాలాంధ్ర, హైదరాబాద్ : సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతీమా సింగ్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పి.సౌమ్యలతో కలిసి మున్సిపల్ కమీషనర్లు, మండల ప్రత్యేకధికారులు, మండల అభివృద్ధి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరుగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరేన్స్ లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వేను ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ముందుకు వెళ్ళాల్సిన బాధ్యత ఉంద న్నారు. ఉద్యోగులందరూ సరైన సమయంలో సమయపాలన పాటిస్తూ సర్వే నిర్వహించాలని తెలిపారు. జిల్లాను 5 వేల 376 ఎన్యూమరేషన్ బ్లాక్లుగా విభజించడం జరిగిందని, సర్వేకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని బ్లాక్ లలో ఎన్యూమరేటర్లు ద్వారా సర్వే ప్రక్రియ

కొనసాగించాలన్నారు. కుటుంబ పెద్ద తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డులను, పట్టాధార్ పాసు పుస్తకం అధికారులు వచ్చినప్పుడు అందుబాటులో ఉంచు కోవాలని, గ్రామ పెద్దలు, యువకులు ఈ సర్వేకు సహకరించి తోడ్పాటు అందించేలా ఎన్యూమరేటర్లు కూడా వారితో సహకారం తీసుకుంటూ తప్పులు లేకుండా ఫారం ఫిల్ చేయడం పూర్తి చేయాల న్నారు. సోమవా రంతో 3 రోజులు సర్వే నిర్వహిచడం జరిగిం దన్నారు. ఇప్పటి వరకు గుర్తించిన కుటుంబాలు 6 లక్షల 4 వేల 351 కాగా 1 లక్ష 202 కుటుంబాల నుండి సమాచారం సేకరించడం జరిగిందన్నారు. అయితే ఇందులో వచ్చిన సమస్యలు ఎన్యూమరేటర్లు ఎప్పడికప్పుడు నివృత్తి చేసుకుంటూ ముందుకు వెళ్ళడం జరుగుతుందని తెలిపారు. ఏ ఒక్క కుటాంబాన్ని కూడా వదలకుండా ప్రతి కుటుంబాన్ని సర్వే నిర్వహిం చాలన్నారు. మండలాల్లో యం.పి.డి.ఓ, పంచాయతీ సెక్రెటరీలు, ఎన్యూమరేటర్లతో సమన్వయం చేసుకుంటూ, మున్సిపల్ పరిధిలో కూడా మున్సిపల్ కమీషర్లు వారికి వచ్చే సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకుంటూ సర్వే ముందుకు పోవడానికి కృషి చేయాలని తెలిపారు. అదే తరుణంలో జిల్లా, అసెంబ్లీ, మున్సిపాలిటీ, మండల, గ్రామ పంచాయతీలలో ప్రజాప్రతినిధు లను కూడా భాగస్వామ్యం చేస్తూ సర్వే నిర్వహిం చలన్నారు. రోజువారిగా పూర్తియిన సర్వే ఫారంలను ట్రంక్ బాక్సో ఎన్యూమరేటర్ బ్లాక్ వైజ్ గా భద్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాల న్నారు. ఈ సమావేశంలో జడ్ పి సిఇఓ కృష్ణ రెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రామారావ్, డిఇఓ సుషిందర్ రావు, మండల ప్రత్యేకధికారులు, మున్సిపల్ కమి షనర్లు, ఎం.పి.డి.ఓ లు, సంబంధిత ప్రణాళిక శాఖ అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర ఇంటింటి సర్వేకు నోడల్ అధికారుల నియామకం

విశాలాంధ్ర, హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను మరింత సమర్ధవంతంగా నిర్వహించడానికి జీహెచ్ఎంసీ కొన్ని కొత్త చర్యలు తీసుకుంది. మొత్తం 30 సర్కిళ్లకు 10 మంది నోడల్ ఆఫీసర్లను నియమిస్తూ, వారి కింద మూడు సర్కిళ్ల చొప్పున వీరికి బాధ్యతలను అప్పగించింది. ఈ చర్య వల్ల సర్వే ప్రక్రియ మరింత పారదర్శకంగా నిర్వహించబడుతుంది.

సర్కిళ్ల వారీగా నియమించబడిన నోడల్ ఆఫీసర్లు: అడిషనల్ కమిషనర్ ఎస్.సరోజ (కాప్రా, మల్కాజ్ గిరి, సికింద్రాబాద్), అడిషనల్ కమిషనర్ ఎస్. పంకజ (హయత్ నగర్, ఎల్బీనగర్, సరూర్ నగర్), అడిషనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్ (సంతోష్ నగర్, చాంద్రాయణగుట్ట, ఫలక్ నుమా), ఎస్టేట్ ఆఫీసర్ వై. శ్రీనివాస్ రెడ్డి (మలక్ పేట, చార్మినార్, రాజేంద్రనగర్), ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ శరత్ చంద్ర (మెహదీపట్నం, కార్వాన్, జూబ్లీ హిల్స్), కే. సత్యనారాయణ లీగల్, ఎలక్ట్రిసిటీ అడిషనల్ కమిషనర్ (గోషామహల్, ముషీరాబాద్, అంబర్ పేట), చీఫ్ ఎగ్జామినర్ అకౌంట్స్ వెంకట్ రెడ్డి (యూసుఫ్ గూడ, శేరిలింగంపల్లి, చందానగర్), అదనపు కమిషనర్ (అడ్వర్‌టైజ్‌మెంట్స్) వేణుగోపాల్ రెడ్డి (పటాన్ చెరు, మూసాపేట, కూకట్‌పల్లి), అడిషనల్ కమిషనర్ శానిటేషన్ సీఎస్ రఘు ప్రసాద్ (కుత్బుల్లాపూర్, గాజులరామారం), అడిషనల్ కమిషనర్ స్పోర్ట్స్ ఎన్. యాదగిరి రావు (అల్వాల్, బేగంపేట, సికింద్రాబాద్ కంటోన్మెంట్, ఉప్పల్), ఈ నియామకాలు సర్వే నిర్వహణను వేగవంతం చేసి, సమాచార సేకరణను సమర్ధవంతంగా నిర్వహించేందుకు వీలుంది.

ఓటీఎస్- 2024 నిబంధనల్లో సడలింపు

విశాలాంధ్ర, హైదరాబాద్ : వినియోగదారుల నుంచి భారీ ఎత్తున విజ్ఞప్తులు రావడంతో జలమండలి ప్రభుత్వం.. ఓటీఎస్-2024 పథకం గడువును నవంబర్ 2024 వరకు పొడిగించింది. ఓటీఎస్-2024 కింద ప్రయోజనం పొందే ప్రక్రియను సులభతరం చేసే దిశగా, ప్రభుత్వం అఫిడవిట్ సమర్పించే నిబంధనను సడలించి.. దాని స్థానంలో హామీ పత్రం సమర్పించే వెసులుబాటును కల్పించింది. అందువల్ల ఓటీఎస్-2024 కింద ప్రయోజనం పొందాలనుకునే వినియోగదారులు అఫిడవిట్ స్థానంలో హామీ పత్రం సమర్పించవచ్చు. అక్టోబర్ జారీ చేసిన జీవోలో గతంలో ఏ ఓటీఎస్ పథకం ద్వారా ప్రయోజనం పొందిన వినియోగదా రులకు 50 శాతం వరకు బిల్లు మాఫీ అవుతుంది. అయితే వినియోగదారుల నుంచి విజ్ఞప్తుల దృష్ట్యా ఇప్పుడు ఆ నిబంధన సడలించి అర్హత ఉన్న వారు కేవలం ఓటిఎస్-2020 కింద ప్రయోజనం పొందిన వినియోగదారులకు మాత్రమే 50% ప్రయోజనం పొందుతారు.. గతంలో ఓటీఎస్ 2020 తప్ప ఏ ఓటీఎస్ పథకం ద్వారా ప్రయోజనం పొందినా వినియోగదారులకు వంద శాతం రాయితీ పొందేలా ఆ షరతును సడలించింది. ఓటీఎస్ పథకంపై ఏవైనా సందేహాలుంటే.. జలమండలి కస్టమర్ కేర్ నంబర్ 155313 కు ఫోన్ చేసి వాటిని నివృతి చేసుకోవచ్చు. ఈ పథకంపై అధికారులు ఇప్పటికే అన్ని మాధ్యమాల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

విశాలాంధ్ర-కాప్రా : నాచారం డివిజన్ పరిధిలోని పెండింగ్ అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జన్‌శేఖర్ అన్నారు. సోమవారం నాచారంలోని కార్పొరేటర్ నివాసంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిఈ బాలకృష్ణ, ఏ ఈ కీర్తి లను శాలువాతో సత్కరించి డివిజన్ అభివృద్ధికి తోడ్పడాలని డివిజన్‌లో చాలా పనులు పెండింగ్‌లో వున్నాయని ప్రధానంగా అంబేద్కర్ విగ్రహం వద్ద నున్న పాత బ్రిడ్జి స్థానంలో రూ.94 లక్షలతో మంజూరైన కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులు సత్వరమే ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. అంబేద్కర్ నగర్ కార్తికేయ నగర్ మధ్యలో పోచమ్మ గుడి వద్ద ఉన్న పాత బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి సుమారు రూ.64 లక్షలు నిధులు మంజూరై సుమారు మూడు సంవత్సరాలు దాటింది. ఆ పనులు సత్వరమే ప్రారంభమయ్యేలా చూడాలని. సరస్వతి నగర్ కాలనీలో పార్క్ డెవలప్‌మెంట్ కొరకు రూ.16 లక్షలు మంజూరైన పనులు ప్రారంభించలేదని సత్వరమే పనులు ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. అంబేద్కర్ నగర్ యువజన సంఘం భవనం దాదాపు మూడు సంవత్సరాలు దాటిన ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదని పనులు ప్రారంభమయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. ఇవి కాకుండా రైతు బజార్లో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణం, ఎర్రకుంటలోని హిందూ స్మశాన వాటికను వైకుంఠధామంగా తీర్చిదిద్దే అవసరం ఉందని ఆమె అధికారులను సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రేటర్ బారాస నాయకులు సాయి జెన్ శేఖర్, వర్క్ ఇన్స్పెక్టర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫినో బ్యాంక్ సేవింగ్ అకౌంట్ 'గుల్లక్' ప్రారంభం

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : ఖాతాదారులతో పొదుపు (సేవింగ్) చేయించడమే లక్ష్యంగా సేవింగ్ అకౌంట్ 'గుల్లక్' ప్రారంభించినట్లు ఫినో పేమెంట్స్ బ్యాంక్ జోనల్ హెడ్ మహ్మద్ ఇనాయతుల్లా తెలిపారు. బేగంపేటలో గల ఇండియన్ ఎయిర్‌లైన్స్ కాలనీలో ఉన్న బ్యాంకు శాఖలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకింగ్ ప్రక్రియను సులువుగా, సరళంగా, సౌకర్య వంతంగా మార్చామన్నారు. ఇప్పుడు ఖాతాదారులు తమ సేవింగ్స్ ను ఆదా చేయడంపై దృష్టి పెట్టామన్నారు. ఖాతాదారుల ప్రత్యేక అవసరాలను తీర్చడంలో భాగంగా అనేక ప్రయోజనాలు అందించేందుకు ఈ అకౌంట్ ప్రారంభించామని తెలిపారు. తెలంగాణలో ఫినో బ్యాంక్ 30000 మర్చంట్ పాయింట్‌లలో దేనిలోనైనా గుల్లక్ ఖాతాతెరవవచ్చన్నారు. రూ. వెయ్యి కనిష్ఠ ఖాతా బ్యాలెన్స్‌తో ఖాతాదారులు వార్షిక ప్లాన్ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఎటువంటి ఛార్జీలు లేకుండా నగదు డిపాజిట్లు చేయవచ్చన్నారు. మెట్రోయేతర ప్రదేశాలలో ఏడు ఉచిత ఏటీఎం లావాదేవీలను పొందవచ్చని తెలిపారు. రూపే డెబిట్ కార్డ్‌పై ఆఫర్లను ఆస్వాదించవచ్చన్నారు. ఇందులో భాగంగా ఖాతాదారులు నెలలో కనీసం రూ.500 విలువైన ఐదు యూపీఐ లావాదేవీలు ఫినోపే మొబైల్ యాప్ ద్వారా చేయడం గానీ, ఫినో భాగస్వామ్య బ్యాంకు ద్వారా కనీసం రూ.5000 ఒక సంవత్సరం ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడం గానీ, ఖాతాలో ఏదైనా ప్రభుత్వ సంక్షేమ పథకం క్రెడిట్ కావడం గానీ ఉండాలన్నారు. ఖాతాలో కనీసం రూ. వెయ్యి బ్యాలెన్స్ ఉంచినట్లయితే, ఖాతాదారులు వెంటనే 'హాథో హాథ్' డెబిట్ కార్డు పొందవచ్చన్నారు. ఈ కార్డు ద్వారా రూ. 2 లక్షల బీమా కవరేజ్‌తో పాటు నెలవారీ వడ్డీ చెల్లింపులు, ఇంకా అనేక ప్రయోజనాలు పొందవచ్చన్నారు.

మౌలికవసతుల కల్పనకు కృషి

విశాలాంధ్ర-కూకట్పల్లి: మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తానని, సమస్యలు లేని డివిజన్ అంటే వివేకానంద నగర్ అని గ్రేటర్ పరిధిలోనే పేరు సంపాదించుకున్నామని వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజదేవి రంగారావు అన్నారు. సోమవారం హెచ్ ఎం డబ్ల్యూ ఎస్ జనరల్ మేనేజర్ బీ. ప్రభాకర్ కలిసీ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివేకానంద నగర్ డివిజన్లో సివరేజ్ లైన్స్ ఈనాడు కాలనీ, విశాల్ టవర్స్‌లో నుండి కూకట్పల్లి స్మశాన వాటిక మెడికల్ సొసైటీ వరకు, వివేకానంద నగర్ కాలనీలో, రిక్షా పుల్లర్స్ కాలనీ, రామకృష్ణ నగర్, కుమ్మరి బస్తీ, వివి నగర్ కాలనీ అపార్ట్మెంట్స్ లలో తరచుగా మురుగునీరు రోడ్డు మీద పొంగి ప్రవహిస్తుందని వినతి పత్రంలో తెలిపారు. వినతి పత్రంలో తెలియపర్చిన పనులను వీలైనంత తొందరలో లైన్స్ చేంజ్ చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా పరిస్కారిస్తామని జనరల్ మేనేజర్ ప్రభాకర్ తెలిపారన్నారు.

బాగమ్మ చిత్రపటానికి నివాళి

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: మాదాపూర్ డివిజన్ సీనియర్ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ తల్లి కీ॥శే బాగమ్మ దశ దిన కర్మ కార్యక్రమంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, చేవెళ్ల మాజీ పార్లమెంట్ సభ్యులు గడ్డం రంజిత్ రెడ్డి, ఎమ్మెల్సీ భాను ప్రసాద్, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వారి కుమారులు ఎర్రగుడ్ల రాజు యాదవ్, ఎర్రగుడ్ల ప్రభాకర్ యాదవ్, ఎర్రగుడ్ల వెంకట్ యాదవ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వేలో వివరాల సేకరణ

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వేలో భాగంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నేపథ్యంలో వివేకానంద నగర్‌లోని సప్తగిరి కాలనీలో గల పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఇంటి వద్ద డీసీ కృష్ణయ్య జీహెచ్ఎంసీ అధికారులు ఆరెకపూడి గాంధీ వరాలు నమోదు చేస్తూ, దరఖాస్తు నింపారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ దేశ చరిత్రలో తొలి సారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సమగ్ర కుల గణన చేపట్టడం జరిగినది అని, చాలా గొప్ప విషయం అని, ఎన్నో ఏండ్ల కళ నెటితో నెరవేరునని , సమగ్ర కులగణన చేపట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ సమగ్ర కులగణన ద్వారా బడుగు బలహీన వర్గాలకు, వెనుకబడిన తరగతుల కులాల జాబితాను సిద్ధం చేసి అభివృద్ధి ఫలాలు అందరికి అందేలా మంచి నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు.

జాతీయ విద్యా దినోత్సవం

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోగల జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వతంత్ర భారతావని తొలి విద్యశాఖామాత్యులు, భారతరత్న అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాదు కేంద్రీయ విశ్వ విద్యాలయం ఎడ్యుకేషన్ అండ్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ డిపార్టుమెంటుకు చెందిన ఆచార్య రావుల కృష్ణ గారు విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ దేశంలో గుణాత్మక విద్యకు మార్గదర్శి మరియు విద్యాభివృద్ధికి బాటలు వేసిన తొలి బాటసారి అబుల్ కలాం ఆజాద్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ప్రధానోపాధ్యాయురాలుఅనురాధ, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు మరియు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అమ్మయ్య చౌదరి పాల్గొన్నారు.

రోడ్డెక్కిన భవన కార్మికులు

- సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు
- 'ఉచిత ఇసుక' మోసం: ఓబులేసు
- సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి: రవీంద్రనాథ్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్/ విజయవాడ/ తిరుపతి: సమస్యల పరిష్కరించాలని కోరుతూ భవన నిర్మాణ కార్మికులు కదం తొక్కారు. ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం(ఏఐటీయూసీ) రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఇసుక సమస్యను పరిష్కరించాలని, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని రాష్ట్రవ్యాప్తంగా సోమవారం కలెక్టరేట్ల ఎదుట ఆందోళనలు కొనసాగాయి. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు కార్మికుల ధర్నాకు ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు హాజరయ్యారు. గుంటూరు కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ పాల్గొన్నారు. తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం జరిగిన సభకు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాములు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి. హరినాథరెడ్డి విచ్చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య హాజరయ్యారు. అనంతరం హరినాథరెడ్డి, రాధాకృష్ణ మాట్లాడుతూ... భారత పార్లమెంటులో ఏఐటీయూసీ అధ్వర్యంలో ప్రైవేటు బిల్లు పెట్టి భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని సాధించామన్నారు. బాపట్లజిల్లా కలెక్టరేట్ ఎదుట భవన నిర్మాణ కార్మిక సంఘం ధర్నా నిర్వహించింది. అనంతరం కలెక్టర్ వెంకట మురళీకి ఏఐటీయూసీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ వినతిపత్రం అందజేశారు.

ఇసుక పాలసీతో మభ్యపెడుతున్న ప్రభుత్వాలు

ఇసుక విధానమంటూ ప్రజలను ప్రభుత్వాలు మభ్యపెట్టి మోసగిస్తున్నాయని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు విమర్శించారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో భవననిర్మాణ కార్మిక సంఘం నగర సమితి అధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నానుద్దేశించి ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్రంలో 286 ఇసుక రీచ్‌లు ఉండగా కేవలం 162 మాత్రమే అందుబాటులోకి తీసుకువచ్చారని, ఇందులో టన్ను ఇసుక రూ.130 ఖరీదు పెట్టి ఉచిత మనడం ఎంత వరకు సబబు అని నిలదీశారు. ఇసుక సీనరేజీ జీఎస్టీ, ఎంసీడీ ఫీజులు రద్దు చేశామని ప్రభుత్వం చెబుతోందని, ఒక ట్రాక్టర్ ఇసుక కిరాయితో కలిపి రూ.7వేల వరకు దొరుకుతుందని, కొన్నిచోట్ల రూ.5 వేలకు లభిస్తోందన్నారు. దీంతో గృహ యజమానులు, బిల్డర్లు పనులు నిలిపివేసిన ఫలితంగా కార్మికులకు పనులు లేక వేలాదిమంది వెనుదిరిగి వెళ్తున్నారని, ఒక్క విజయవాడ నగరంలోని దాదాపు రోజుకు రెండువేల మంది పనులు లేక అల్లాడుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక ఏ ధర ఉందో, అదే ధర ఇప్పుడూ పలుకుతోందన్నారు. సీఎం చంద్రబాబు ఇసుక ఉచితంగా ఇస్తున్నట్లు చెబుతున్నారని, అయితే లోపం ఎక్కడ జరుగుతుందో తెలుసుకోవాలని కోరారు. క్రింది స్థాయిలో అధికారపార్టీ నాయకులు ఇసుక దోపిడీ సాగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఇసుకను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పజెప్పకుండా ప్రభుత్వమే నిర్వహించి ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పనులు కల్పించాలని కోరారు. రాష్ట్రంలో 50 లక్షల మంది భవన కార్మికులకు ఉపయోగపడే సంక్షేమ బోర్డును తక్షణం పునరుద్ధరించి 44 వేల పెండింగ్ క్లెయిములు వెంటనే విడుదల చేయాలన్నారు. గతంలో చంద్రన్న బీమాకు వాడుకున్న రూ.1200 కోట్లు బోర్డుకి జమ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ బోర్డు ద్వారా గుర్తింపు కార్డులు ఇచ్చిన 22 లక్షల మంది కార్మికులకు న్యాయం చేయాలన్నారు. సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు పవన్ కల్యాణ్... కోటి రూపాయలు విరాళం ఇస్తామని చెప్పి అధికారంలోకి రాగానే మర్చిపోయినట్టు ఉందన్నారు. బిల్డింగ్ సెస్సు రెండు శాతం తప్పకుండా వసూలు చేసి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ విజయవాడ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేఆర్ ఆంజనేయులు, మూలి సాంబశివరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నగర అధ్యక్షుడు పసుపులేటి కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి చల్ల వెంకటరమణ, నాయకులు రామస్వామి, ప్రభుదాసు, లక్ష్మయ్య, జగుపల్లి శీను, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్ వీధి విక్రయదారుల సంఘం నేత రమణ తదితరులు హాజరయ్యారు.

ఇసుక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ గుంటూరు కలెక్టరేట్ వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ(బుజ్జి) అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఇసుక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు కావస్తున్నా ఎన్నికల హామీలు అమలు జరపకపోవడం శోచనీయమన్నారు. యాభై లక్షల మంది నిర్మాణ రంగ కార్మికుల ప్రయోజనాల కోసం ఏర్పడిన సంక్షేమ బోర్డు విషయమై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణ సంక్షేమ బోర్డును వెంటనే పునఃప్రారంభించాలన్నారు. ఇసుక ర్యాంపులను ప్రభుత్వమే నడపాలని, ఇసుకపై అన్ని రకాల పన్నులు ఎత్తివేయాలని, ఇసుక తవ్వకం పనులు ప్రైవేటు వ్యవస్థలకు అప్పగించకుండా నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 42 వేల క్లైమ్‌లను పరిష్కరించి, వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఇస్తానన్న కోటి రూపాయలను తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ సంక్షేమ బోర్డు నుంచి గతంలో దారి మళ్లించిన నిధులను తిరిగి జమ చేయాలని డిమాండ్ చేశారు. గృహ యజమానులకు, కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు అవసరమైన ఇసుక నేరుగా అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న 24 గంటల లోపు లబ్ధిదారులకు ఇసుక అందించి కార్మికులను ఆదుకోవాలన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రెంటాల కుమారి ధర్నాకు మద్దతు తెలిపారు. అనంతరం కలెక్టర్ గ్రీవెన్స్‌లో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, ఉపాధ్యక్షులు కోట మాల్యాద్రి, నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, కప్పల శివ, తోకల శివయ్య, రాజు, వెంకటేశ్వర్లు, జాన్‌బాబు, శ్రీను, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అజయ్‌భవన్‌కు వియత్నాం ప్రతినిధి బృందం

న్యూఢిల్లీ: వియత్నాం ఫాదర్‌లాండ్ ఫ్రంట్ జనరల్ సెక్రటరీ, వియత్నాం కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు నొగియన్ తి ఛూ హా నాయకత్వంలో ఏడుగురు సభ్యుల అత్యున్నత స్థాయి ప్రతినిధిబృందం సోమవారం న్యూఢిల్లీలోని సీపీఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌ను సందర్శించింది. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య నాయకత్వంలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు అనిల్ రాజీం వాలే, కృష్ణఝా, ఏఐకేఎస్ అధ్యక్షులు రాజీం క్షీరసాగర్, వియత్నాం ప్రతినిధిబృందానికి స్వాగతం పలికారు. దాదాపు గంటన్నర సేపు రెండు దేశాల ప్రతినిధి బృందాలు వివిధ అంశాలపై చర్చలు జరిపాయి. మన దేశ ప్రస్తుత రాజకీయ పరిణామాలను రావుల వెంకయ్య వియత్నాం బృందానికి వివరించారు. రెండు దేశాలలోని పరిస్థితులను ప్రతినిధిబృందాలు మార్చుకున్నాయి.

అర్ధాంతర తొలగింపులు ఆపాలి

భోజనం పథకం, పాఠశాల పారిశుద్ధ్య కార్మికులకు న్యాయం చేయాలి

వెంకట సుబ్బయ్య, రమేష్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ : రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల పారిశుద్ధ్య తదితర మహిళా కార్మికులను రాజకీయ కక్ష సాధింపులతో ముడిపెట్టి అర్ధాంతరంగా తొలగించటం ఆపాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏఐటీయూసీ అధ్వర్యంలో రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల పారిశుద్ధ్యం విభాగాల డైరెక్టర్ కార్యాలయంలో సూపరిండెంట్ రత్నాకర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా కార్మికుల సమస్యకు సంబంధించి విద్యా శాఖ మంత్రికి అనేక సార్లు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేదన్నారు. తక్షణమే కార్మికుల అర్ధాంతర తొలగింపులు నిలిపివేసి, పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, తొలగించిన కార్మికులను విధుల్లో తీసుకోవాలని కోరారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ శాఖలో పని చేస్తున్న పేద కార్మికులకు అన్యాయం చేయడం తగదని అన్నారు. తొలగింపులు ఆపడానికి జీవో జారీ చేయాలని, వేతనాలను పెంచి, పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థి మెస్ చార్జీలు పెంచాలని, పెన్షన్ సౌకర్యం, హెల్త్ కార్డు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పని చేసే చోట మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక సమస్యలను పట్టించుకోకుండా ఇదే విధంగా వ్యవహరిస్తే విజయవాడలో రాష్ట్ర స్థాయి ధర్నాకు పిలుపునిస్తామని అన్నారు.

బేవరేజస్ హమాలీలకు న్యాయం చేయాలి

ఆంధ్ర ప్రదేశ్‌లో బేవరేజస్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న హమాలీలకు న్యాయం చేయాలని కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనాను కార్మిక సంఘాల నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మిగిలిపోయిన మద్యం బాక్సులను తిరిగి ప్రభుత్వం డిపోలకు తరలించిందన్నారు. ఈ మొత్తం మద్యం బాక్సులు 2,80,000 పైచిలుకు ఉన్నాయని తెలిపారు. 29 డిపోలలోని హమాలీ కార్మికులకు ఈ తరలింపు పనికి కూలి రేటు ఇవ్వకుండా ఉచితంగా పని చేయించుకోవటం అత్యంత దుర్మార్గం అన్నారు. వెంటనే హమాలీలకు బాక్స్‌కు పది రూపాయలు కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బేవరేజస్ హమాలీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (ఏఐటీయూసీ) ఎల్.లోకేశ్వరరావు, సీఐటీయూ యూనియన్ రాష్ట్ర నాయకులు ఉమామహేశ్వరరావు, కొండలరావు సుబ్బారెడ్డి, మధు, ఐఎన్‌టీయూసీ నాయకులు గుంటూరు బాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం పనుల్లో కీలక పురోగతి

- 50 శాతం పూర్తయిన విమానాశ్రయ నిర్మాణాలు
- జూన్ 2026 నాటికి పూర్తి : కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

విశాలాంధ్ర-విజయనగరం: ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించే భోగాపురం ఎయిర్ పోర్టు పనులను లక్ష్యం కంటే ముందుగానే 2026 జూన్ నాటికి పూర్తి చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. దీనికి అనుగుణంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన ఆదివారం ఆరవసారి విజయనగరం జిల్లాలోని భోగాపురం విమానాశ్రయం పనులను పరిశీలించారు. నిర్మాణ పనులు చేపడుతున్న జీఎంఆర్ ఇన్ ఫ్రా అధికారులతో కలిసి ప్రధాన టెర్మినల్ భవనం, ఏటీసీ టవర్, ఏప్రాన్, డ్రైనేజీ వ్యవస్థ, ఏరో బ్రిడ్జ్‌లు, కార్యాలయ భవనాలను తనిఖీ చేశారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత నాలుగు నెలల్లో పనుల్లో కీలక పురోగతి సాధించామని, 50 శాతం పనులు పూర్తయ్యాయని ఈ సందర్భంగా జీఎంఆర్ అధికారులు మంత్రికి వివరించారు. విభాగాల వారీగా పనుల వివరాలను తెలియజేశారు. అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ వీలయినంత వేగవంతంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. దీనికి అనుగుణంగా అధికారులు కూడా ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. భోగాపురం పూర్తి చేయడం ద్వారా ఉత్తరాంధ్రకు తలమానికంగా నిలవడంతో పాటు రాష్ట్ర అభివృద్ధిలో కీలకంగా తీర్చిదిద్దవచ్చన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనికి కేంద్రంతో పాటు సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. పరిశీలనలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

22 వరకు అసెంబ్లీ సమావేశాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఈనెల 22వ తేదీ వరకు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని బీఏసీ సమావేశం నిర్ణయించింది. తొలిరోజు శాసనసభ సమావేశం ముగిసిన అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశానికి సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, బీజేపీ పక్ష నేత విష్ణు కుమార్ రాజు హాజరయ్యారు. ఈ నెల 22 వరకూ అసెంబ్లీ సమావేశాలు జరపాలని నిర్ణయం తీసుకున్నారు. బడ్జెట్‌పై అసెంబ్లీ కమిటీహాల్‌లో మంగళవారం ఎమ్మెల్యేలందరికీ శిక్షణ తరగతులు నిర్వహించాలని, శనివారం కూడా సభ జరపాలని సమావేశం తీర్మానించింది. మొత్తం 8 బిల్లులతో పాటు ప్రభుత్వ పాలసీలకు ఆమోదం తెలపాలని, బిల్లులు, చర్చలకు అనుగుణంగా కొన్ని రోజులు అవసరమైతే రెండు పూటలా సభ జరపాలని నిర్ణయించారు. కనీసం 15 రోజులైనా అసెంబ్లీ సమావేశాలు జరగాలని, ప్రజాధనం దుర్వినియోగంతో నిర్మించిన రుషికొండపై ఒకరోజు చర్చపెట్టాలని, దానిని చూసేందుకు ఒకరోజు ఎమ్మెల్యేలను తీసుకెళ్లాలని విష్ణుకుమార్‌రాజు ప్రతిపాదించారు. వైసీపీ గైర్హాజరుపై సమావేశంలో చర్చ జరగ్గా, ఎవరి కోసమో అసెంబ్లీ సమావేశాలు ఆగవని, ప్రజా సమస్యలపై బాధ్యతాయుతమైన చర్చ జరపడం ఎమ్మెల్యేల బాధ్యత అని సీఎం వ్యాఖ్యానించినట్లు తెలిసింది. 1995లో తెల్లవారుజామున నాలుగు గంటలకు రాత్రి భోజనం చేసిన సందర్భాలు ఉన్నాయని స్పీకర్ అయ్యన్న గుర్తు చేశారు.

అందుకే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల భేటీలో జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రశ్నిస్తామన్న భయంతోనే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని వైసీపీ అధినేత వైఎస్ జగన్ అన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వేర్వేరుగా పార్టీ అధినేత వైఎస్ జగన్ భేటీలు నిర్వహించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు దూరమయ్యారు. అటు శాసన మండలి సమావేశాలకు మాత్రం ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వరుస వారీగా జగన్ సమావేశమయ్యారు. భవిష్యత్‌లో ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఎమ్మెల్సీలతోను జగన్ భేటీ అయ్యారు. శాసన మండలిలో అనుసరించాల్సిన వ్యూహాలపై వారికి దిశానిర్దేశం చేశారు. మీడియా ద్వారా ఎప్పటికప్పుడు ఈ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామన్నారు. ప్రభుత్వ విధానాలపై మండలి నుంచి ఎమ్మెల్సీలు నిలదీయాలని సూచించారు.

అసెంబ్లీకి వైసీపీ ఎమ్మెల్యేల గైర్హాజరు

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు వైసీపీ గైర్హాజరైంది. సోమవారం నుంచి ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలను వైసీపీ ఎమ్మెల్యేలు బహిష్కరించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు మిగిలిన ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరు కాలేదు. కానీ శాసన మండలి సమావేశాలకు ఆ పార్టీ ఎమ్మెల్సీలు హాజరయ్యారు. మండలిలో ఆర్థిక, వ్యవసాయ బడ్జెట్‌లను మంత్రులు కొల్లు రవీంద్ర, పి.నారాయణ ప్రవేశపెట్టారు. వైసీపీ సీనియర్ ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుతోపాటు మిగిలిన వారంతా సమావేశానికి హాజరయ్యారు. శాసన మండలి సమావేశాలు ముగిశాక... తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి ఎమ్మెల్సీలు వెళ్లి... జగన్‌ను కలిశారు. వైసీపీ ఎమ్మెల్యేలు కూడా జగన్ ఇంటికి వెళ్లారు. ఇటీవల జరిగిన మీడియా సమావేశంలో జగన్ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాబోమని పరోక్షంగా ప్రకటించారు. అసెంబ్లీలో ఉన్నది రెండే కూటములని, అందులో వైసీపీ ఒకటని..అలాంటప్పుడు వైసీపీకి ప్రతిపక్ష హోదా ఉద్దేశ్యపూర్వకంగానే ఇవ్వడం లేదని ఆరోపించారు. అదే అంశాన్ని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల భేటీలో స్పష్టం చేశారు.

ఖాతాదారుల సంక్షేమమే లక్ష్యం

వీసీబీ డైరెక్టర్ జేవీఎస్ మూర్తి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఖాతాదారులకు అనేక రకాల సేవలు, సంక్షేమ కార్యక్రమాలు అందిస్తూ ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ (వీసీబీ) వేగంగా విస్తరిస్తోందని బ్యాంక్ డైరెక్టర్ జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. విజయవాడ చంద్రం బిల్డింగ్స్‌లో సోమవారం సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. విశాలాంధ్ర న్యూస్‌ఎడిటర్ ఎం.మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేవీఎస్ఎన్ మాట్లాడుతూ మిగతా బ్యాంకుల్లో లేని పథకాలు సైతం వీసీబీ అమలు చేస్తోందని తెలిపారు. వయసు పరిమితి లేకుండా సభ్యులకు ఆరోగ్య బీమాపథకం అమలు చేస్తున్నామని చెప్పారు. కేవలం రూ.300 సభ్యుడు చెల్లిస్తే మిగిలిన రూ.900 బ్యాంకు చెల్లించి ఆరోగ్య బీమా రూ.50వేల వరకూ అందిస్తోందని తెలిపారు. మిగతా బ్యాంకుల్లో హెల్త్ ఇన్సూరెన్స్‌కు వయసు పరిమితి ఉందని చెప్పారు. రుణం కావాలంటే సభ్యుడుగా చేరాల్సి ఉంటుందని తెలిపారు. డిపాజిట్‌లకు అటువంటి నిబంధన లేదన్నారు. మెంబర్ వెల్ఫేర్ ఫండ్ స్కీమ్ ఒకటి తాజాగా తీసుకువచ్చామని తెలిపారు. వేగంగా బ్యాంకు సేవలను విస్తరిస్తూ నాలుగు బ్యాంకులను ఇప్పటికే టేకోవర్ చేసుకున్నామన్నారు. విజయవాడలో బలహీనంగా ఉన్న బ్యాంకులను టేకోవర్ చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. 570 మంది సిబ్బంది 54 బ్రాంచిలతో లాభాల బాటలో పయనిస్తూ దక్షిణ భారత దేశంలో ప్రథమ స్థానంలో నిలిచామన్నారు. త్వరలో మరో బ్రాంచిని తాడేపల్లిగూడెంలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మిగతా బ్యాంకులతో పోలిస్తే ఈ బ్యాంకులో రుణాలపై వడ్డీ రేటు తక్కువని చెప్పారు. సేవలు సులభతరంగా ఉంటాయని తెలిపారు. సభ్యుల షేర్ ధనానికి ప్రతి ఏటా డివిడెండ్ ఇస్తున్నామన్నారు. సమావేశంలో బ్యాంకు డైరెక్టర్ కోటేశ్వరరావు, పటమట బ్రాంచ్ మేనేజర్ కనకారావు, విశాలాంధ్ర చీఫ్ అకౌంటెంట్ చిలకా రాంబాబు తదితరులు పాల్గొన్నారు. తొలుత ప్రజానాట్యమండలి కళాకారుడు చంద్రనాయక్ అభ్యుదయ గేయం ఆలపించి ఉత్సాహపరిచారు.

ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ ఎన్నిక షెడ్యూల్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఉపఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ సోమవారం విడుదలయింది. డిసెంబరు 5న ఎన్నికలు నిర్వహిస్తారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. డిసెంబరు 12లోగా ఎన్నిక నిర్వహణ పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ ఎన్నికకుగాను తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కాకినాడ, కోనసీమ, ఏలూరు పరిధిలోని 16,316 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నిక కోసం ఈనెల 18 వరకు నామినేషన్ పత్రాలు స్వీకరిస్తారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల దాఖలకు సమయమిచ్చారు. వాటిని 19వ తేదీన పరిశీలిస్తారు. డిసెంబరు 9న ఫలితాలు ప్రకటిస్తారు. ఎమ్మెల్సీ షేక్ షాబ్జీ మృతితో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఇప్పటికే ఈ ఉప ఎన్నికకు ఎస్టీయూ, ఏపీయూఎస్, ఎస్ఎల్‌టీఏ అధ్యాపక సంఘాలు బలపర్చిన అభ్యర్థి డాక్టర్ గంధం నారాయణరావును పోటీలో దించారు. అటు యూటీఎఫ్ బలపర్చిన అభ్యర్థి గోపీ మూర్తి పేరును ప్రకటించారు.

కార్మికులు, కర్షకులకు అన్యాయం

బడ్జెట్‌పై ఏఐటీయూసీ, రైతుసంఘం నేతల విమర్శ

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో కార్మికులు, కర్షకుల సంక్షేమంపై బడ్జెట్‌లో స్పష్టమైన ప్రకటనలు లేవని ఏఐటీయూసీ, రైతుసంఘం నేతలు విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌లో వేతన సవరణ గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావుల పల్లి రవీంద్రనాథ్ విమర్శించారు. రాష్ట్రంలో 2006 నుంచి 73 షెడ్యూళ్లలో పనిచేస్తున్న దాదాపు 2.5లక్షల మంది కార్మికులకు వేతన సవరణ జరగలేదు. దీనివల్ల యాజమాన్యాలకు ఉపయోగంగా ఉంటుంది. 2006 నుంచి నిత్యావసరాల ధరలు మూడు వందల శాతం పెరిగాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు ఉండాలి. కనీస వేతన సవరణ బోర్డు ఏర్పాటు చేయాలి.

బడ్జెట్ అంకెల గారడీ: ఓబులేసు

శాసన సభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రూ.2.94 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ అని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు విమర్శించారు. స్వర్ణాంధ్రకి ఇది తొలిమెట్టు అనేదానికి బడ్జెట్‌కు పొంత లేదన్నారు. స్వర్ణాంధ్ర అయిన, సమగ్రాంధ్ర అయినా అన్ని రంగాలకు నిధులు కేటాయించాలి. ఆశాలు, అంగన్‌వాడీల వంటి చిరు ఉద్యోగుల జీతాల పెంపు ప్రస్తావన లేదు. రాష్ట్రంలోని పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టు ప్రస్తావన లేదు. రాయలసీమకు చెందిన మంత్రిగా ఆ ప్రాంతంలోని ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోవటం పెద్ద నష్టం. ఈ బడ్జెట్‌ని కార్మిక సంఘాలు నిరసించాలని ఓబులేసు పిలుపునిచ్చారు.

వ్యవసాయానికి తగిన కేటాయింపులు లేవు: ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్

రాష్ట్ర జనాభాలో 62%మంది ఆధారపడిన వ్యవసాయరంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత లభించలేదని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రూ.2.94 లక్షల కోట్ల బడ్జెట్‌లో వ్యవసాయ అనుబంధ రంగాలకు కేవలం రూ.43,400 కోట్లు మాత్రమే ప్రతిపాదించారన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయానికి రూ.4,500 కోట్లు ప్రకటించినా...ఎప్పటినుండి అమలు చేసేది ప్రకటించలేదు. రైతుల పంటల భీమా పథకానికి రూ.1,023 కోట్లు ప్రకటించారు. రబీ పంట కాలానికి ప్రీమియం చెల్లింపు రైతులే భరించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం అభ్యంతరకరం. అలాగే ధరల స్థిరీకరణ నిధికి కేటాయింపులు లేవు. ఎన్టీఆర్ జలసిరికి కేవలం రూ.50 కోట్లు కేటాయించడం ఏమాత్రం సరి పోదు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు కేటా యింపులను భారీ స్థాయిలో పెంచాలి. భూసారానికి వినియోగించే జిప్సం, బోరాన్, మెగ్నీషియం, కాఫర్ తదితర సూక్ష్మ పోషకాలకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు లేకపోవడం దురదృష్టకరమని వారు పేర్కొన్నారు. బడ్జెట్‌లో వ్యవసాయ అనుబంధ రంగాలకు, సాగునీటి రంగాలకు ప్రాధాన్యత పెంచాలని డిమాండ్ చేశారు.

పేదల వ్యతిరేక బడ్జెట్

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాలుగు నెలల బడ్జెట్ పేదల సంక్షేమానికి అనుకూలంగా లేదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జల్లి విల్సన్, అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, ఉప ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. పేదలకు విద్య, వైద్యం, ఆరోగ్యం కోసం అరకొర కేటాయింపులే ఉన్నాయని పేర్కొన్నారు. ఇళ్ల స్థలాలకు ప్రత్యేక నిధులు కేటాయించలేదని తెలిపారు. సూపర్ సిక్స్ హామీలకు ఎగనామం పెట్టారని, మహిళల సంక్షేమంపైనా స్పష్టత లేదని, నిరుద్యోగ భృతి, వృత్తిదారులకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు. ఎస్సీ, ఎస్టీల పట్ల ప్రభుత్వానికి ఏ మాత్రం ప్రేమ కనిపించలేదన్నారు. దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల పేదలకు సంపద సృష్టి మార్గాలను చూపలేదన్నారు. చంద్రబాబు ఎన్నికల హామీలు ఒట్టి మాటలేనని ఈ బడ్జెట్ కేటాయింపులు చూస్తే అర్థమవుతున్నదన్నారు. ఉపాధి హామీ పథకానికి ప్రత్యేక కేటాయింపులు లేవని, వలసల నివారణకు ఏ మార్గాలు చూపలేదని, పెరిగిన ధరలకనుగుణంగా ఉపాధి కూలీలకు పని దినాలు, రోజు కూలి పెంపు బడ్జెట్‌లో చూపలేదని పేర్కొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.